

విద్యారంగ సమస్యలపై సమీక్ష చేయని ప్రభుత్వం

- హుస్నాబాద్‌కు చేరిన ఎస్ఎఫ్ఐ సైకిల్ యాత్ర

నవతెలంగాణ హుస్నాబాద్ రూరల్

విద్యారంగంలో ఉన్నా సమస్యల పై విద్యాశాఖ ,రాష్ట్ర ప్రభుత్వం సమీక్ష చేయకపోవడం, ఎన్నికల పట్ల ఉన్న శ్రద్ధ కనీసం విద్యారంగం పైన లేకపోవడం విడ్డూరంగా ఉందని సిద్దిపేట జిల్లా అధ్యక్ష,కార్యదర్శులు రెడ్డమైన అరవింద్ దాసరిప్రశాంత్ లు అన్నారు. ప్రభుత్వ విద్యారంగాన్ని గాలికి వదిలేసి ప్రైవేట్ కార్పొరేట్ లకు రెడ్ కార్పెట్ వేసి వెల్ కమ్ చెప్తుందని ఎస్ ఎఫ్ ఐ చేపట్టిన సైకిల్ యాత్ర బుధవారం హుస్నాబాద్ కు చేరుకుంది. ఈ సందర్భంగా మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రభుత్వ విద్యారంగాన్ని నిర్వీర్యం చేసే కుట్ర పన్నుతుందన్నారు. జిల్లా వ్యాప్తంగా ఉన్న విద్యారంగ సమస్యలను తక్షణమే పరిష్కరించాలి హుస్నాబాద్ నియోజకవర్గ కేంద్రంలో గజ్వేల్ మోడల్ హబ్ ని ఏర్పాటు చేయాలని అన్నారు. హుస్నాబాద్ లో ప్రభుత్వ ఎస్సీ పోస్టుమెట్రిక్ హాస్టల్ ను ఏర్పాటు చేయాలన్నారు. జిల్లా ఉపాధ్యక్షుడు కొండం సంజీవ్ ,జిల్లా సహాయ కార్యదర్శి నాచారం శేఖర్, సంతోష్, జిల్లా నాయకులు ఆముదాల రంజిత్ రెడ్డి, సుద్దాల భాస్కర్, భరత్ ప్రశాంత్ మధు, ప్రవీణ్ పాల్గొన్నారు.

మెదక్ సంగారెడ్డి సిద్దిపేట

నవతెలంగాణ 1

గురువారం 20 జులై 2023

అన్ని శాఖల సమన్వయంతోనే మైనార్టీల అభివృద్ధి

- మైనార్టీల సంక్షేమంపై దృష్టి సారించాలి
- మైనార్టీ సంక్షేమ కార్యక్రమాల అమలుపై సమీక్షించిన జాతీయ మైనార్టీ కమిషన్ సభ్యురాలు సయ్యద్ షెహజాదీ





నవతెలంగాణ-మెదక్ ప్రాంతీయ ప్రతినిధి

అన్ని శాఖల సమన్వయంతోనే మైనార్టీల అభివృద్ధి సాధ్యమని, మైనార్టీల సంక్షేమంపై దృష్టి సారించాలని జాతీయ మైనార్టీ కమిషన్ సభ్యురాలు సయ్యద్ షెహజాదీ అన్నారు. మైనార్టీ సంక్షేమ కార్యక్రమాలు పూర్తి స్థాయిలో అమలు చేయాలని అన్నారు. బుధవారం జిల్లా పర్యటనకు విచ్చేసిన జాతీయ మైనారిటీ కమిషన్ సభ్యురాలు కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో ప్రధానమంత్రి 15 సూత్రాల కార్యక్రమం, కేంద్ర, రాష్ట్ర పథకాల అమలు తీరుపై సంబంధిత శాఖల జిల్లా అధికారులతో సమీక్ష నిర్వహించారు. జిల్లాలో మైనార్టీల స్థితిగతులు, వారి జనాభా, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ పథకాల అమలు గురించి ఆయా శాఖల అధికారులను అడిగి తెలుసుకున్నారు. కేజీబీవీలు, మైనార్టీ గురుకులాల్లో చదువుతున్న విద్యార్థులకు అందుతున్న సదుపాయాలు, మధ్యాహ్న భోజనం, కెసిఆర్ కిట్, అంగన్వాడీ కేంద్రాలలో ఇస్తున్న న్యూట్రిషన్ ఫుడ్, బస్తీ దవాఖానాలు, మైనార్టీలకు ఏర్పాటు చేసిన శిక్షణ కేంద్రాలు, షాదీముబారక్‌లో మైనార్టీలకు చేకూరిన లబ్ధి, బ్యాంకుల ద్వారా మైనార్టీలకు అందించిన వివిధ రుణాలు, రాష్ట్ర, కేంద్ర ప్రభుత్వాల పథకాల అమలు తదితర అంశాలపై ఆయా శాఖల అధికారులను అడిగి తెలుసుకున్నారు. మైనార్టీ రెసిడెన్షియల్ విద్యా సంస్థలు, మహిళా శిశు సంక్షేమం, జిల్లా గ్రామీణ అభివృద్ధి సంస్థ, మెప్మా, విద్యా, బ్యాంకింగ్, రెవిన్యూ, తదితర శాఖల ద్వారా మైనారిటీలకు అమలు చేస్తున్న కార్యక్రమాలు, వాటి ప్రగతి గురించి ఆయా శాఖల అధికారులు కమిషన్ సభ్యురాలి దృష్టికి తెచ్చారు. ఈ సందర్భంగా షెహజాదీ మాట్లాడుతూ మైనార్టీ సంక్షేమం కోసం ఉద్దేశించిన కార్యక్రమాలు పూర్తి స్థాయిలో అమలు జరిగేలా అధికారులు అంకితభావంతో పని చేయాలని సూచించారు. మైనార్టీల అభ్యున్నతికి కృషి చేయాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు. స్వయం సహాయక సంఘాలకు సంబంధించి వారు చేస్తున్న ఆయా పనులలో వృత్తి నైపుణ్య శిక్షణలు ఇవ్వడంపై దృష్టి సారించాలన్నారు. నిరుద్యోగ యువతకు అందిస్తున్న ఉచిత శిక్షణ కేంద్రాల్లో అధిక సంఖ్యలో యువతులు శిక్షణ పొందేలా ప్రోత్సహించాలన్నారు. విద్య, ఉపాధి రంగాలకు సంబంధించి మైనార్టీలకు విరివిగా రుణాలు అందజేయాలన్నారు. విదేశాల్లో ఉన్నత విద్యాభ్యాసం కోసం ప్రభుత్వం పెద్ద ఎత్తున ఆర్థిక తోడ్పాటును అందిస్తున్నందున, అర్హులైన వారందరు సద్వినియోగం చేసుకునేలా విస్తృత ప్రచారం చేయాలని సూచించారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అందిస్తున్న వివిధ పథకాల గురించి, వాటిని ఎలా సద్వినియోగం చేసుకోవాలనే దానిపై వారికి అవగాహన కల్పించేందుకు తగు చర్యలు చేపట్టాలని ఆదేశించారు. అనంతరం కలెక్టరేట్లో ఏర్పాటు చేసిన ఓటర్ అవగాహన కేంద్రాన్ని ఆమె సందర్శించారు. ఓటు వేసి పరిశీలించారు. సమావేశంలో జిల్లా ఎస్పీ రమణ కుమార్, అదనపు కలెక్టర్ వీరారెడ్డి, జిల్లా రెవెన్యూ అధికారి నగేష్, జిల్లా మైనారిటీ సంక్షేమ శాఖ అధికారి అరుణ్ కుమార్, జెడ్పి సీఈఓ ఎల్లయ్య, జిల్లా పరిశ్రమల శాఖ అధికారి ప్రశాంత్ కుమార్, డి ఆర్ డి ఓ శ్రీనివాసరావు, సంక్షేమ శాఖ అధికారి పద్మావతి, డి ఎం అండ్ హెచ్ ఓ డాక్టర్ గాయత్రీ దేవి, మెప్మా పిడి గీత, ఆర్డీ ఓ లు రవీందర్ రెడ్డి, వెంకారెడ్డి, పాండు పాల్గొన్నారు.

బాధ్యతలు స్వీకరించిన అదనపు కలెక్టర్లు

- బదుగు చంద్రశేఖర్ • ఆర్.డి.మాధురి • సీసీఎల్ఏకు వీరారెడ్డి బదిలీ

నవతెలంగాణ-మెదక్ ప్రాంతీయ ప్రతినిధి





సంగారెడ్డి జిల్లా స్థానిక సంస్థల అదనపు కలెక్టర్‌గా బి.చంద్రశేఖర్, అదనపు కలెక్టర్ (రెవెన్యూ)గా ఆర్.డి.మాధురి బుధవారం బాధ్యతలు స్వీకరించారు. అదనపు కలెక్టర్లు ఇద్దరూ జిల్లా కలెక్టరేట్‌లోని తమ తమ చాంబర్లలో ఉద్యోగ బాధ్యతలను స్వీకరించారు. ఈ సందర్భంగా డి ఆర్ ఓ నగేష్, రెవెన్యూ అధికారులు, వివిధ శాఖల జిల్లా అధికారులు అదనపు కలెక్టర్లకు స్వాగతం పలికి, పరిచయం చేసుకున్నారు. శుభాకాంక్షలు తెలిపారు. నిజామాబాద్ జిల్లా అదనపు కలెక్టర్(రెవిన్యూ)గా కొనసాగిన బి.చంద్రశేఖర్‌ను సంగారెడ్డి జిల్లా అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు)గా నియమిస్తూ ప్రభుత్వం ఇటీవలే ఉత్తర్వులు జారీ చేసింది. సంగారెడ్డి జిల్లా అదనపు కలెక్టర్(రెవెన్యూ)గా కొనసాగిన జి.వీరారెడ్డిని సీసీఎల్ఏ కార్యాలయానికి బదిలీ చేస్తూ, ఆయన స్థానంలో జగిత్యాల ఆర్డీఓగా పనిచేస్తున్న ఆర్.డి. మాధురిని జిల్లా అదనపు కలెక్టర్ (రెవిన్యూ)గా ప్రభుత్వం నియమించింది.

సంతోషి మాత దేవాలయ పాలకమండలి ప్రమాణ స్వీకారంలో మంత్రి



నవ తెలంగాణ - సిద్దిపేట

సిద్దిపేట పట్టణంలోని కొలువైయున్న మహిమాన్విత పుణ్యక్షేత్రం శ్రీ సంతోషి మాత దేవాలయ పాలకమండలి ప్రమాణ స్వీకార కార్యక్రమంలో మంత్రి హరీష్ రావు పాల్గొన్నారు. అమ్మవారి కి నూతన వెండి మకర తోరణం సమర్పించారు. అమ్మవారికి పూజలు నిర్వహించారు. నూతన పాలక మండలి ప్రమాణ స్వీకారం చేపించి వారిని సన్మానించారు. ఆధ్యాత్మిక సేవలో ఆలయ అభివృద్ధి కి కృషి చేయాలని సూచించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రూ.50 లక్షల తో ఆలయ అభివృద్ధి పనులు జరుగుతున్నాయన్నారు. ఎన్నో ఏళ్ల కోరిక శ్రీ సంతోషి మాత ఆలయ తూర్పు ద్వారం వచ్చే శ్రావణ మాసం లో అద్భుతమైన రాజగోపురం తో ప్రారంభించుకోబోతున్నామని తెలిపారు. నూతన పాలక మండలి సభ్యులకు శుభాకాంక్షలు తెలిపారు. ఆలయ కమిటీ చైర్మన్ నవీన్ కుమార్, కమిటీ సభ్యులు సత్యంగౌడ్ తదితరులు పాల్గొన్నారు.

ఉచిత కుట్టు మిషన్ శిక్షణను సద్వినియోగం చేసుకోవాలి



నవతెలంగాణ సిద్ధిపేట రూరల్

ఉచిత కుట్టు మిషన్ శిక్షణ ను మహిళలు సద్వినియోగం చేసుకోవాలని సుడా చైర్మన్ మారెడ్డి రవీందర్‌రెడ్డి అన్నారు. బుధవారం సిద్దిపేట రూరల్ మండల పరిధిలోని పుల్లూరు గ్రామంలో మంత్రి హరీష్‌రావు ఆదేశాల మేరకు ఉచిత కుట్టు మిషన్ శిక్షణను ప్రారంభించారు. అనంతరం వారు మాట్లాడుతూ మహిళలుకు రూపాయి ఖర్చు లేకుండా ఉచితంగా కుట్టు మిషన్ శిక్షణ ఇస్తున్నారని గ్రామంలో మహిళలందరూ సద్వినియం చేసుకోవాలని సూచించారు. శిక్షణ తీసుకున్న వారికి కుట్టుమిషన్ సంబంధించిన వస్తువులను వారికి పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఎంపీపీ శ్రీదేవి చందర్రావు, జెడ్పిటిసి శ్రీహరి గౌడ్ ,సర్పంచ్ పల్లె నరేష్ గౌడ్ ఏపీఎం విజయనిర్మల, రైతుబంధు సమితి మండల అధ్యక్షులు మోకిల్ల మోహన్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

జాతీయ ఆహార భద్రతా చట్టం అమలుపై ఆరా



నవ తెలంగాణ - సిద్దిపేట

2020-2023 లో తెలంగాణ రాష్ట్రంలో జాతీయ ఆహార భద్రతా చట్టం, 2013 ఫేజ్-2 పని తీరును పర్యవేక్షించడం కోసం సెంటర్ ఫర్ డెవలప్మెంట్ కమ్యూనికేషన్ అండ్ స్టడీస్ సెంట్రల్ టీం అధికారులు జిల్లాలో పలు రేషన్ షాపులు దర్శించి, కార్డుదారులతో జాతీయ ఆహార భద్రతా చట్టం అమలు పని తీరుపై ఆరా తీశారు. అలాగే మధ్యాహ్న భోజన పథకం తీరుతెన్నులను గవర్నమెంట్ గర్ల్స్ ప్రైమరీ స్కూల్‌ను సందర్శించి విద్యార్థులతో ముఖాముఖి సంభాషించారు.

ఉచిత విద్యుత్ ఇస్తున్న ప్రభుత్వం తెలంగాణ

జనగామ ఎమ్మెల్యే ముత్తిరెడ్డి యాదగిరిరెడ్డి



నవతెలంగాణ-చేర్యాల

రైతుల మేలుకోరి ఉచిత విద్యుత్తు ఇస్తున్న ప్రభుత్వం తెలంగాణ రాష్ట్రమని జనగామ ఎమ్మెల్యే ముత్తిరెడ్డి యాదగిరి రెడ్డి అన్నారు. చేర్యాల మండలం ముస్త్యాల గ్రామంలోని రైతు వేదికలో బుధవారం గ్రామ సర్పంచ్ పెడతల ఎల్లారెడ్డి అధ్యక్షతన రైతులతో ఎమ్మెల్యే సమావేశం నిర్వహిం చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ రాష్ట్ర అధ్యక్షుడు రేవంత్ రెడ్డి వ్యవసాయానికి మూడు గంటల విద్యుత్ ఇస్తున్నామనడం హాస్యాస్పదమని, తమ ప్రభుత్వం రైతుల మేలుకొరి 24 గంటల ఉచిత విద్యుత్ ఇస్తుంటే కాంగ్రెస్ మూడు గంటలు అనడం రైతులకు ద్రోహం చేయడమేనని అన్నారు. కేంద్రంలో బిజెపి ప్రభుత్వం ప్రధాని మోడీ సొంత రాష్ట్రంలోనే 9 గంటల ఉచిత విద్యుత్ ఇస్తుంటే, తెలంగాణలో మీరెందుకు 24 గంటలు ఇస్తున్నారని ఇక్కడి ప్రభుత్వం పై ఒత్తిడి తెస్తుందని విమర్శించారు. దేశంలోనే అన్ని రాష్ట్రాల కన్నా అద్భుతమైన సంక్షేమ పథకాలు అందిస్తున్న ఏకైక ప్రభుత్వం బీఆర్ఎస్ ప్రభుత్వం అని అన్నారు. వచ్చే ఎన్నికల్లో బిజెపి కి ఒక్క సీటు కూడా రాదని, కేంద్రం నుండి రాష్ట్రానికి రావాల్సిన నిధులను ఆపేస్తున్నారని మండిపడ్డారు. ఈ కార్యక్రమంలో చేర్యాల వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ మల్లేశం, ఎంపీపీ కరుణాకర్, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు అనంతల మల్లేశం, వైస్ ఎంపీపీ తాంద్ర నవీన్ రెడ్డి,యూత్ నాలుగు మండలాల ఇంచార్జి శివగారి అంజయ్య, పలువురు సర్పంచ్ లు,ఎంపీటీసీ లు,రైతులు తదితరులు పాల్గొన్నారు.

శిథిలావస్థకు చేరిన గృహాలను వెంటనే ఖాళీ చేయండి



నవతెలంగాణ-సిద్దిపేట

శిథిలావస్థకు చేరిన గృహాలను వెంటనే ఖాళీ చేయాలని మున్సిపల్ కమిషనర్ సంపత్ కుమార్ పట్టణ ప్రజలకు సూచించారు. పట్టణంలోని 33 వ వార్డులో బి ఆర్ ఎస్ నాయకులు మొయిజ్ తో కలిసి వార్డులో శిథిలావస్థకు చేరిన గృహాలను పరిశీలిం చారు. వర్షాలు కురుస్తున్నందున శిథిలావస్థకు చేరిన గృ హాలలో నివాసం ఉండకూడదని, వర్షాలకు కూలినట్లైతే ప్రాణాపాయం కలుగుతుందని, ఖాళీ చేసి సురక్షిత ప్రాంతాలకు వెళ్లాలన్నారు. పెంకుటింట్లో ఉన్నటువంటి అంగన్వాడీ కేంద్రాన్ని ఖాళీ చేయాలని సూచించారు.

పారిశుధ్య కార్మికులు సమ్మె వీడి విధుల్లో చేరండి

- రాష్ట్ర ఆర్థిక, వైద్య ఆరోగ్య శాఖ మంత్రి హరీశ్‌రావు

నవ తెలంగాణ - సిద్దిపేట



'వర్షాకాలం నేపథ్యంలో సీజనల్ వ్యాధుల వ్యాపిస్తాయి. ప్రజలకు ఇబ్బందులు తలెత్తుతాయి. అంటువ్యాధులు పెరిగే అవకాశం ఉంటుంది. పారిశుద్య కార్మికుల విషయాన్ని ప్రభుత్వం తప్పకుండా ఆలోచన చేస్తుంది. సీజనల్ వ్యాధులు ప్రబలే దృష్ట్యా ప్రజలకు ఇబ్బందులు కలుగకుండా చూడాలి. దయచేసి గ్రామ పంచాయతీ కార్మికులంతా వెంటనే సమ్మె వీడి తమ విధుల్లో చేరాలి' అని రాష్ట్ర ఆర్థిక, వైద్య ఆరోగ్య కుటుంబ సంక్షేమ శాఖ మంత్రి హరీశ్ రావు విజ్ఞప్తి చేశారు. పారిశుద్య కార్మికుల విషయాన్ని ప్రభుత్వం తప్పకుండా ఆలోచన చేస్తుందని, ఇటీవల ముఖ్యమంత్రి కేసీఆర్ అడగకుండానే వెయ్యి రూపాయల వేతనాన్ని పెంచారని గుర్తు చేశారు. ఇప్పటికీ ఆయన దృష్టిలో పారిశుద్య కార్మికుల డిమాండ్లు ఉన్నాయని, సమయానుకూలంగా నిర్ణయం తీసుకుంటారన్నారు. పంచాయతీ రాజ్ గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు మీతో చర్చలు జరిపి తప్పకుండా వీలైనంత వరకూ త్వరితగతిన సాయం చేసేందుకు ప్రయత్నం చేస్తున్నారని తెలిపారు. పారిశుద్య కార్మికులంతా సమ్మెను విరమించి అందరూ పని చేయాలని, ప్రజలకు ఇబ్బందులు కలుగకుండా చూడాలని విజ్ఞప్తి చేశారు. ఇతర రాష్ట్రాల కంటే మన తెలంగాణ రాష్ట్రంలో పారిశుద్య కార్మికుల వేతనాలు ఇస్తున్నట్లు తెలిపారు. గత ప్రభుత్వాలలో 500, 1000 కూడా లేని వేతనాలను గ్రామాల్లో కార్మికులు గౌరవంగా బతకాలనే ఉద్దేశ్యంతో అడగకుండానే 8 వేల 500 రూపాయలకు పెంచారని, అడగకుండానే ఈ మధ్యే 8 వేల 500 నుంచి 9 వేల 500కు పెంచిన మనసున్న మనిషి కేసీఆర్ అని తెలిపారు. బీజేపీ, కాంగ్రెస్ పాలిత ప్రాంతాలలో కనీసం మనుషులుగా కూడా ఆ ప్రభుత్వాలు చూడట్లేదని, ఉత్తర ప్రదేశ్ లో 5 వేల 200, మన పక్క రాష్ట్రమైన ఆంధ్రప్రదేశ్ లో 5 వేల 200, ఛత్తీస్గఢ్ లో అసలు ప్రభుత్వం వేతనం ఇవ్వడం లేదని, గ్రామ పంచాయతీలే తోచినంత ఇస్తున్నాయని, ఒరిస్సాలో ఇంటికి రూ.5 మాత్రమే ఇస్తున్నారని, పశ్చిమ బెంగాల్ లో అయితే 'పెయిడ్ వర్కర్స్' అని పెట్టి నెలకు కేవలం 500 రూపాయలు మాత్రమే ఇస్తున్నారని, కేరళ శానిటేషన్ వర్కర్లు అని పెట్టి ఇద్దరికీ ఇంటికి కేవలం 30 రూపాయలు ఇస్తున్నారని, అంటే ఒక వార్డులో పని చేస్తే కనీసం 4 నుంచి 5 వేలు కూడా రాని పరిస్థితి ఉన్నదన్నారు. దేశమంతా ఇలాంటి పరిస్థితులు ఉంటే మన ముఖ్యమంత్రి కేసీఆర్ పల్లె ప్రగతి లాంటి గొప్ప కార్యక్రమాన్ని తీసుకుని, మన పల్లెలు దేశానికే ఆదర్శంగా నిలిచేటట్లు చేశారని గుర్తు చేశారు. సమ్మెలు, ధర్నాలు వంటి కార్యక్రమాల్లో పాల్గొని తెలంగాణ పల్లెలకున్న గొప్ప పేరును ఖరాబు చేయొద్దని పారిశుద్య కార్మికులను మంత్రి వేడుకున్నారు. కొంత మంది క్వాలిఫైడ్ కార్మికులు అసిస్టెంట్ పంచాయతీ కార్యదర్శిగా గుర్తింపు ఇవ్వాలని కోరినట్లు, దాన్ని కూడా సీఎం కేసీఆర్ దృష్టికి తీసుకువెళ్తామని తెలిపారు.

కేసీఆర్ ప్రభుత్వం రైతులకు భరోసా

- కాంగ్రెస్ హయాంలో పేలిపోయే ట్రాన్స్ఫార్మర్స్, కాలిపోయే మోటార్లు
- 3 గంటలు వద్దు.. 24 గంటల కరెంటు కావాలి
- చంద్రబాబువారసుడు రేవంత్‌రెడ్డి
- కాళేశ్వరంతో పంట పెరిగింది
- రాష్ట్ర ఆర్థిక వైద్య ఆరోగ్యశాఖ మంత్రి హరీశ్‌రావు



నవతెలంగాణ- సిద్దిపేటరూరల్

సీఎం కేసీఆర్ ప్రభుత్వం రైతులకు భరోసానిస్తుందని మంత్రి హరీశ్‌రావు అన్నారు. బుధవారం సిద్దిపేట రూరల్ మండల పరిధిలోని రాఘవపూర్ గ్రామంలో రైతు వేదికలో 3 గంటల కరెంటు చాలు అని కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు రేవంత్ రెడ్డి వ్యాఖ్యలకు నిరసనగా రైతులు నిర్వహించిన సమావేశంలో జడ్పీ చైర్ పర్సన్ రోజా శర్మతో కలిసి ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ హయాంలో పేలిపోయే ట్రాన్సార్మర్స్, కాలిపోయే మోటార్లని, తెలివి లేని కాంగ్రెస్ నాయకులు 3 గంటల కరెంట్ సరిపోతదంటున్నారని అన్నారు. 3 గంటల కరెంట్ అందించే పార్టీ కావాలా? 3 పంటలకు 24 గంటల ఉచిత కరెంట్ అందించే బీఆర్ఎస్ ప్రభుత్వం కావాలో ఆలోచన చేయాలని కోరారు. కెసిఆర్ రైతు ప్రభుత్వం భరోసా దొరికింది. కాలేశ్వరం నీటితో ఎండాకాలంలో మత్తడ్లు దుంకుతుందంటే అది కేసీఆర్ చొరవ అన్నారు. చంద్రబాబు నాయుడు వారసుడు రేవంత్ రెడ్డి అని, కాంగ్రెస్ పార్టీని పాతర పెట్టాలని అన్నారు. ఇప్పటి వరకు రైతు బంధు కింద 11 విడతల్లో రూ.72 వేల కోట్లు అందించిన ఘనత సీఎం కేసీఆర్దే అన్నారు. 24 గంటల కరెంట్ కోసం ప్రతి యేటా రూ.12 వేల కోట్లు ఖర్చు చేస్తున్నామన్నారు. ఒక్క రాఘవాపూర్ గ్రామంలో 40 మంది రైతులకు రైతుబీమా అందించామన్నారు. రాష్ట్రంలో 1 లక్ష 6 వేల 74 మంది రైతులకు రైతు బీమా అందించామన్నారు. ఒకనాడు బతుకుదెరువు కోసం తెలంగాణ వాళ్లు పక్క రాష్ట్రాలకు పోతే ఇవాళ ఇతర రాష్ట్రాల నుంచి వరినాట్లు వేయడానికి కార్మికులు వలస వచ్చే స్థితికి తెలంగాణ చేరిందన్నారు. కార్యక్రమంలో సుడా చైర్మన్ మారెడ్డి రవీందర్ రెడ్డి, ఎంపీపీ శ్రీదేవి చంద్రరావు, జెడ్పిటిసి శ్రీహరి గౌడ్, సర్పంచ్ ఏర్వ రమేష్, ఆత్మ కమిటీ చైర్మన్ లక్కర్స్ ప్రభాకర్ వర్మ బిఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు యాదయ్య, రైతు బంధు సమితి మండల అధ్యక్షులు మోకిల్ల మోహన్ రెడ్డి, ఉప సర్పంచ్ కనకరాజు తదితరులు పాల్గొన్నారు.

పంచాయతీ కార్మికులను పర్మినెంట్ చేయాలి

- కర్ణాటక తరహాలో జీతాలు పెంచాలి
- కార్మికులపై వేధింపులు ఆపాలి
- సీఐటీయు సిద్దిపేట జిల్లా అధ్యక్షులు సందబోయిన ఎల్లయ్య



నవ తెలంగాణ- గజ్వేల్

తెలంగాణ రాష్ట్రంలో గ్రామపంచాయతీ కార్మికులందరినీ పర్మినెంట్ చేసి కర్ణాటక తరహాలో జీతాలు పెంచి వీడియే అమలు చేయాలని సీఐటీయు సిద్దిపేట జిల్లా అధ్యక్షులు సందబోయిన ఎల్లయ్య ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. రాష్ట్ర వ్యాప్తంగా గత 14 రోజులు గా సమ్మె చేస్తున్న ప్రభుత్వం కక్షపూరిత చర్యలకు పాల్పడుతూ వేధింపులకు గురిచేస్తుంది అని విమర్శించారు గ్రామపంచాయతీలో 99 శాతం దళితులు పనిచేయడం జరుగుతుందని అన్నారు. గ్రామ ప్రజల కోసం తమ ఆరోగ్యాన్ని పణంగా పెట్టి పని చేస్తూ ఉంటే ప్రభుత్వం సమరసపూర్వకంగా పరిష్కరించాల్సింది పోయి బెదిరింపులకు గురిచేస్తుందని అన్నారు. కర్ణాటక రాష్ట్రంలో గ్రామపంచాయతీ కార్మికులకు 14000 నుండి 20వేల వరకు వేతనాలు విడియే అమలు చేయడం జరుగుతుందని తెలంగాణ రాష్ట్రంలో ఎందుకు అమలు చేయలేదని ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. తెలంగాణ ధనిక రాష్ట్రం ఉన్న దళితులు సామాజికంగా ఆర్థికంగా అభివృద్ధి చెందకూడద, గ్రామపంచాయతీ కార్మికుల కుటుంబాలు అప్పుల ఊబిలో కూర్కుపోవాల అని ప్రశ్నించారు. నిత్యవసర సరుకులు ధరలు రోజువారి ఖర్చులు పెరిగి చాలీచాలని వేతనాలతో కుటుంబాలు ఆర్థికంగా వెనుకబడిపోయాయని అన్నారు. గ్రామ ప్రజల్లో భాగమైన గ్రామపంచాయతీ కార్మికులను ప్రభుత్వాలు ఆదుకోవాలని డిమాండ్ చేశారు. అనేక గ్రామపంచాయతీలో గత ఆరు నెలలుగా వేతనాలు ఇవ్వక వేధింపులకు గురి చేస్తున్నారని తెలిపారు. పై స్థాయి ఉద్యోగులకు వివిధ రూపాల్లో పిఆర్సి కమిషన్ ద్వారా వీడిఏ ఇతర అలవెన్స్ ద్వారా జీతాలు పెరిగిన గ్రామపంచాయతీ కార్మికుల మాత్రం వేతనాలు పెంచడం లేదని అన్నారు. ప్రభుత్వం జేఏసీ నాయకత్వంతో చర్చలు జరిపి సమరసపూర్వకంగా వేతనాలు పెంచాలని గ్రామపంచాయతీ కార్మికుల కుటుంబాలను ఆదుకోవాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో వర్షాన్ని సైతం లెక్కచేయకుండా సమ్మె చేస్తున్న గ్రామపంచాయతీ కార్మికులు మరింత పోరాటానికి సిద్ధమవుతారని ప్రభుత్వానికి హెచ్చరించారు. సీఐటీయు నాయకులు వెంకట చారి గ్రామపంచాయతీ యూనియన్ నాయకులు స్వామి, లక్ష్మీ ,నాంపల్లి మల్లయ్య, నాగరాజు, ఎల్లం,పోశయ్య, రాములు బిక్షపతి, యాదగిరి, రాజు, శ్రీనివాసు, తిరుపతి తదితరులు పాల్గొన్నారు.

నవతెలంగాణ-నంగునూరు: గ్రామ పంచాయతీ కార్మికుల సమస్యలు పరిష్కరించడం లేదని నిరసిస్తూ బుధవారం నంగునూరు మండల కేంద్రంలో వర్షంలోనూ నిరసన వ్యక్తం చేశారు. నంగునూరు మండల ప్రజా పరిషత్ కార్యాలయం ముందు గ్రామపంచాయతీ కార్మికులు చేపట్టిన సమ్మె 14వ రోజుకు చేరుకుంది.ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షంలో కూర్చొని నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా జిల్లా జేఏసీ నాయకురాలు దేవులపల్లి బాల్ నరసవ్వ మాట్లాడుతూ సమ్మెను విచ్ఛినం చేయడానికి పంచాయతీ కార్యదర్శి, గ్రామ సర్పంచ్ కలిసి గ్రామ పంచాయతీలలో ప్రైవేట్ గా కూలి పనులు చేయిస్తున్నారని ఆరోపించారు. పనికి తగ్గ వేతనం ఇవ్వాలని పోరాడుతుంటే మా సమస్యను పరిష్కరించకుండా కూలీలను పెట్టి పనులు చేయించడంలో మీ ఆంతర్యం ఏమిటో కనబడుతుందన్నారు. గ్రామపంచాయతీ కార్మికులకు ప్రభుత్వం నుండి వచ్చిన జీతాన్ని కూడా కలిపి మిగతా వారికి చెల్లించడం ఏమిటని ప్రశ్నించారు. గ్రామ జనాభా బట్టి గ్రామపంచాయతీ కార్మికులను నియమించకుండా గ్రామ సర్పంచ్, పంచాయతీ కార్యదర్శులు జాప్యం చేస్తున్నారని విమర్శించారు. సమస్యలు పరిష్కరించాలని సమ్మె చేస్తే ఉద్యోగాలు పోతాయని బెదిరించడం ఏమిటని ప్రశ్నించారు. ఇప్పటికైనా మానుకొని మా సమస్యను పరిష్కరించేలా కృషి చేయాలని కోరారు.ఈ కార్యక్రమంలో జేఏసీ నాయకులు దేవులపల్లి రాజమౌళి, నర్సింలు, కనకయ్య, బాలయ్య రవి, కలవ్వ, పర్శరాములు తదితరులు పాల్గొన్నారు.

హెల్మెట్ బాంధవుడు రజనీకాంత్‌రెడ్డి

నవ తెలంగాణ-దుబ్బాక







మానవ శరీరంలో తల ముఖ్యమైనది. తలకు తప్ప మిగతా ఎక్కడా దెబ్బలు తాకినా మనిషి ప్రాణాలతో బయటపడగలడు. తలకు ఏమైనా దెబ్బలు తగిలితే మెదడుకు ప్రమాదం చివరకి మనిషి బతకడం కష్టమవుతుంది. హెల్మెట్ ధరించడం వల్ల ప్రాణాపాయం ఉండదన్న ఆలోచన రజనీకాంత్‌రెడ్డి మదిలో మెదిలింది. ఇందుకోసం తన సొంత ఖర్చులతో హెల్మెట్లను కొనుగోలు చేసి దుబ్బాక మండల వ్యాప్తంగా ద్విచక్ర వాహనదారులకు ఉచితంగా పంపిణీ చేస్తున్నారు. ప్రాణ రక్షకుడిగా, ప్రజాసేవకుడిగా ప్రజల మన్ననలు పొందుతున్నారు. దుబ్బాక మండల పరిధిలోని రాజక్కపేట గ్రామానికి చెందిన కోమటిరెడ్డి రజనీకాంత్‌రెడ్డి 'మనకోసం -కేఆర్ఆర్ ఫౌండేషన్' స్వచ్చంద సంస్థను స్థాపించారు. అప్పటినుండి ఈ సంస్థ ద్వారా సమాజ సేవ చేస్తున్నారు. తన స్వగ్రామమైన రాజక్క పేటలో సిద్దిపేట అడిషనల్ డీసీపీ ఎస్.మహేందర్ చేతుల మీదుగా కార్యక్రమాన్ని ప్రారంభించారు. అక్కడ మొదలైన ఈ హెల్మెట్ల పంపిణీ కార్యక్రమం మండల వ్యాప్తంగా చేపడుతున్నాడు.ఇప్పటివరకు సుమారుగా 3 వేల హెల్మెట్లను పంపిణీ చేయడం జరిగిందన్నారు. ద్విచక్ర వాహనదారులు హెల్మెట్ ధరించక పోవడం వల్ల జరిగిన ఊహించని ప్రమాదాల్లో కొంతమంది యువత తమ నిండు ప్రాణాల్ని కోల్పోతున్నారు. దీంతో వారి కుటుంబాలు రోడ్డున పడుతున్నాయి.ఈ ప్రమాదాలు తనలో చలనం కలిగించాయని ఇలాంటి ప్రమాదాల్ని అరికట్టడానికి హెల్మెట్‌లను ఉచితంగా అందజేస్తున్నారు. ఎంతోమంది ప్రాణాలకు రక్షణగా "కోమటిరెడ్డి రజనీకాంత్ రెడ్డి హెల్మెట్ బాంధవుడై" నిలుస్తున్నారు. ఓపక్క హెల్మెట్లను పంపిణీ చేస్తూనే మరోపక్క ఆపదలో ఉండి అనారోగ్యంతో బాధపడుతున్న వారికి ఆర్థిక చేయుతనందిస్తున్నాడు.మండల వ్యాప్తంగా కోమటిరెడ్డి రజనీకాంత్ రెడ్డికి విపరీతమైన క్రేజ్ పెరిగింది.

విద్యార్థినిని బెత్తంతో కొట్టిన టీచర్

టీచర్, ప్రిన్సిపాల్‌పై కేసు నమోదు

నవతెలంగాణ-పటాన్‌చెరు: విద్యాబుద్ధులు నేర్పాల్సిన టీచర్ చిన్నారి అని కూడా చూడకుండా బెత్తంతో కొట్టడమే కాక ప్రిన్సిపాల్‌ను అడిగినందుకు వెళ్లిన చిన్నారి తల్లిని సైతం దుర్భాషలాడిన టీచర్, ప్రిన్సిపాల్‌పై బీడీఎల్ పోలీస్‌లు కేసు నమోదు చేశారు. పోలీసులు తెలిపిన వివరాల మేరకు... చేవెళ్ల రంగారెడ్డి జిల్లాకు చెందిన పంచాక్షరి వెంకట లక్ష్మీ కూతురు యువనశ్రీ(6) పటాన్‌చెరు మండలం పాటి గ్రామ పరిధిలోని శ్రీసాయి పబ్లిక్ స్కూల్ లో ఒకటో తరగతి చదువుతోంది. బుధవారం తరగతి గదిలో బాలికను క్లాస్ టీచర్ లీల బెత్తంతో కొట్టింది. కూతురును చూసేందుకు వచ్చిన తల్లి పంచాక్షరి వెంకట లక్ష్మీ చూసి టీచర్‌ను ప్రశ్నించారు. సరియైన సమాధానం చెప్పకపోవడంతో ప్రిన్సిపాల్ విజయనాయుడును అడిగేందుకు చిన్నారి తల్లి వెళ్లింది. బాలిక తల్లిని ప్రిన్సిపాల్ దుర్భాషలడుతూ వెళ్లగొట్టారు. మనస్థాపం చెందిన పంచాక్షరి వెంకట లక్ష్మీ బీడీఎల్ భానూర్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. హెడ్ కానిస్టేబుల్ అక్తర్ పాషా పలు సెక్షన్ల కింద కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

నేడే మఠం భిక్షపతి ప్రమాణస్వీకారం

- హైదరాబాద్‌లో భారీగా ఏర్పాట్లు
- అందోల్ వ్యాప్తంగా భారీగా వెలసిన ఫ్లెక్సీలు

నవతెలంగాణ జోగిపేట





తెలంగాణ రాష్ట్ర ట్రేడ్ ప్రమోషన్ కార్పొరేషన్ చైర్మన్‌గా ఈనెల 20న ఆందోల్ నియోజకవర్గానికి చెందిన మఠం భిక్షపతి ప్రమాణ స్వీకారం చేయనున్నారు. హైదరాబాదు బషీర్‌బాగ్‌లోని శక్కర్‌భవన్‌లో ప్రమాణ స్వీకారానికి సంబంధించిన ఏర్పాట్లన్నీ పూర్తయ్యాయని బీఆర్ఎస్ శ్రేణులు తెలిపాయి. తెలంగాణ ఐటి శాఖ మంత్రి కేటీఆర్, ఆర్థిక వైద్య ఆరోగ్య శాఖ మంత్రి హరీష్ రావు, హెూం మంత్రి మహమ్మద్ అలీ, ఎమ్మెల్సీ కవిత, జహీరాబాద్ ఎంపీ బీబీ పాటిల్, అందోల్ ఎమ్మెల్యే క్రాంతి కిరణ్, నర్సాపూర్ ఎమ్మెల్యే మదన్ రెడ్డి, ఎమ్మెల్యే ముఠా గోపాల్‌తో పాటు పలువురు మంత్రులు, ఎమ్మెల్యేల సమక్షంలో ఆయన ప్రమాణస్వీకారం చేయనున్నారు. కార్యక్రమానికి నియోజకవర్గ నుంచి పెద్ద ఎత్తున టిఆర్ఎస్ నాయకులు శ్రేణులు తరలి వెళ్లనున్నారు. ఉదయం 8 గంటలలోపు సంగారెడ్డి చేరుకొని అక్కడనుండి భారీ కాన్వాయ్‌గా కార్పొరేషన్ ఆఫీస్‌కు వెళ్లడానికి సంసిద్ధమవుతున్నారు. అందోల్ నియోజకవర్గంలోని బీఆర్ఎస్ శ్రేణులు, జాగృతి సభ్యులు, భిక్షపతి అభిమానులలో సందడి నెలకొంది. సుమారు 3 వేల మందికిపైగా పార్టీ శ్రేణులు, ప్రజాప్రతినిధులు, జాగృతి నాయకులు, కార్యకర్తలు, అభిమానులు హాజరవుతారనే అంచనా మేరకు భోజన సదుపాయన్ని కూడా ఏర్పాటు చేశారు. అందోల్ నియోజకవర్గానికి చెందిన మఠం భిక్షపతి రాష్ట్ర ట్రేడ్ ప్రమోషన్ కార్పోరేషన్ చైర్మన్‌గా గురువారం ప్రమాణ స్వీకారం చేయనుండడంతో అందోల్ జోగిపేట మున్సిపల్ 12 వ వార్డు కౌన్సిలర్ కోరబోయిన నాగరాజు జోగిపేట పట్టణ కేంద్రంలో సొంతంగా భారీగా ఫ్లెక్సీలను ఏర్పాటు చేశారు. అభిమానులు, పార్టీ, జాగృతి నాయకులూ వేశారు.

సీఎంఆర్ఎఫ్, ప్రమాద బీమా చెక్కులు అందజేత



నవతెలంగాణ-జోగిపేట

సీఎంఆర్ఎఫ్, పార్టీ ప్రమాద బీమా చెక్కులను బాధితులకు ఎమ్మెల్యే చంటి క్రాంతి కిరణ్ బుధవారం అందజేశారు. అందోల్ మండలం అల్మాయిపేట గ్రామానికి చెందిన నాగిరెడ్డి దశరథ్‌రెడ్డికి రూ.1.50లక్షల చెక్కును బుధవారం సాయంత్రం ఆందోల్ క్యాంప్ కార్యాలయంలో లబ్దిదారుడికి అందజేశారు. అలాగే మునిపల్లి మండలం పెద్దలోడి గ్రామానికి చెందిన సవిత్రమ్మ భర్త నర్సింలు ఇటీవలే మృతి చెందగా.. బాధితు కుటుంబ సభ్యులకు రూ.2లక్షల పార్టీ ప్రమాద బీమా చెక్కును ఎమ్మెల్యే అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పేదలకు మెరుగైన వైద్యం అందించడానికి సీఎం కేసీఆర్ ఎంతో కృషి చేస్తున్నారన్నారు. అంతేకాకుండా పార్టీ క్రియాశీల సభ్యత్వం కార్యకర్తలకు ప్రమాద బీమాను అందజేసి అండగా నిలుస్తున్నారన్నారు. ఈ కార్యక్రమంలో అందోల్ మండల సర్పంచ్ల ఫోరమ్ అధ్యక్షులు ప్రవీణ్ రెడ్డి, బీఆర్ఎస్ నాయకులు చాపల వెంకటేష్, దామోదర్ రెడ్డి, అనిల్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

వర్షాల పట్ల అప్రమత్తంగా ఉండండి



- పటాన్‌చెరు ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి

నవతెలంగాణ-పటాన్‌చెరు

గత రెండ్రోజులుగా కుదుస్తున్న వర్షాలు, రానున్న రోజుల్లో భారీ వర్షాలు కురుస్తాయన్న వాతావరణ శాఖ హెచ్చరికల నేపథ్యంలో పటాన్‌చెరు నియోజకవర్గ పరిధిలోని అన్ని స్థాయిల అధికారులు, ప్రజాప్రతినిధులు అప్రమత్తంగా ఉండడంతో పాటు ప్రజలకు అందుబాటులో ఉండాలని పటాన్‌చెరు ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి సూచించారు. వర్షాల నేపథ్యంలో వివిధ శాఖల అధికారులు, ప్రజాప్రతినిధులతో మాట్లాడారు. ప్రధానంగా వరద ముంపు ప్రభావిత ప్రాంతాలలో పర్యటించి, ప్రజలకు తగు జాగ్రత్తలు పాటించేలా పలు సూచనలు చేయాలన్నారు. మండల స్థాయిలో కంట్రోల్ రూంలు ఏర్పాటుచేసి విద్యుత్, రెవెన్యూ, పోలీస్ శాఖ అధికారులతో సమన్వయం చేసుకోవాలన్నారు. గ్రామీణ ప్రాంతాలలో చెరువులకు గండ్లు పడకుండా చూడాలని ఆదేశించారు. జిహెచ్ఎంసి, మున్సిపాల్టీల పరిధిలో డిఆర్ఎఫ్ బృందాలు అందుబాటులో ఉన్నాయని తెలిపారు.

పటాన్‌చెరు డీఎస్పీగా పురుషోత్తంరెడ్డి





నవతెలంగాణ-పటాన్‌చెరు, సంగారెడ్డి

పటాన్‌చెరు డీఎస్పీగా పురుషోత్తం రెడ్డి బుధవారం బాధ్యతలు చేపట్టారు. రాష్ట్రవ్యాప్తంగా జరిగిన డీఎస్పీల బదిలీల్లో భాగంగా హైదరాబాదులోని వనస్థలిపురం డీఎస్పీగా విధులు నిర్వర్తించిన పురుషోత్తంరెడ్డి పటాన్‌చెరుకు వచ్చారు. ఇప్పటివరకు ఇక్కడ విధులు నిర్వర్తించిన భీమ్‌రెడ్డి రాష్ట్ర డీజీపీ కార్యాలయంలో రిపోర్ట్ చేశారు. ఈ సందర్భంగా నూతన డీఎస్పీ పురుషోత్తంరెడ్డి మాట్లాడుతూ.. శాంతి భద్రతల పరిరక్షణలో తనవంతు కృషి చేస్తానన్నారు. కాగా బాధ్యతల స్వీకరణ అనంతరం జిల్లా ఎస్పీ యం.రమణ కుమార్‌ని మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందించారు.

సంగారెడ్డి నూతన డీఎస్పీగా జె.రమేష్ కుమార్



బాధ్యతల స్వీకరణ

నవతెలంగాణ-సంగారెడ్డి

సంగారెడ్డి నూతన డిఎస్పీగా జే.రమేష్ కుమార్ బుధవారం బాధ్యతలు స్వీకరించారు. అనంతరం జిల్లా ఎస్పీ యం. రమణ కుమార్‌ని మర్యాదపూర్వకంగా కలిశారు. 1998 బ్యాచ్‌కు చెందిన ఆయన గతంలో సైబరాబాద్, హైదరాబాద్‌లో ఇన్‌స్పెక్టర్‌గా విధులు నిర్వహించి.. పదోన్నతిపై సంగారెడ్డి డీఎస్పీగా వచ్చారు.

జీహెచ్ఎంసీ ఉప కమిషనర్‌గా సురేష్



నవతెలంగాణ-పటాన్‌చెరు

పటాన్‌చెరు, రామచంద్రాపురం(సర్కిల్ 22) జిహెచ్ఎంసి డిప్యూటీ కమిషనర్‌గా ఎ.సురేష్ బుధవారం బాధ్యతలు చేపట్టారు. పోచారం అసిస్టెంట్ ఎంపిఎల్ కమిషనర్‌గా విధులు నిర్వర్తించిన ఆయన పటాన్‌చెరు, రామచంద్ర పురం ఉప కమిషనర్‌గా బదిలీపై వచ్చారు. ఇక్కడ విధులు నిర్వర్తించిన ఉప కమిషనర్ బాలయ్య గోషామహల్ ఉప కమిషనర్‌గా బదిలీపై వెళ్లారు. ఈ సందర్భంగా సురేష్ మాట్లాడుతూ.. ఎవరికి ఎలాంటి ఇబ్బందులు కలిగిన నేరుగా తనను కలవచ్చు అన్నారు. తమ సమస్యలను పరిష్కరించుకోవాలని సూచించారు.



యువతీ యువకులకు ఉచితంగా డ్రైవింగ్ లైసెన్స్

నవతెలంగాణ-సంగారెడ్డి

సంగారెడ్డి పట్టణంలోని చింతా ప్రభాకర్ క్యాంపు కార్యాలయంలో బుధవారం డ్రైవింగ్ లైసెన్స్ లబ్దిదారుల దరఖాస్తుల స్వీకరణ కార్యక్రమం నిర్వహించారు. ఉదయం నుంచే లబ్దిదారులతో క్యాంపు కార్యాలయం కిక్కిరిసిపోయింది. కాగా ఉచితంగా డ్రైవింగ్ లైసెన్స్ ఇవ్వడంపై లబ్దిదారులు హర్షం వ్యక్తం చేస్తూ.. చింతా ప్రభాకర్‌కి ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో చింతా సాయినాథ్, సీడీసీ చైర్మెన్ కాసాల బుచ్చిరెడ్డి, గ్రంథాలయ సంస్థ చైర్మెన్ నరహరి రెడ్డి, సీడీసీ మాజీ చైర్మెన్ విజేందర్ రెడ్డి, మార్కెట్ కమిటీ చైర్మెన్ ప్రభూ గౌడ్, పట్టణ అధ్యక్షులు ఆర్. వెంకటేశ్వర్లు, మాజీ జెడ్పీటీసీ మనోహర్ గౌడ్, నాగరాజ్ గౌడ్, డా.శ్రీహరి తదితరులు పాల్గొన్నారు.



శేహజది సైయద్‌కు ఘన స్వాగతం

నవతెలంగాణ-సంగారెడ్డి

సంగారెడ్డి కలెక్టర్ కార్యాలయంలో జిల్లా స్థాయి మైనార్టీ వెల్ఫేర్ సమావేశానికి విచ్చేసిన మైనారిటీ జాతీయ కమిషన్ మెంబర్ శేహజది సైయద్‌కు సంగారెడ్డి పట్టణాధ్యక్షులు ప్రసాది రవి శంకర్ బీజేపీ పట్టణ శాఖ తరపున ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. మైనార్టీల సంక్షేమం కోసం ప్రభుత్వం ద్వారా వస్తున్న పథకాల విషయంలో ఏదైనా సమస్యలు ఉంటే వాటి పరిష్కారానికి తన వంతు పూర్తి సహకారం అందిస్తానన్నారు. ఈ కార్యక్రమంలో జాతీయ మైనార్టీ కమిషన్ ప్యానల్ మెంబర్ సైఫుల్ల ఖాన్,కౌన్సిలర్ నాయికోటి రమేష్, ఎస్సీ మోర్చ జిల్లా అధ్యక్షులు ఆశ్వంత్, పట్టణ ప్రధాన కార్యదర్శి విక్రమ్ శంకర్, మహిళ మోర్చ నాయకులు సంతోషి ఠకుర్, సంగీత, సుబ్బలక్ష్మి, పోలీస్ శేఖర్ ,చంద్రశేకర్ గౌడ్, సాయికిరణ్, శ్రీకాంత్, కిరణ్ తదితరులు పాల్గొన్నారు.

అతిథి అధ్యాపక పోస్టులకు దరఖాస్తుల ఆహ్వానం

నవతెలంగాణ-సంగారెడ్డి

సంగారెడ్డి తార ప్రభుత్వ కళాశాలలో డిగ్రీ విద్యార్థులకు బోధించడానికి అర్హులైన అభ్యర్థులు అతిథి అధ్యాపక పోస్టులకు దరఖాస్తు చేసుకోవాలని ప్రిన్సిపాల్ డా. కెఎస్ఎస్ రత్న ప్రసాద్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆంగ్లం విభాగంలో 5, తెలుగు 2, కామర్స్ 6, బి బి ఏ 2, చరిత్ర 1, రాజనీతి శాస్త్రం 1, కంప్యూటర్ సైన్స్ 8, స్టాటటిక్స్ 1 చొప్పున ఖాళీలు ఉన్నాయన్నారు. ఈ పోస్టులన్నింటికీ సంబంధించి ఈనెల 24న ఉదయం 10 గంటల నుంచి ఇంటర్వ్యూలు నిర్వహించడం జరుగుతుందని పేర్కొన్నారు. అర్హులైన అభ్యర్థులు ఈనెల 22(శనివారం)న సాయంత్రం ఐదు గంటల లోపు కళాశాలలో అప్లై చేసుకోవాలన్నారు. జిరాక్స్ కాపీలతో వచ్చిన వారికే ప్రాధాన్యత ఉంటుందన్నారు. అభ్యర్థులు సంబంధిత సబ్జెక్టులో పోస్ట్ గ్రాడ్యుయేషన్‌లో 55 శాతం మార్కులు పొంది ఉండాలని, ఎస్ఈటి, ఎస్ఎల్ఈటి, పీహెచ్డీ, బోధన అనుభవం ఉన్నవారికి ప్రాధ్యానత ఇవ్వబడుతుందన్నారు. మరిన్ని వివరాల కోసం 9441069020 సంప్రదించాలన్నారు.



ఇద్దరు అనాథ అక్కాచెల్లెల్ల దత్తత

నవతెలంగాణ-సంగారెడ్డి

సంగారెడ్డి నియోజకవర్గంలోని కొండాపూర్‌కు చెందిన బేగరి మెర్సీ, బేగరి జోయసీ(తల్లిదండ్రులు బేగరి మొగులయ్య, అమృత)లు బాల్యంలోనే తల్లిదండ్రులను కోల్పోయారు. ప్రస్తుతం వారు తమ మేనమామ వద్ద ఉంటూ.. ఒకరు 7వ తరగతి, మరొకరు పదో తరగతి చదువుతున్నారు. ఈ విషయం తెలుసుకున్న ఉమ్మడి మెదక్ జిల్లా డీసీసీబీ వైస్ చైర్మెన్ పట్నం మాణిక్యం బుధవారం ఆ చిన్నారులను తన నివాసానికి పిలిపించుకుని.. దత్తత తీసుకున్నారు. ప్రస్తుతానికి రూ.50,000 ఇచ్చి, వారు చదువుతున్న చదువులకు పూర్తి ఖర్చు ప్రతినెల పట్నం మాణిక్యం ఫౌండేషన్ భరిస్తుందని హామీ ఇచ్చారు. డబుల్ బెడ్ రూమ్ ఇల్లు ఇప్పిస్తానని వాగ్దానం చేశారు. పిల్లలు వారి మేన మామ సంతోషం వ్యక్తం చేశారు.

సాగుకు సింగూరు నీటి విడుదల

- నవతెలంగాణ వార్తకు స్పందన
- రైతు సంక్షేమమే ధ్యేయం : అందోల్ ఎమ్మెల్యే చంటి క్రాంతి కిరణ్



నవతెలంగాణ-పుల్కల్

సింగూరు ప్రాజెక్టు ఎడమ కాలువ ద్వారా వ్యవసాయానికి ఎత్తిపోతల పథకం కింద ఎమ్మెల్యే చంటి క్రాంతి కిరణ్ చేతుల మీదుగా బుధవారం నీటిని విడుదల చేశారు. వారం రోజుల క్రితం నవతెలంగాణ దినపత్రికలో 'ఖరీఫ్‌కు సింగూరు జలాలు అందేనా' అనే శీర్షికన ప్రచురితమైన వార్తకు అధికారులు స్పందించి నీటిని విడుదల చేశారు. ఈ సందర్భంగా నీటి విడుదల అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ.. దిగువనున్న ఆయా మండలాల రైతులకు సంబంధించి సుమారు 40 వేల ఎకరాలకు ఈ సాగునీరు ఎంతగానో దోహదపడుతుందన్నారు. రైతులను ఆదుకోవడానికి రాష్ట్ర ప్రభుత్వం ఎంతో కృషి చేస్తున్నదన్నారు. 24 గంటల ఉచిత విద్యుత్‌తో పాటు రైతులకు అనేక సంక్షేమ పథకాలు ప్రవేశపెట్టి రైతులను రాజులు చేసిన ఘనత కేవలం బీఆర్ఎస్‌కే దక్కిందన్నారు. రాబోయే ఎన్నికల్లో ముచ్చటగా మూడోసారి బీఆర్ఎస్ ప్రభుత్వం ఏర్పాటు కావడం ఖాయమని ధీమా వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో ఇరిగేషన్ శాఖ అధికారులు, జెడ్పీ చైర్‌పర్సన్ మంజుశ్రీ జయపాల్ రెడ్డి, పుల్కల్ మండలాధ్యక్షురాలు చైతన్య విజయ భాస్కర్ రెడ్డి, పుల్కల్ మండలాధ్యక్షులు మాచర్ల విజయకుమార్, ఆత్మ కమిటీ మండలాధ్యక్షులు యాదగిరిరెడ్డి, రైతు సమన్వయ సమితి మండలాధ్యక్షులు నరసింహారెడ్డి, బీఆర్ఎస్ మండలాధ్యక్షులు మాచర్ల విజయకుమార్, సింగూర్ సర్పంచ్ రాజా గౌడ్, ఎంపీటీసీలు మంజుల వీరారెడ్డి, శ్రీనివాస్ చారి తదితరులు పాల్గొన్నారు.

రైతులను విమర్శించేలా మాట్లాడడం సిగ్గుచేటు



నవతెలంగాణ-కోహీర్

వ్యవసాయానికి 24గంటల ఉచిత కరెంట్ అవసరం లేదని.. మూడు గంటలే సరిపోతుందని రైతులను విమర్శించేలా టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి మాట్లాడడం సిగ్గుచేటని జహీరాబాద్ ఎమ్మెల్యే కొనింటి మాణిక్ రావు విమర్శించారు. మండలంలోని గొడియర్‌పల్లి గ్రామంలో నిర్వహించిన రైతు సదస్సులో ఎమ్మెల్యే పాల్గొని మాట్లాడారు. రైతు సంక్షేమమే ధ్యేయంగా తెలంగాణ ప్రభుత్వం కృషి చేయడంతోపాటు రైతులకు ఉచితంగా కరెంట్ ఇస్తుంటే.. రైతులకు ప్రతి రోజు మూడు గంటల కరెంట్ సరిపోతుందని రేవంత్‌రెడ్డి మాట్లాడడం దుర్మార్గమన్నారు. దీన్నిబట్టి రైతులపై కాంగ్రెస్‌కు ఎంత ప్రేమ ఉందో అర్థమవుతున్నదన్నారు. వ్యవసాయ పంప్‌సెట్ల వద్ద విద్యుత్ మీటర్లు బిగించాలని బీజేపీ చెబుతుంటే.. కాంగ్రెసేమో వ్యవసాయానికి మూడు కరెంట్ సరిపోతుందని చెబుతూ రైతులను పక్కదోవ పట్టిస్తున్నాయన్నారు. అందుకు రైతులను విమర్శించేలా మాట్లాడిన రేవంత్‌రెడ్డి రైతులకు వెంటనే క్షమాపణ చెప్పాలన్నారు. రైతుబంధు, రైతుబీమా, పంటలకు మద్దతుధర, రుణమాఫీ లాంటి ఎన్నో పథకాలను తీసుకువచ్చి.. రైతులను కంటికి రెప్పోలే బీఆర్ఎస్ ప్రభుత్వం కాపాడుకుంటున్నదన్నారు. కాబట్టి మరోమారు బీఆర్ఎస్‌నే ప్రజలు దీవించాలని విజ్ఞప్తి చేశారు. అనంతరం గ్రామ పంచాయతీ నూతన భవనానికి భూమి పూజ చేసి పనులను ప్రారంభించారు. అంతకు ముందు రేవంత్‌రెడ్డి దిష్టిబొమ్మ దగ్ధం చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఎస్సి మానిటరింగ్ కమిటీ మేంబర్ బంటు రామకృష్ణ, ఆత్మ కమిటి చైర్మన్ పెంటారెడ్డి, బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు నర్సింలు యాదవ్, గొట్టిగర్‌పల్లి సర్పంచ్ అనుసుజమ్మ తుక్కప్ప, సర్పంచులు రమేష్ సాగర్, నర్సింలు, ఖానాపూర్ సర్పంచ్ రమేష్, గొట్టిగర్‌పల్లి గ్రామ పార్టీ అధ్యక్షుడు నర్సింలు, ఉప సర్పంచ్ వాసు నాయక్, మాజీ మార్కెట్ చైర్మన్ రామకృష్ణ రెడ్డి, సీనియర్ నాయకులు సురేందర్ రెడ్డి, నర్సింహ రెడ్డి, ఎల్లారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మంత్రిపై ఆరోపణలు సరికాదు

నవతెలంగాణ-జహీరాబాద్



వాస్తవాలు తెలుసుకోకుండా మంత్రి హరీశ్‌రావుపై అఖిలపక్షం నాయకులు ఆరోపణలు చేయడం సరికాదని సామాజిక ఉద్యమకారుడు ఢిల్లీ వసంత్ అన్నారు. బుధవారం చెరుకు రైతుల ధర్నా కార్యక్రమంలో స్థానిక అఖిలపక్ష నాయకులు మంత్రి హరీశ్‌రావుపై చేసిన అనుచిత వ్యాఖ్యలను వసంత్ ఖండించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. జిల్లా ఇన్‌చార్జ్ మంత్రిపై స్థానిక నాయకులు వాడిన పరుష పదజాలము తీవ్రంగా ఆక్షేపించదగిందన్నారు, ఫ్యాక్టరీ ప్రారంభానికి ప్రభుత్వం కట్టుబడి ఉన్నదని.. స్థానిక ఎమ్మెల్యే కె.మాణిక్‌రావు, డీసీఎంఎస్ చైర్మెన్ శివ కుమార్ ఆధ్వర్యంలో బీఆర్ఎస్ నాయకులు ఇటీవలే ప్రెస్‌మీట్ పెట్టి వివరాలను తెలిపినప్పటికీ.. అఖిల పక్ష నాయకులు రైతులను భయభ్రాంతులకు గురి చేయడం సరికాదన్నారు. జహీరాబాద్‌కు మంత్రి అత్యంత ప్రాధాన్యతనిస్తూ ఎన్నో అభివృద్ధి కార్యక్రమాలు చేస్తున్నారన్నారు. ఓ కంపెనీ ఆంధ్రాలో బకాయిలు ఇప్పటికీ చెల్లించలేనది.. కానీ అదే కంపెనీ ఇక్కడి రైతులకు ఎలాంటి పెండింగ్‌లు పెట్టకుండా చెల్లించే విధంగా కృషి చేసిన ఘనత మంత్రి హరీశ్‌రావుకే దక్కుతుందన్నారు. బకాయిల సాధనలో ఇప్పటికే ప్రభుత్వం, కమిషనర్, యాజమాన్యంతో చర్చలు జరిపి, మూడున్నర కోట్లు అందించడం జరిగిందని.. మిగత బకాయిలు కూడా చెల్లించిన తరువాత ఫ్యాక్టరీ ప్రారంభానికి చర్యలు తీసుకుంటుందన్నారు. మాజీ మంత్రి గీతారెడ్డి చక్కర పరిశ్రమల శాఖ మంత్రిగా ఉన్నప్పటికీ.. జహీరాబాద్‌కు మాత్రం ఎలాంటి ప్రయోజనం కలగలేదన్నారు. బీజేపీ ఎల్లవేళలా రైతు వ్యతిరేకి అని ఆరోపించారు. అలాగే పరుష పదజాలం వాడటం సరికాదని.. ఎవరినీ అగౌరవ పర్చకుండా ఉద్యమాలు చేసుకోవాలని అఖిలపక్ష నాయకులకు సూచించారు. ఈ కార్యక్రమంలో జనార్ధన్, యాసిర్ ఖాన్, బి.దత్తాత్రి ముదిరాజ్, మహిపాల్ యాదవ్, అప్పం శ్రీకాంత్, విశాల్ గోడ్కే, అశోక్ పాటిల్, దశరథ్ నేత, దినేష్ ముదిరాజ్, నాగేశ్ యాదవ్, తదితరులు పాల్గొన్నారు.

తవ్వి వదిలేసిన రోడ్డుపై అదుపుతప్పిన బైక్..

- వ్యక్తికి తీవ్ర గాయాలు



నవతెలంగాణ-ఝరాసంగం

గత రెండ్రోజులుగా కురుస్తున్న వర్షాలకు రోడ్లన్నీ బురదమయంగా మారి ప్రమాదాలు జరుగుతున్నాయి. బుధవారం పొట్టిపల్లి గ్రామంలో గల సీసీరోడ్డుపై ద్విచక్ర వాహనం పైనుంచి పడి ఓ వ్యక్తికి తీవ్ర గాయాలయ్యాయి. వివరాల్లోకి వెళ్తే.. ఎస్‌డీఎఫ్ నిధులతో జహీరాబాద్ నుంచి ఎల్గోయి వరకు బీటీ రోడ్డును నిర్మించేందుకు స్థానిక ఎమ్మెల్యే మాణిక్‌రావు మార్చి 31న శంకుస్థాపన చేశారు. అప్పటినుండి రోడ్డును పూర్తిగా అల్గోల్ వరకు జెసిబి సహాయంతో తవ్వించేశారు. గత నాలుగు, ఐదు రోజుల నుండి ఎడతె రిపిలేని వర్షాలు కురవడంతో రోడ్లన్నీ చిత్తడిగా మారి గోతులు ఏర్పడ్డాయి. దీంతో పొట్‌పల్లి, ఎల్గోయి గ్రామస్తులు జహీరాబాద్ పట్టణానికి రావడానికి, పోవడానికి ఇబ్బందిగా మారింది. దాదాపు ఈ రోడ్డు తవ్వేసి రెండు నెలలు గడుస్తున్నా స్థానిక కాంట్రాక్టర్ గాని, అధికారులు గాని పట్టించుకున్న దాఖలాలు లేకపోలేదని స్థానికులు ఆరోపిస్తు న్నారు. బుధవారం నాల్కల్ మండలం తాటిపల్లి గ్రామానికి చెందిన బాబురావు జహీరాబాద్ నుంచి పొట్టిపల్లి గ్రామంలోని బంధువుల వద్దకు వెళ్తుండగా.. గ్రామ సమీపం వద్ద పగిలిన సీసీరోడ్డుపై ద్విచక్ర వాహనం అదుపుతప్పి కిందపడ్డాడు. గమనించిన స్థానికులు జహీరాబాద్ ఏరియా ఆసు పత్రికి తరలించాలరు. బాధితుడి ముఖానికి బలమైన గాయాలు తగిలి ఆరు కుట్లు పడ్డాయి. కాంట్రాక్టర్ అధికారులు పట్టించుకోకపోవడం మూలంగానే తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయని గ్రామస్తులు మండిపడుతు న్నారు. అధికారులు స్పందించి ఇప్పటికైనా పనులను త్వరగా పూర్తి చేయాలని కోరుతున్నారు.

కళశాలలో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలి



నవతెలంగాణ-జహీరాబాద్

జహీరాబాద్ పట్టణంలోని జూనియర్ కళశాలలో విద్యార్థులు ఎదుర్కొంటున్నా సమస్యలను వెంటనే పరిష్కరించాలని మహిళ మోర్చా నియోజకవర్గ కన్వీనర్ జ్యోతి పండాల్ డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. జహీరాబాద్ పట్టణంలోని ఉన్న ప్రభుత్వ జూనియర్ కళశాలలో ప్రయివేటుకు ధీటుగా విద్యను అందిస్తున్నారన్నారు. ఈ సందర్భంగా కళశాల ప్రిన్సిపాల్, సిబ్బందికి అభినందనలు తెలిపారు. ఈ కళశాల విద్యార్థులు ఉత్తమ మార్కులు సాధిస్తున్నారని.. కానీ కళశాలలో మాత్రం మౌలిక వసతులు లేవన్నారు. దీంతో విద్యార్థులు చాలా ఇబ్బందులు పడుతున్నారన్నారు. ముఖ్యంగా ప్రహరీ గోడ లేకపోవడంతో పోకిరీలు విద్యార్థినులను వేధింపులకు గురిచేస్తున్నారన్నారు. సరియైన గదులు లేవని, మంచి నీటి సమస్య, మరుగుదొడ్ల లాంటి ఎన్నో సమస్యలతో కళశాల కొట్టుమిట్టాడుతున్నదన్నారు. ప్రభుత్వం వెంటనే స్పందించి సమస్యలను పరిష్కరించాలన్నారు.

సీఎంఆర్ఎఫ్ చెక్కు అందజేత

నవతెలంగాణ-నారాయణఖేడ్



మండలంలోని హంగర్గా గ్రామానికి చెందిన బాబురావు భార్య అమలమ్మ అనారోగ్యంతో బాధడుతున్నది. ఆమె ఆసుపత్రి ఖర్చుల నిమిత్తం ముఖ్యమంత్రి సహాయ నిధి ద్వారా రూ.16,000 మంజూరయ్యాయి. ఇందుకు సంబంధించిన చెక్కును ఎమ్మెల్యే తనయుడు రోషన్ రెడ్డి బుధవారం లబ్దిదారులకు అందజేశారు.

హాస్యాస్పదంగా రేవంత్‌రెడ్డి మాటలు

- ఆందోల్ ఎమ్మెల్యే చంటి క్రాంతి కిరణ్



నవతెలంగాణ-పుల్కల్

రైతులకు 24 గంటల కరెంటు అవసరం లేదని.. కేవలం మూడు గంటలు మాత్రమే సరిపోతుందని టీపీసీసీ అధ్యక్షులు రేవంత్‌రెడ్డి మాట్లాడడం హాస్యాస్పదంగా ఉన్నదని అందోల్ ఎమ్మెల్యే చంటి క్రాంతి కిరణ్ ఎద్దేవా చేశారు. ఎన్నికలు సమీపిస్తున్న తరుణంలో రేవంత్‌రెడ్డి ఏమి మాట్లాడుతున్నారో ఆయనకే తెలియట్లేదని విమర్శించారు. పుల్కల్ మండల పరిధిలోని పెద్దారెడ్డిపేట గ్రామ రైతు వేదికలో బుధవారం ఏర్పాటు చేసిన మండల రైతుల సమావేశానికి ఎమ్మెల్యే ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. కాంగ్రెస్ పార్టీ హయాంలో రైతుల కు సరిపడా పురుగు మందులు, ఎరువులు దొరికేవి కావన్నారు. రాత్రి వేళల్లో వచ్చే కరెంటు పెట్టడానికి వెళ్లి అనేక మంది ప్రాణాల్ని సైతం పోగొట్టుకున్నారన్నారు. కానీ నేడు సీఎం ఆధ్వర్యంలో రైతుల సంక్షేమానికి బీఆర్ఎస్ ప్రభుత్వం ఎల్లవేళలా కృషి చేస్తున్నదన్నారు. 24 గంటల ఉచిత విద్యుత్‌తోపాటు.. రైతుబీమా, రైతుబంధు లాంటి అనేక సంక్షేమ పథకాలను తీసుకువచ్చారన్నారు. రైతులకు మూడు పంటలు కావాలా? లేక మూడు గంటల విద్యుత్ కావాలా.. రైతులే ఆలోచించుకోవాలన్నారు. ఉచిత విద్యుత్ పై అనుచిత వ్యాఖ్యలు చేసిన రేవంత్ రెడ్డి తెలంగాణ ప్రజలకు బహిరంగ క్షమాపణ చెప్పాలన్నారు. రాబోయే ఎన్నికల్లో ఆందోల్ గడ్డపై గులాబీ జెండా మళ్లీ రెపరెపలాడుతుందన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా చైర్‌పర్సన్ మంజు శ్రీ జయపాల్ రెడ్డి, మండలాధ్యక్షురాలు చైతన్య విజయభాస్కర్ రెడ్డి, పార్టీ పుల్కల్ మండల అధ్యక్షులు మాచర్ల విజయకుమార్, రైతు సమన్వయ సమితి మండల అధ్యక్షులు నరసింహారెడ్డి, ఆత్మ కమిటీ మండల అధ్యక్షులు యాదగిరి రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మహిళా ఆర్థిక స్వావలంబనకు కృషి



- ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి
- బొంబాయి కాలనీలో గ్రామ దుకాణం ప్రారంభం

నవతెలంగాణ-రామచంద్రాపురం

మహిళల స్వయం ఉపాధితో పాటు ఆర్థిక స్వావలంబనకు సీఎం కేసీఆర్ సంపూర్ణ సహకారం అందిస్తున్నారని పటాన్చెరు శాసనసభ్యులు గూడెం మహిపాల్ రెడ్డి అన్నారు. భారతినగర్ డివిజన్ పరిధిలోని బొంబాయ్ కాలనీలో నాబార్డ్ సహకారంతో ఈశ్వరాంబ మహిళా సొసైటీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన డ్వాక్రా సంఘాల ఉత్పత్తుల 'గ్రామ దుకాణము'ను స్థానిక కార్పొరేటర్ సింధు ఆదర్శరెడ్డితో కలిసి ఎమ్మెల్యే ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏర్పాటుచేసిన ఉత్పత్తుల ప్రదర్శనను ప్రారంభించి స్వయంగా పరిశీలించారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. మహిళా స్వయం సహాయ సంఘాలకు వివిధ అంశాల్లో శిక్షణ అందించడంతో పాటు వారు తయారు చేసిన ఉత్పత్తులను మార్కెటింగ్ సదుపాయం కల్పిస్తున్నామన్నారు. బ్యాంకు లింకేజీ ద్వారా వడ్డీ లేని రుణాలు అందించడంతోపాటు మహిళా పారిశ్రామిక వేత్తలకు రుణాలు అందిస్తున్న ఏకైక ప్రభుత్వం బీఆర్ఎస్ ప్రభుత్వమన్నారు. ఈ కార్యక్రమంలో తెల్లాపూర్ మున్సిపాల్టీ వైస్ చైర్మెన్ రాములు గౌడ్, రామచంద్రాపురం కార్పొరేటర్ పుష్ప నగేష్, నాబార్డ్ జిల్లా మేనేజర్ ఎం.వి కృష్ణ తేజ, సీనియర్ నాయకులు, మహిళలు పాల్గొన్నారు.

పీఆర్సీని వెంటనే ప్రకటించాలి

- యూఎస్‌పీసీ ఆధ్వర్యంలో బైక్‌ర్యాలీ





నవతెలంగాణ-సంగారెడ్డి, కొండాపూర్

పీఆర్సీని ప్రకటించాలని, సీపీఎస్ విధానం రద్దు చేయాలిని, టీచర్ల బదిలీలు- పదోన్నతులు వెంటనే చేపట్టాలని డిమాండ్ చేస్తూ ఉపాధ్యాయ సంఘాల పోరాట కమిటీ (యూఎస్‌పీసీ) ఆధ్వర్యంలో బుధవారం సంగారెడ్డి జెడ్పీహెచ్ఎస్ నుంచి బైక్ ర్యాలీ చేపట్టారు. అలాగే కొండాపూర్‌లో జిల్లా కార్యదర్శి బి.సాయితేజ నేతృత్వంలో ర్యాలీ చేపట్టారు. ఆయా ర్యాలీల్లో రాష్ట్ర నాయకులు టి.లక్ష్మారెడ్డి పాల్గొని మాట్లాడారు. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ఉద్యోగ ఉపాధ్యాయులకు రెండో పీఆర్సీని ప్రకటించాలన్నారు. జూలై 1 నుంచి మధ్యంతర భృతి విడుదల చేయాలని కోరారు. సీపీఎస్ విధానం రద్దు చేసి పాత పెన్షన్ పథకాన్ని పునరుద్ధరించాలన్నారు. ఉపాధ్యాయుల బదిలీలు పదోన్నతుల షెడ్యూల్ కొనసాగించాలన్నారు. పెండింగ్లో ఉన్న బిల్స్ వెంటనే మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. ముఖ్యంగా రాష్ట్ర ప్రభుత్వం విద్యారంగ, ఉపాధ్యాయ సమస్యల పరిష్కారాన్ని జాప్యం చేస్తున్నదని మండిపడ్డారు. ఉపాధ్యాయ ఖాళీలను భర్తీ చేసి మనఊరు-మనబడి పనులను వేగిరం చేయాలన్నారు. తెలంగాణ రాష్ట్రంలో సీపీఎస్ వెంటనే రద్దుచేసి పాత పెన్షన్ ఇవ్వాలని.. దానివల్ల ప్రభుత్వానికి ఎలాంటి ఆర్థిక భారం పడదని సూచించారు. ఈ కార్యక్రమాల్లో సంగారెడ్డిలో యూఎస్‌పీసీ నాయకులు బి. సాయిలు, అనుముల రామచందర్, బి.సాయితేజ, చందర్ రాథోడ్, విజయానంద్, విజయలక్ష్మి, మాధవి, సింహాచలం పాఠశాల ప్రధానోపాధ్యాయులు రజితలీల, కొండాపూర్‌లో యూఎస్‌పీసీ జిల్లా నాయకులుసాయిలు చందర్ రాథోడ్, విజయనంద్, సింహాచలం, విజయలక్ష్మి, మాధవి, కొండాపూర్ పాఠశాల ప్రధానోపాధ్యాయులు పండరి నాయక్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పంచాయతీ కార్మికులను పర్మినెంట్ చేయాలి



- రేపు కలెక్టరేట్ ముట్టడి
- సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి యం.యాదగిరి

నవతెలంగాణ-సంగారెడ్డి

గ్రామ పంచాయతీల్లో వివిధ విభాగాల్లో పనిచేస్తున్న కార్మికులను పర్మినెంట్ చేయాలని సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి యాదగిరి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సీఐటీయూ ఆధ్వర్యంలో సంగారెడ్డి మండలం కల్పగూర్ గ్రామ కార్యాలయం ఎదుట బుధవారం ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా యాదగిరి మాట్లాడుతూ.. తమ న్యాయమైన డిమాండ్ల కోసం గత 14 రోజులుగా సమ్మె చేస్తున్నా.. గ్రామపంచాయతీ కార్మికుల సమస్యల పట్ల రాష్ట్ర ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరించడం సరికాదన్నారు. పోటీ కార్మికులను తీసుకువచ్చి సమ్మెను విచ్చిన్నం చేయాలనే కుట్రను తిప్పికొడతామని హెచ్చరించారు. అలాగే కార్మికులను తొలగిస్తామని బెదిరింపులకు పాల్పడడం సిగ్గుచేటన్నారు. మల్టీపర్పస్ విధానాన్ని రద్దుచేసి జీవో నెంబర్ 60 ప్రకారం కనీస వేతనాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. వేతనాల కోసం ప్రత్యేక బడ్జెట్ కేటాయించి నేరుగా కార్మికుల ఖాతాలలో వేతనాలు వేయాలని డిమాండ్ చేశారు. అర్హులైన కారోబార్ బిల్ కలెక్టర్లను గ్రామపంచాయతీ సహాయ కార్యదర్శులుగా పదోన్నతి కల్పించాలని కోరారు. సమస్యలు పరిష్కరించుకుంటే రేపు(శుక్రవారం) కలెక్టరేట్ ముట్టడి చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో బిక్షపతి, రాజు, మహేష్, అశోకు, నర్సింలు, రాజేష్, మల్లేశం పాల్గొన్నారు.

నేడే తన్వీర్ ప్రమాణ స్వీకారం



నవతెలంగాణ-జహీరాబాద్

రాష్ట్ర ఇండస్ట్రియల్ డెవలప్మెంట్ చైర్మెన్‌గా తన్వీర్ నేడు(గురువారం) ప్రమాణ స్వీకారం చేయనున్నారు. హైదరాబాద్‌లోని బషీర్‌బాగ్‌లో ఉదయం 9 గంటలకు ఈ ప్రమాణ స్వీకారోత్సవ కార్యక్రమం ఉంటుందని.. కార్యకర్తలు భారీ సంఖ్యలో తరలి రావాలని ఆయన అభిమానులు బి సతీష్, ముత్యాల చందు, జాంగిర్, శ్రీకాంత్ రెడ్డి, సందీప్‌లు విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా మున్సిపల్ శాఖ మంత్రి కేటీఆర్, వైద్య ఆరోగ్యశాఖ మంత్రి హరీశ్‌రావు హాజరవుతున్నారన్నారు. నియోజకవర్గంలోని మాజీ మంత్రి ఫరీదోద్దీన్ అభిమానులు పెద్ద సంఖ్యలో హాజరై దిగ్విజయం చేయాలని విజ్ఞప్తి చేశారు.



న్యాల్కల్ : తన్వీర్ ప్రమాణ స్వీకారోత్సవానికి న్యాల్‌కల్ మండల బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పెద్ద ఎత్తున తరలివచ్చి విజయవంతం చేయాలని బీఆర్ఎస్ నాయకులు, హద్నూర్ సొసైటీ డైరెక్టర్ ప్రవీణ్ పిలుపునిచ్చారు.

కేజీబవీల ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించాలి



నవతెలంగాణ-ఝరాసంగం

కేజీబీవీ ఉపాధ్యాయుల సమస్యలను రాష్ట్ర ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని టీఎస్‌యూటీఎఫ్ రాష్ట్ర కమిటీ సభ్యులు శ్యామ్ అన్నారు. బుధవారం మండల కేంద్రంలోని కేజీబీవీ పాఠశాలలో నిరసన కార్యక్రమం చేపట్టారు. నేడు జరగనున్న చలో ఎస్‌పిడి కార్యక్రమానికి ఉపాధ్యాయులందరూ హాజరై విజయవంతం చేయాలన్నారు. యూటీఎఫ్ మండల అధ్యక్షులు సంతోష్ కుమార్, జిల్లా కమిటీ సభ్యులు నరేందర్, జిల్లా నాయకులు అశోక్, సత్యనారాయణ, ఎస్ ఓ నిర్మల, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

రేవంత్‌ను కలిసిన మండలాల నూతన అధ్యక్షులు



నవతెలంగాణ-చేగుంట : టీపీసీసీ అధ్యక్షుడు ఎనుముల రేవంత్ రెడ్డిని మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు వడ్ల నవీన్ కుమార్ మర్యాదపూర్వకంగా కలిసారు. దుబ్బాక నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ చెరుకు శ్రీనివాస్ రెడ్డి పిలుపు మేరకు ఎనిమిది మండలాల నూతన అధ్యక్షులు, పట్టణ అధ్యక్షులు హైదరాబాదులో రేవంత్ రెడ్డిని కలిశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తమపై నమ్మకం ఉంచి పదవీ బాధ్యతలు అప్పజెప్పినందుకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో దుబ్బాక నియోజకవర్గం లోని మండలాల అధ్యక్షులు, పట్టణ అధ్యక్షులు, జిల్లా సేవాదళ్ అధ్యక్షుడు వెంకట్ రెడ్డి, మండల కాంగ్రెస్ నాయకుడు, ఉపాధ్యక్షుడు, మాసాయిపేట శ్రీనివాస్, స్టాలిన్, నర్సింలు, ఫకీర్ నాయక్, సాయి పాల్గొన్నారు.

త్రైమాసిక అవార్డులకు ఐదుగురు ఎంపిక

నవ తెలంగాణ-మెదక్ టౌన్



ఉమ్మడి మెదక్ జిల్లాలో ఆర్టీసీ ఉద్యోగులకు త్రైమాసిక అవార్డులలో భాగంగా మెదక్ డిపో నుంచి ఐదుగురు ఉద్యోగస్తులు ఎంపికైనట్లు మెదక్ డిపో మేనేజర్ రవిచందర్ తెలిపారు. డ్రైవర్ విభాగంలో అత్యధిక ఇన్సెంటివ్ తీసుకున్న వారిలో అన్వర్, శ్రీనివాస్ ఎంపికైనట్లు తెలిపారు. హెయిర్ బస్ డ్రైవర్ విభాగంలో రీజినల్ లెవెల్‌లో నవీన్ ఎంపికైనట్లు పేర్కొన్నారు. కండక్టర్ భాగంలో సందీప్, షఫీ ఎంపికైనట్లు తెలిపారు. వీరికి మెదక్ రీజినల్ మేనేజర్ సుదర్శన్ చేతుల మీదుగా క్యాష్ అవార్డు, ప్రశంస పత్రాలు అందజేసినట్లు తెలిపారు. ఎంపికైన ఉద్యోగస్తులకు మెదక్ డిపో మేనేజర్ ప్రత్యేక అభినందనలు తెలిపారు.

పకడ్బందీగా ఓటర్ జాబితా రూపొందించాలి

క్షేత్రస్థాయిలో వివరాలను పరిశీలించాలి

నవతెలంగాణ-పెద్ద శంకరంపేట్



ఓటరు జాబితాను పకడ్బందీగా రూపొందించాలని నియోజకవర్గ బూతు స్థాయి అధికారి భూమయ్య అన్నారు. పెద్ద శంకరంపేటలోని ప్రభుత్వ పాఠశా లలో నిర్వహించిన మండల మండల బూత్ స్థాయి లెవెల్ శిక్షణ నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఇప్పటివరకు గ్రామాలలో ఓటరును క్షేత్రస్థాయిలో వివరాలను పరిశీలించి ధృవీకరించాలన్నారు. ప్రతి గ్రామంలో 18 సంవత్సరాలు నిండిన ఓటరును ఓటు హక్కును నమోదు చేసుకునేలా చర్యలు తీసుకోవాలని తెలిపారు మార్పులు చిరునామాలు చేర్పులు సవరణలు, గ్రామంలో చనిపోయిన వారి ఓటర్ల విషయంలో కచ్చితంగా మరణ ధృవపత్రం పొంది కుటుంబ సభ్యులకు వాకబు చేసిన తర్వాత జాబితా నుంచి ఆ వ్యక్తి వివరాలను తొలగించాలని సూచించారు. గ్రామంలో ఒకే కుటుంబంలో ఉన్నవారు ఒకే బూతులోనికి పేర్లు మార్చుకోవచ్చని బూత్ స్థాయి అధికారి భూమయ్య తెలిపారు. ఈ సమావేశంలో నారాయణఖేడ్ నియోజకవర్గ బూతు స్థాయి మానిటరింగ్ శిక్షణ అధికారి నర్సింలు పెద్ద శంకరంపేట ఆర్ఐ శ ర్జప్ప ఆయా గ్రామాల అంగన్వాడి టీచర్లు పాల్గొన్నారు.

మెడిసిటీ ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం

నవతెలంగాణ-వెల్దుర్తి



మాసాయిపేట మండలం అచ్చంపేట గ్రామంలో మేడ్చల్ పరిసరాల్లో ఉన్న మెడిసిటీ ఆసుపత్రి ఆధ్వర్యంలో బుధవారం ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహించారు. ఈ వైద్య శిబిరంలో 150 మంది రోగులకు వైద్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. 40 మంది వివిధ రకాల శస్త్ర చికిత్సలు చేయాల్సి ఉండగా మెడిసిటీ ఆసుపత్రిలో ఉంచి చికిత్సలు చేయాల్సి ఉందన్నారు. వచ్చే సోమవారం మెడిసిటీ ఆసుపత్రి వారి ఆధ్వర్యంలో తమ సొంత వాహనంలో తీసుకెళ్లి పూర్తిగా ఉచితంగా శస్త్ర చికిత్సలు నిర్వహించి ఉచితంగా మందులు ఇచ్చి భోజన వసతి కూడా కల్పించడం జరుగుతుందని వైద్యులు తెలిపారు. తిరిగి వారి వారి గ్రామాల్లో వదిలివేస్తామన్నారు. ఈ శిబిరంలో మెడిసిటీ ఆసుపత్రికి చెందిన డాక్టర్ నికిత డాక్టర్ సుజనా డాక్టర్ ఇమ్రాన్ వైద్య పరీక్షలు నిర్వహించారు. ఆస్పత్రి సిబ్బంది వెంకటాద్రి బాబా గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

చాకలి ఐలమ్మ విగ్రహా ఏర్పాటుకు భూదానం

నవతెలంగాణ -నార్సింగి



తెలంగాణ సాయుధ పోరాట యోధురాలు చాకలి ఐలమ్మ విగ్రహా ఏర్పాటుకు నార్సింగి మండలం సంకాపూర్ గ్రామంలో బుధవారం భూమి పూజ చేశారు. నార్సింగి మండల రజక సంఘం అధ్యక్షుడు రాయిలాపూరం శ్రీనివాస్ చాకలి ఐలమ్మ విగ్రహానికి భూదానం చేసిన ఈ కార్యక్రమంలో సంకాపూర్ గ్రామ సర్పంచ్ సుజాత శ్రీనివాస్ ముఖ్య అతిథిగా పాల్గొని భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా విగ్రహ భూదాత శ్రీనివాస్ మాట్లాడుతూ తెలంగాణ సాయుధ పోరాట యోధురాలు చాకలి ఐలమ్మ ధైర్య సాహసాలు, పోరాట పటిమ అందరికీ ఆదర్శమని అన్నారు. రజాకార్లతో ఆమె చేసిన పోరాటం మరవలేనిదని, ఆమె త్యాగాలు, ధైర్య సాహసాలు భావి తరాలకు చేర్చాల్సిన భాధ్యత మనందరిదని ఈ సందర్భంగా శ్రీనివాస్ అన్నారు. అలాంటి యోధురాలి విగ్రహానికి భూమిని ఇవ్వటం తన అదృష్టంగా భావిస్తున్నానని ఈ సందర్భంగా రాయిలపురం శ్రీనివాస్ అన్నారు. ఈ కార్యక్రమంలో శ్రీనివాస్, గ్రామ సర్పంచ్ సుజాత శ్రీనివాస్‌తో పాటు మండల రజక సంఘం ఉపాధ్యక్షుడు భాస్కర్, కుమార్, పోచయ్య, నర్సింలు, యాదగిరి, సత్తయ్య, రాములు, సిద్ధిరాములు రజక సంఘం సభ్యులు పాల్గొన్నారు.

స్పష్టమైన హామీ ఇస్తేనే సమ్మె విరామిస్తాం

వర్షంలో సైతం గ్రామ పంచాయతీ కార్మికుల సమ్మె.

సీఐటీయు జిల్లా సహాయ కార్యదర్శి చొప్పరి రవి కుమార్ డిమాండ్

నవతెలంగాణ-సిద్దిపేట అర్బన్



గ్రామ పంచాయతీ కార్మికుల సమస్యలు స్పష్టమైన హామీ ఇచ్చి సమ్మె విరమించేందుకు ప్రభుత్వం జేఏసీతో చర్చలు జరపాలని సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి చొప్పరి రవికుమార్ డిమాండ్ చేశారు. బుధవారం రోజున రాష్ట్ర వ్యాప్తంగా భారీ వర్షాలు ఉన్నప్పటికీ సిద్దిపేట జిల్లా కేంద్రంతో పాటు అన్ని మండలలో సమ్మె చేశారు. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం మాత్రం సమస్యను పరిష్కరించకుండా తెలంగాణలోనే అత్యధిక జీతాలు ఇస్తున్నామంటూ గ్రామీణ అభివృద్ధి శాఖ మంత్రివర్యులు ఎర్రబెల్లి దయాకర్ రావు మాట్లాడడం సరికాదన్నారు. పారిశుద్ధ కార్మికులు చేస్తున్న పనులు వెలకట్టలేనివని ఇలాంటి పనులు లక్షల రూపాయలు ఇచ్చినా మరొకరు చేయలేరన్నారు. సాక్షాత్తు అసెంబ్లీ సాక్షిగా సీఎం కేసీఆర్ పారిద్య కార్మికులను పర్మినెంట్ చేస్తానని హామీ ఇచ్చి మరిచి పోయారన్నారు. పంచాయతీ కార్మికులను వెంటనే పర్మినెంట్ చేసి జీతాలు పెంచాల్సింది పోయి ప్రభుత్వం పరిశీలిస్తాం, ఆందోళన విరమిస్తే పరిష్కారం చేస్తామని మాటలు చెప్పడం సరికాదన్నారు. స్పష్టమైన హామీతో పరిష్కారం చూపాలని అప్పుడు మాత్రమే సమ్మె విరమిస్తామని ఈ సందర్భంగా ఆయన ప్రభుత్వానికి సూచించారు. 14వ రోజు సమ్మెలో సిద్దిపేట అర్బన్ జేఏసీ నాయకులు రాయ నర్సు, మల్లేశం, యాదగిరి, వివిధ గ్రామాల గ్రామపంచాయతీ కార్మికులు పాల్గొన్నారు.

14వ రోజుకు చేరిన జీపీ కార్మికుల సమ్మె

నవతెలంగాణ-కోహెడ



మండల కేంద్రంలోని మండల పరిషత్ కార్యాలయ సమీపంలో గ్రామపంచాయతీ కార్మికుల సమస్యలను పరిష్క రించాలంటూ చేస్తున్న సమ్మె బుధవారంతో 14వ రోజుకు చేరుకుంది. ఈ సందర్భంగా మండల అధ్యక్షుడు మెట్టు వెంకటరెడ్డి మాట్లాడుతూ 51 జీవోను వెంటనే రద్దు చేసి జీవో నెంబర్ 60 ప్రకారం సిబ్బంది వేతనాలు అమలు చేయాలని డిమాండ్ చేశారు. అలాగే ఉద్యోగ భద్రత, ప్రమాదబీమా కల్పించాలన్నారు. అలాగే కారోబార్, బిల్‌కలెక్టర్‌లకు ప్రత్యేక హోదా కల్పించాలని, ప్రమాదంలో మరణించిన కార్మికుల కుటుంబాల్లో ఒకరికి ఉద్యోగంతో పాటు సహజ మరణానికి ఇన్సూరెన్స్‌గా ఐదు లక్షలకు పెంచాలన్నారు. వర్షాన్ని సైతం లెక్కచేయకుండా సమ్మెలో పాల్గొంటున్నారని, ఇప్పటికైనా గ్రామపంచాయతీ కార్మికులు చేస్తున్న సమ్మెను ప్రభుత్వం గుర్తించి సమస్యలను పరిష్కరించాలన్నారు. ఈ కార్యక్రమంలో తలారి అనిల్‌కుమార్, ఆంజనేయులు, యాదగిరి, మల్లేషం, రాజు, రాజమల్లు, సంపత్, కనకయ్య, వేణు, బిక్షపతి, లక్ష్మీ, అంతవ్వ, రాములు, కొమురయ్య, సంపత్, రాజు, మల్లయ్య, తదితరులు పాల్గొన్నారు.

అతిథి అధ్యాపకుల పోస్టులకు దరఖాస్తుల ఆహ్వానం

మెదక్ నోడల్ అధికారి సత్యనారాయణ

నవ తెలంగాణ-మెదక్ టౌన్ : జిల్లాలోని వివిధ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఖాళీగా ఉన్న 68 బోధన సిబ్బంది పోస్టులకు అతిథి అభ్యర్థుల ఎంపికకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు నోడల్ ఆఫీసర్ సత్యనారాయణ తెలిపారు. అర్హత కలిగిన అభ్యర్థులు సంబంధించిన సబ్జెక్టులో 50 శాతం ఆ పైన మార్కులు ఉత్తీర్ణత పొందినవారు అర్హులని పేర్కొన్నారు. అభ్యర్థులు వారి అర్హత సర్టిఫికెట్లు, స్థానికత, బయోడేటాతో మెదక్ నోడల్ అధికారి కార్యాలయం లో గురువారం 20వ తేది నుంచి సోమవారం 24వ తేది సాయంత్రం 5 గంటల వరకు దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు. గడువు ముగిసిన అనంతరం వచ్చే దరఖాస్తులను తిరస్కరించినున్నట్లు తెలిపారు. శుక్రవారం 28వ తేదిన అతిథి ఆధ్యాపకుల ఎంపిక ప్రక్రియ జిల్లా కలెక్టర్, జాయింట్ కలెక్టర్, ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ ఆధ్వర్యంలో సెలక్షన్ చేయనున్నట్లు తెలిపారు. ఎంపికైన అభ్యర్థులు ఆగస్టు ఒకటో తేదీన ఆయా కళాశాలలో రిపోర్టింగ్ చేయాల్సిందిగా పేర్కొన్నారు. అర్హులైన అభ్యర్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన తెలిపారు.

అభివృద్ధి పనులను వేగవంతం చేయాలి

జిల్లా కలెక్టర్ రాజర్షి షా

నవతెలంగాణ-మెదక్



గజ్వెల్ ఏరియా డెవలప్మెంట్ అథారిటీ (గడా) పరిధిలోని అభివృద్ధి పనులను వేగవంతం చేయాలని జిల్లా కలెక్టర్ రాజర్షి షా పేర్కొన్నారు. బుధవారం కలెక్టరేట్‌లోని వీడియో కాన్ఫరెన్స్ హాల్లో ఎస్డిఎఫ్, గడా, సిడిపి, నిధులతో చేపట్టిన పనుల పురోగతిని పంచాయత్ రాజ్, మునిసిపల్, ఇంజనీరింగ్ శాఖల అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ తూప్రాన్, మనోహరాబాద్ మండలాల్లో ఎస్సీ, ఎస్టీ, బిసి కమ్యూనిటీ హాల్స్, మహిళా భవనాలు, సీసీ రోడ్స్, డంప్ యార్డ్స్, గ్రామపంచాయతీ భవనాలు, ఆరోగ్య కేంద్రాలు , ఆరోగ్య సబ్ సెంటర్లు, వైకుంఠధామాల పనులు వేగవంతం చేయాలన్నారు. అనంతరం ఇంజనీరింగ్ అధికారులకు పనులను పర్యవేక్షించి నివేదికలు అందించాలని ఆదేశించారు. ఆగస్టు మొదటి వారంలోగా పనులు పూర్తి కావాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో గడా ప్రత్యేక అధికారి ముత్యం రెడ్డి, జెడ్పీ సీఈఓ శైలేష్, తూప్రాన్ ఆర్డీవో జయచంద్రారెడ్డి, పీఆర్ ఈఈ సత్యనారాయణ రెడ్డి, జిల్లా వైద్యాధికారి చందూనాయక్, తూప్రాన్ మునిసిపల్ కమీషనర్ మోహన్, సంబంధిత శాఖల ఇంజనీర్లు, కాంట్రాక్టర్లు, పాల్గొన్నారు.

మహిళల భద్రతకు షీ టీమ్స్ భరోసా

ఎస్పీ రోహిణీ ప్రియదర్శిని

నవతెలంగాణ-మెదక్



మహిళల భద్రతకు షి టీమ్స్ భరోసాను ఇచ్చే విధంగా పని చేయాలని జిల్లా ఎస్పి రోహిణీ ప్రియదర్శిని పేర్కొన్నారు. బుధవారం జిల్లా ఎస్పీ కార్యాలయంలో జిల్లా షీ టీం బృందాలతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్పి మాట్లాడుతూ.. స్నేహపూర్వకమైన పోలీసింగ్ అందించాలనే లక్ష్యంతో, మహిళలకు పూర్తి సురక్షితమైన, భద్రమైన వాతావరణాన్ని అందించాలనే ఆలోచనతో తెలంగాణ ప్రభుత్వం షీటీమ్స్‌ను 2014 అక్టోబర్ 24న హైదరాబాద్లో ప్రారంభించినట్లు తెలిపారు. హైదరాబాద్‌లో షీ టీమ్స్ మంచి ఫలితాలు రాబట్టడంతో ఏప్రిల్ 2015 నుంచి ఈ బృందాలను సైబరాబాద్, ఆ తర్వాత తెలంగాణలోని అన్ని జిల్లాలకు విస్తరింపజేయడం జరిగిందన్నారు. మెదక్, తూప్రాన్ డివిజన్ల వారిగా షీ టీమ్స్ జిల్లాలో ఉన్న షీ టీమ్స్ బృందాలు ప్రభుత్వ కళాశాలలో, ప్రభుత్వ పాఠశాలల్లో, తెలంగాణ మోడల్ స్కూళ్లలో, రెసిడెన్షియల్ స్కూళ్ళలో, కేజీబీవీ స్కూళ్లలో విద్యార్థిని విద్యార్థులకు ర్యాగింగ్, ఈవ్ టీజింగ్, పోక్సో, షీ టీమ్స్, యాంటీ హ్యూమెన్ ట్రాఫికింగ్‌లపై అవగాహన కార్యక్రమాలు నిర్వహించడం జరిగిందన్నారు. మహిళలు, పిల్లలకు భద్రత మరియు రక్షణ కల్పించాలనే దృక్పథంతో షి టీమ్స్ పనిచేస్తాయన్నారు. ఇబ్బందుల్లో ఉన్న మహిళలు మరియు బాలికలకు నమ్మకమైన పద్ధతుల ద్వారా సహాయం అందించుట జరుగుతుందన్నారు. జిల్లా షిటీంకు ఫోన్ లేదా 6303923823, 8712657963 వాట్సాప్ ద్వారా కానీ షీ టీమ్ మెదక్ జిల్లా ఫేస్ బుక్, మెయిల్ ట్విట్టర్‌లలో ఫిర్యాదులు చేయవచ్చని తెలిపారు. ఈ కార్యక్రమంలో షీటీమ్ సిబ్బంది ఏఎస్ఐ రుక్సానా, లక్ష్మీ కానిస్టేబుళ్లు, విజయ్ కుమార్, ప్రమీల, నవీన్ కాంత్, స్వరూప, శ్రీనివాస్ ఉన్నారు.

గ్రామపంచాయతీ కార్మికుల వంటావార్పు





నవతెలంగాణ-నిజాంపేట

నిజాంపేట మండల కేంద్రంలో గ్రామపంచాయతీ పారిశుద్ధ కార్మికుల నిరవధిక సమ్మె14వ రోజు కొనసాగుతుంది. ఈ సమ్మెలో భాగంగా సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షురాలు బాలమణి ఆధ్వర్యంలో వంటావార్పు కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ 14 రోజుల నుంచి గ్రామపంచాయతీ పారిశుద్ధ కార్మికులు సమ్మె చేస్తున్నప్పటికీ ప్రభుత్వం స్పందించకపోవడం బాధాకరమన్నారు. నిజాంపేట మండలంలోని పరిశుద్ధ కార్మికులను కొందరు సర్పంచులు బెదిరింపులకు గురి చేసి పనులు చేయించుకుంటున్నారన్నారు. తెలంగాణ రాష్ట్రంలో దొరల, పటేళ్ల పాలన ఇంకా కొనసాగుతుందన్నారు. పారిశుద్ధ కార్మికులకు బెదిరింపులకు గురి చేస్తే తగ్గేదే లేదని ప్రభుత్వం దిగి వచ్చేంత వరకు సమ్మె కొనసాగిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో పారిశుద్ధ కార్మికులు ప్రవీణ్, మల్లేశం, బత్తుల రాములు, ఇందిరా, రవి, దుబ్బవ్వ, దేవలక్ష్మి, సురేష్, ప్రమీల, నాగవ్వ, జమున, కుమార్, ఏసు, మైసయ్య, కారోబార్ రమేష్, ఎల్లవ్వ, నరసవ్వ, రాజవ్వ శ్యామల , మేకల కిషన్ తదితరులు పాల్గొన్నారు.

నవతెలంగాణ-పెద్ద శంకరంపేట్

తమ సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ పెద్ద శంకరంపేటలో పంచాయతీ కార్మికుల సమ్మె చేపట్టి 14వ రోజుకు చేరిందని మండల పంచాయతీ కార్మికుల సంఘం అధ్యక్షులు పి రాములు తెలిపారు. ఇప్పటికైనా ప్రభుత్వం వెంటనే పంచాయతీ కార్మికుల సమస్యలను పరిష్కరించాలని, రెగ్యులరైజేషన్ చేసి జీతాలు పెంచలని కోరారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్మికులు పల్లెబోయిన రాములు. చాకలి రాములు వెంకటేశం సంగయ్య దాసు సురేందర్ మల్లేశం సాయిలు లచ్చమ్మ సత్యమ్మ సాయమ్మ పాల్గొన్నారు.

జోరు వానలో కొనసాగిన నిరసన

నవ తెలంగాణ-తూప్రాన్ రూరల్/మనోహరాబాద్

గ్రామపంచాయతీ కార్మికుల సమస్యల పరిష్కారం కోసం చేపట్టిన సమ్మె నేటికీ 14 రోజుకు చేరుకుంది. కార్మికులు జోరు వానలోను మనోహరాబాద్ మండల కేంద్రంలో తమ నిరసనను వీడలేదు . బుధవారం నిరసన కార్యక్రమాన్ని కొనసాగించారు. ఈ సందర్భంగా గ్రామపంచాయతీ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి ఆసిఫ్ మాట్లాడుతూ 14 రోజులుగా సమ్మె కొనసాగిస్తున్నా ప్రభుత్వం దిగి రాకపోవడం సిగ్గుచేటన్నారు. కార్మికుల న్యాయమైన డిమాండ్లను నెరవేర్చాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో గ్రామ అధ్యక్షులు వీరేష్, స్వామి, అంజయ్య, రాజు, ఆగమయ్య, సుశీల, ఎల్లమ్మ బాలామణి, నరసమ్మ, శాంతమ్మ, సామల అనసూయ, సుజాత, యాదమ్మ లక్ష్మి కవిత తదితరులు పాల్గొన్నారు.

ప్రమాదకరంగా మారిన విద్యుత్ స్తంభం

- భయంభయంగా జీవిస్తున్న కుటుంబాలు
- పట్టించుకోని విద్యుత్ శాఖ అధికారులు
- పలుమార్లు ఫిర్యాదు చేసిన ఫలితం శూన్యం






నవతెలంగాణ-మెదక్

అధికారుల నిర్లక్ష్యం.. పాలకుల పట్టింపు లేనితనం ఓ మహిళను గూడు వదిలి గుడి దరికి చేరేలా చేసింది. 11 కెవి విద్యుత్ స్తంభం ప్రమాదకరంగా మారి ఎప్పుడు కూలుతుందోనని పలు కుటుంబాలు భయం భయంగా జీవిస్తున్నారు. సమస్యను పరిష్కరించాలని కోరుతూ బాధితులు పలుమార్లు అధికారుల చుట్టూ తిరిగినా పట్టించుకున్న నాధులే కరువయ్యారు. దీంతో స్తంభం ముందు ఇంట్లో నివాసం ఉంటున్న మహిళ భయంతో ఇల్లు వదిలి సమీప గుడిలో ఆశ్రయం పొందారు. దీనికి సంబంధించిన వివరాలు ఇలా ఉన్నాయి. మెదక్ పట్టణంలోని 5 వార్డు ఇందిరాకాలని చివరి గల్లీ మీదుగా 11 కెవి కరెంట్ లైన్ వెళ్ళింది. ఈ లైన్‌కు సంబంధించిన సపోర్ట్ స్తంభాలను ఇళ్లకు, కెనాల్ కాలువకు మధ్యలో ఏర్పాటు చేయడం జరిగింది. అయితే ప్రతీ వర్షాకాలంలో కాలువ ద్వారా నీటి ఉధృతి ఎక్కువగా ప్రవహిస్తుండటం వలన విద్యుత్ స్తంభం చుట్టూ ఉన్న మట్టి కొంచం కొంచెంగా తగ్గిపోయి విద్యుత్ స్తంభం వంగి పడిపోయెందుకు సిద్దంగా ఉందని, ఎర్తింగ్ వచ్చి విద్యుత్ షాక్‌కు గురయ్యే ప్రమాదం ఉందని స్థానికులు చెబుతున్నారు. దీంతో స్థంభం ముందు ఉన్న ఇంట్లో నివసిస్తున్న సృజన అనే మహిళ తన కొడుకుతో కలిసి బిక్కుబిక్కుమంటూ కాలం వెళ్ళదీయాల్సి వస్తుంది. విద్యుత్ స్తంభం కింద పడిపోతే సుమారు ఐదు కుటుంబాలకు ప్రమాదం పొంచి ఉందని వాపోయారు. ఈ విషయంలో పలుమార్లు విద్యుత్ శాఖ అధికారులను కలిసి విన్నవించుకున్నా పట్టించుకున్న పరిస్థితి లేదని తెలిపారు. గత రెండు రోజులుగా వర్షాలు కురుస్తుండటంతో విద్యుత్ స్తంభం ఎక్కడ కూలుతుందోననే భయంతో ఆ మహిళ ఇల్లు వదిలి గుడి వద్దకు వెళ్ళడం జరిగిందని భాదితులు తెలియజేశారు. ఇప్పటికైనా స్థానిక ఎమ్మెల్యే, కలెక్టర్ చొరవ చూపి పడిపోయేందుకు సిద్ధంగా ఉన్న 11 కెవి విద్యుత్ స్థంభాన్ని మరో చోటకు మార్చాలని విజ్ఞప్తి చేశారు.

ఛలో ఎస్పీడీని విజయవంతం చేయాలి







టీఎస్ యుటీఎఫ్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు వలి అహ్మద్, గజ్వేల్ వెంకట్ కిరణ్

నవతెలంగాణ-మర్కుక్ : జులై 20న ఛలో ఎస్పీడీ ఆఫీస్ కేజీబీవీ సిబ్బందికి కనీస వేతనం (బేసిక్ పే) ఇవ్వాలని, ఉద్యోగ భద్రత కల్పించాలని, ఇతర సమస్యలు పరిష్కరించాలని టీఎస్ యుటీఎఫ్ సిద్దిపేట జిల్లా అధ్యక్షులు వలి ఆహ్మద్ , జిల్లా కార్యదర్శి గజ్వేల్ వెంకట్ కిరణ్ అన్నారు. బుధవారం మర్కుక్ మండల శాఖ ఆధ్వర్యంలో కెజీబీవీ మర్కుక్‌లో సన్నాహాక కార్యక్రమమాన్ని నిర్వహించారు. సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలని డిమాండ్ చేశారు. సుప్రీంకోర్టు తీర్పు ప్రకారం కెజీబీవీ, ఈఆర్ఎస్, ఎస్ఎస్ ఉద్యోగులందరికి కనీస వేతనం బేసిక్ పే చెల్లించాలన్నారు. కేజీబీవీ ఉద్యోగులందరికి హెల్త్ కార్డులు ఇచ్చి నగదు రహిత వైద్యం అందించాలన్నారు. కేజీబీవీ ఉద్యోగులందరూ అధిక సంఖ్యలో పాల్గొని మన సంఘటిత శక్తిని, పోరాట పటిమను ప్రభుత్వానికి తెలియజేయాలని, తమ సమస్యల గురించి ప్రభుత్వంపై వత్తిడి తీసుకురావాలన్నారు. ఈ కార్యక్రమంలో కెజీబీవీ మర్కుక్ పాఠశాల సిబ్బంది, తదితరులున్నారు.

నవతెలంగాణ-బెజ్జంకి : ఉద్యోగ, ఉపాధ్యాయుల సమస్యల సాధనకు ఈ నెల 20న హైదరబాద్ యందు ఎస్‌పీడీ కార్యాలయం వద్ద తలపెట్టిన ధర్నాను జయప్రదం చేయాలని టీఎస్ యుటీఎఫ్ కార్యదర్శి గిరిబాబు కోరారు. బుధవారం మండల కేంద్రంలోని కేజీబీవీ విద్యాలయాన్ని టీఎస్ యుటీఎఫ్ జిల్లా కార్యదర్శి గిరిబాబు సందర్శించి ఉపాధ్యాయులు, సిబ్బందితో మాట్లాడారు. ధర్నాకు మండలంలోని ఉపాధ్యాయులు, ఉద్యోగ సిబ్బంది హాజరై జయప్రదం చేయాలని గిరిబాబు కోరారు. టీఎస్ యూటీఎఫ్ మండల కార్యదర్శి దుర్గాప్రసాద్, కేజీబీవీ విద్యాలయ బోధన సిబ్బంది పాల్గొన్నారు.

నవతెలంగాణ-జగదేవపూర్ : కేజీబీవీ సిబ్బందికి కనీస వేతనం (బేసిక్ పే) ఇవ్వాలని, ఉద్యోగ భద్రత కల్పించాలని, ఇతర సమస్యలు పరిష్కరించాలని టీఎస్ యూటీఎఫ్ సిద్దిపేట జిల్లా శాఖ, మండల శాఖ ఆధ్వర్యంలో బుధవారం కేజీబీవీ జగదేవపూర్‌లో సన్నాహక కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో టీఎస్ యూటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు వలి అహ్మద్ మాట్లాడుతూ సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలని సుప్రీంకోర్టు తీర్పు ప్రకారం కెజిబివి, యూ ఆర్ ఎస్, ఎస్ ఎస్ ఉద్యోగులందరికి వారు పనిచేస్తున్న హెూదా ప్రకారం కనీస వేతనం బేసిక్ పే చెల్లించాలని అన్నారు. టీఎస్ యూటీఎఫ్ జిల్లా కార్యదర్శి గజ్వేల్ వెంకట్ కిరణ్ మాట్లాడుతూ కెజిబివి ఉద్యోగులందరికి హెల్త్ కార్డులు ఇచ్చి నగదు రహిత వైద్యం అందించాలన్నారు. చలో ఎస్పీడీ కార్యక్రమంలో ఉద్యోగులు అందరు అధిక సంఖ్యలో పాల్గొని మన సంఘటిత శక్తిని ,పోరాట పటిమను ప్రభుత్వానికి తెలియజేసి మన సమస్యల పరిస్కారంపై వత్తిడి తేవాలన్నారు. ఈ కార్యక్రమంలో కెజిబివి జగదేవపూర్ పాఠశాల సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ఆయిల్ ఫామ్ తోటల పెంపకానికి ప్రోత్సాహకం

జిల్లా కలెక్టర్ రాజర్షి షా

నవతెలంగాణ - మెదక్ : పండ్లు, ఆయిల్ ఫామ్ తోటల పెంపకానికి ప్రభుత్వ ప్రోత్సాహకం అందిస్తుందని జిల్లా కలెక్టర్ రాజర్షిషా పేర్కొన్నారు. బుధవారం కలెక్టర్ ఛాంబర్లో పండ్ల తోటలు, ఆయిల్ ఫామ్ సాగుకు తీసుకోవాల్సిన చర్యలపై వ్యవసాయ అధికారులు, ఉద్యానవన శాఖ అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో పండ్ల తోటల సాగుకు ప్రభుత్వ ప్రోత్సాహకం అందిస్తుందని, జూలై 31 నాటికి జిల్లాలో 1500 ఎకరాల్లో పండ్ల తోటల సాగుకు ఆసక్తి గల రైతులను గుర్తించాలన్నారు. 5 ఎకరాల లోపు భూమి, ఉపాధి హామీ పథకం జాబ్ కార్డు ఉన్న ఎస్సీ, ఎస్టీ, 100 శాతం రాయితీ, సన్న, చిన్న కారు రైతులను 90 శాతం రాయితీ లబ్ధిదారులుగా ఎంపిక చేయడానికి అర్హులని గుర్తించాలన్నారు. వీరికి సబ్సిడీ పై డ్రిప్ ఇరిగేషన్ సౌకర్యం కల్పించడంతో పాటు పండ్ల తోటల పెంపకానికి అవసరమైన పెట్టుబడిని ప్రభుత్వం సమకూరుస్తుందని, ఇందుకోసం ఉపాధి హామీ పథకంను వినియోగించడం జరుగుతుందన్నారు. పండ్ల తోటల సాగు కింద మామిడి, నిమ్మ, నారింజ, జామ, సీతాఫలం, సపోటా, మునగ, డ్రాగన్, దానిమ్మ ప్లానిటేషన్‌కు 1500 ఎకరాలు ఎంపిక చేయాల్సి ఉంటుందని పేర్కొన్నారు. జులై చివరినాటికి ఎంపిక చేసిన లబ్ధిదారులకు ఆగస్టు నెలాఖరు వరకు డ్రిప్ ఇరిగేషన్ పనులు పూర్తిచేసి, ఉపాధి హామీ పథకం కింద గుంతలు తవ్వి పండ్ల మొక్కలు నాటడం జరుగుతుందన్నారు. పండ్ల తోటలో అంతర్ పంటలు వేసుకునే అవకాశం ఉండడంతో రైతులకు రెండు రకాలుగా ఆదాయం లభిస్తుందని, సంప్రదాయ పంటలతో రైతులు నష్టపోతున్న నేపథ్యంలో, పరిష్కారంగా ఉద్యాన పంటలను సాగు చేయాలన్నారు. దీనిపై జిల్లాలో రైతులకు విస్తృతంగా ప్రచారం చేసి లబ్ధిదారులను ఎంపిక చేయాలన్నారు. వ్యవసాయ, ఉద్యానవన శాఖ అధికారులు సంయుక్తంగా పనిచేయాలని సూచించారు. ఉద్యానవన శాఖ ద్వారా ఆయిల్ ఫాం తోటల పెంపకానికి ఈ సంవత్సరం 2023-24లో 5 వేల ఎకరాలలో సాగుకి ప్రభుత్వ అనుమతి లభించిందని, ఆయిల్ ఫాం సాగుకు ప్రభుత్వ ప్రోత్సాహకం క్రింద నాలుగు సంవత్సరాలకు రూ. 25 కోట్లు ప్రభుత్వం రాయితీగా అందజేస్తుందని తెలిపారు. ఆయిల్ ఫాం సాగుకు ఎకరాకు రూ. 50,918 రాయితీ ప్రభుత్వం ఇస్తుందన్నారు. ఆసక్తి గల రైతులు జులై 30 వరకు వ్యవసాయ విస్తరణ అధికారికి, ఉద్యానవన అధికారికి దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు ఎంపికైన రైతులకు ఒక రోజు శిక్షణ కార్యక్రమం ఏర్పాటు చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో డీఆర్డిఏ పిడి శ్రీనివాస్, ఉద్యాన, పట్టు పరిశ్రమల అధికారి డి. నర్సయ్య, అగ్రికల్చరల్ శాఖ డివిషనల్ అధికారులు లీవింగ్ ఫుడ్స్ ఇండియా ప్రతినిధి డాక్టర్. కృష్ణ సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

విద్యుత్ షాక్‌తో రెండు పాడి గేదెలు మృతి

నవతెలంగాణ-చిన్న శంకరంపేట.



విద్యుత్ షాక్‌తో రెండు పాడి గేదెలు మృతి చెందిన సంఘటన మెదక్ జిల్లా చిన్న శంకరంపేట మండలం మిర్జాపల్లి గ్రామంలో బుధవారం చోటు చేసుకుంది. గ్రామానికి చెందిన ర్యాల నర్సింలుకు చెందిన రెండు పెద్ద పాడి పశువులు గ్రామంలో గల పెద్దమ్మ దేవాలయం పరిసర ప్రాంతంలో విద్యుత్ షాక్ తగిలి మృతి చెందాయి. విద్యుత్ మెయిన్ లైన్ వైరు తెగి కింద పడడంతో అటువైపు మేతకు వెళ్ళిన రెండు బర్రెలు అక్కడికక్కడే మృతి చెందాయి. బాధితుడు నరసింహులు పాడి పశువుల ద్వారా తన కుటుంబం జీవనోపాధి పొందుతున్నామని తెలిపారు. సుమారుగా రూ.1,30,000ల వరకు ఆస్తి నష్టం జరిగిందని బాధితుడు ఆవేదన వ్యక్తం చేశారు. తమకు ఆర్థిక సహాయం అందించి తమ కుటుంబానికి జీవనోపాధి కల్పించాలని బాధితుడు నరసింహులు ప్రభుత్వాన్ని కోరారు.

వైశ్య రత్న బాలాజీ గుప్త సేవలు చిరస్మరణీయం

సంతాప సభలో మున్సిపల్ చైర్మన్ రాజమౌళి

మాజీ ఎమ్మెల్యేలు తూంకుంట నర్సారెడ్డి

నవతెలంగాణ-వర్గల్





వైశ్యరత్న, నాచగిరి శ్రీ వాసవి కన్యకా పరమేశ్వరి ఆర్యవైశ్య నిత్యాన్నదాన సత్రం అధ్యక్షులు చిట్టిమిళ్ల బాలాజీ గుప్త సేవలు చిరస్మరణీయమని గజ్వేల్, రామాయం పేట మాజీ ఎమ్మెల్యేలు తూంకుంట నర్సారెడ్డి , ఆర్ విఠల్ రెడ్డి, గజ్వేల్ మున్సిపల్ చైర్మన్ రాజమౌళి గుప్త పేర్కొన్నారు. బుధవారం సిద్దిపేట జిల్లా నాచగిరి శ్రీ వాసవి కన్యకా పరమేశ్వరి ఆర్యవైశ్య సత్రం సమావేశ మందిరంలో బాలాజీ గుప్త సంతాప సభ ఆర్యవైశ్య సత్రం ప్రధాన కార్య దర్శి ఎన్సీ రాజమౌళి గుప్త అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గత రెండు దశాబ్దా లుగా సేవా కార్యక్రమాలు కొనసాగి స్తూ బాలాజీ గుప్త అందరివాడుగా నిలిచినట్లు కంటతడి పెట్టారు. నాచగిరి ఆర్యవైశ్య సత్రం అభివృద్ధికి ఆయన వెలకట్టలేని సేవలందించార న్నారు. వృద్ధాశ్రమ ము, శ్రీ కన్యకా పరమేశ్వరి క్షేత్రం, కర్మకాండ భవనాలు నిర్మించి వైశ్యులతో పాటు వైశ్యేతరులకు సైతం అందుబాటు లోకి తెచ్చినట్లు తెలిపారు. వృద్ధాశ్ర మంలో అవకాశం కల్పించి ఉచిత సేవలు అందించిన ఘనత ఆయన దక్కిం చుకున్నట్లు గుర్తు చేశారు. అప్పటి ముఖ్యమంత్రి దివంగత రోశయ్య సహకారంతో వృద్ధాశ్రమం , శ్రీ కన్యకా పరమేశ్వరి క్షేత్రం నిర్మించి అందుబాటులోకి తెచ్చినట్లు స్పష్టం చేశారు. బాలాజీ గుప్త సేవ లను గుర్తించిన వివిధ సంస్థ లు డాక్టరేట్, వైశ్య రత్న బిరు దులు ప్రకటించి సత్కరించిన ట్లు వివరించారు ఆర్యవైశ్య సత్రం ఉపాధ్యక్షులు కొమురవెల్లి శంకరయ్య గుప్త, పూర్వ ఏడీఈ కృష్ణారెడ్డి , నియోజక వర్గ ఆర్యవైశ్య సంఘం అధ్యక్షులు బచ్చు పాండు రంగం గుప్త, నాచగిరి డైరెక్టర్ నంగునూరి సత్యనా రాయణ గుప్త , వైశ్య సంఘం నేతలు నారాయణ గుప్త, పల్లెర్ల రవీందర్ గుప్త, శ్రీరామ్ రంగయ్య గుప్త, హరినాథ్ గుప్త, జూలూరి రంగయ్య గుప్త , పొద్దుటూరి పాండురంగం గుప్త , సిద్ది బిక్షపతి గుప్త, చిట్టిమిళ్ల శ్రీనివాస్ గుప్త, తోట బిక్షపతి గుప్త, అయిత సత్యం గుప్త, దొంతుల సత్యనారాయణ గుప్త , వెంకటయ్య గుప్త , కైలాస ప్రభాకర్ గుప్త , జిల్లా కళ్యాణ్ గుప్త , రామిని రాజు గుప్త , నాయిని యాదగిరి , తోట ముత్యాలు , సుల్తాన్ , యాదగిరి గౌడ్ తదితరులు పాల్గొన్నారు .

అన్ని ప్రభుత్వ పాఠశాలలో రాగి జావ పంపిణీ



నవతెలంగాణ-గజ్వేల్

తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన రాగి జావ కార్యక్రమాన్ని గురువారం నుండి అన్ని పాఠశాలలో ప్రారంభిస్తామని గజ్వేల్ మండల విద్యాధికారి సునీత తెలిపారు. బుధవారం గజ్వేల్ మండలంలో ని వివిధ పాఠశాల ప్రధానోపాధ్యాయులకు సమాచారం అందించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మండలంలోని ప్రధానోపాధ్యాయులకు సమాచారం ఇస్తున్నమన్నారు. అన్ని ప్రభుత్వ,స్థానిక సంస్థల ప్రాథమిక, ప్రాథమికోన్నత,ఉన్నత, పాఠశాలల్లో చదివే అన్ని మీడియంల విద్యార్థులకు జిల్లా నుండి మన మండలానికి రాగి పిండి బెల్లం పొడి పంపిణీ చేశామన్నారు. ఒక్కొక్క విద్యార్థికి ఒక్కోరోజుకు 10 గ్రాముల రాగి పిండి 8.3 గ్రాముల బెల్లం పొడి జులై నెలలో 11 రోజులకు సరిపడ రావడం అన్ని పాఠశాలలకు చేరిందన్నారు. ప్రధానోపాధ్యాయులు అందరూ సి ఆర్ పి సమక్షంలో పాఠశాలలో ప్రస్తుతం ఉన్న ప్రస్తుతం ఉన్న విద్యార్థుల సంఖ్య ప్రకారం మెటీరియల్ ను తప్పనిసరి తీసుకోవాలన్నారు. జావాను గుడ్డు అందించని రోజులలో మంగళవారం, గురువారం, శనివారం అందించాలన్నారు.

సందీప్‌కుమార్‌ను పరామర్శించిన ఎమ్మెల్యే



నవతెలంగాణ-ప్రజ్ఞాపూర్

ఇటీవల గజ్వేల్‌లో రెండు వర్గాల మధ్య జరిగిన ఘర్షణ తెలిసిందే. బుధవారం దుబ్బాక ఎమ్మెల్యే మాధవనేని రఘునందన్‌రావు బాధిత వ్యక్తి ఇంటికి వెళ్లి పరామర్శించారు. ప్రతి ఒక్కరు ఛత్రపతి శివాజీ పట్ల భక్తిశ్రద్ధలతో ఉండాలని ఇలాంటి హేయమైన చర్యలు సరికాదన్నారు. గర్షణలో గాయాల పాలైన కాశమైన సందీప్ కుమార్ కి భరోసా కల్పించారు. బిజెపి పార్టీ తరపున అన్ని విధాల అండదండలు ఉంటాయని ధైర్యం చెప్పారు. అనంతరం విలేకరులతో మాట్లాడుతూ కూటముల పేరుతో ఎన్ని కుట్రలు చేసినా కేంద్ర ప్రభుత్వానికి ఒరిగేదేం లేదన్నారు. ఎన్ని కుట్రలు చేసిన నరేంద్ర మోడీ బిజెపి పార్టీకి వచ్చే ఎన్నికల్లో 400 సీట్లు గెలుచుకోవడం ఖాయమని వ్యక్తం చేశారు. అన్ని పార్టీలు ఇండియా కూటమిగా పేరు మార్చుకోవడం వల్ల ప్రజల కు వారిపై మరింత నమ్మకం పోయిందన్నారు. ఈ కార్యక్రమంలో బిజెపి నాయకులు కప్పెర ప్రసాద్ రావు, కుడిక్యాల రాములు, తదితరులు ఉన్నారు.

మంత నాయక్‌కు సన్మానం



నవతెలంగాణ-దౌల్తాబాద్

ప్రభుత్వ జూనియర్ కళాశాల దౌల్తాబాద్ చరిత్ర విభాగంలో అధ్యాపకుడిగా విధులు నిర్వహిస్తున్న మాంత నాయక్ ఇటీవల ఉస్మానియా విశ్వవిద్యాలయం నుండి చరిత్ర విభాగంలో కుతుబ్షాహీ కాలంలో హిందువుల ప్రాధాన్యత అనే అంశంపై పీహెచ్డీ అవార్డు పొందారు. ఈ సందర్భంగా కళాశాలలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ప్రిన్సిపాల్ మంతా నాయక్‌ను శాలువాతో ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో కళాశాల అధ్యాపక అధ్యాపకేతర బృందం విద్యార్థులు పాల్గొన్నారు.

గురుకుల కార్యదర్శిని కలిసిన కమిటీ సభ్యులు



నవతెలంగాణ-నంగునూరు

గురుకులాల కార్యదర్శిగా నూతనంగా నియమితులైన డాక్టర్ నవీన్ నికోలస్‌ను బుధవారం దామోదర సంజీవయ్య సంక్షేమ భవన్‌లో మర్యాదపూర్వకంగా కలిశారు. రాష్ట్ర అధ్యక్షులు రేగుంట లింగయ్య, ఉపాధ్యక్షులు బాకురి నర్సింగరావు, సిద్దిపేట జిల్లా అధ్యక్షులు చిట్యాల నరసింహులు, ప్రధాన కార్యదర్శి శ్రీ రాముల వెంకటేశ్వర్లు, కోశాధికారి జాలిగామ నర్సింగరావు, మిట్టపల్లి పాఠశాల ప్రధాన కార్యదర్శి సుంచు మహేష్, జిల్లా కార్యవర్గ సభ్యులు తదితరులు పాల్గొన్నారు. గురుకులాల సమస్యలపై కమిటీ సభ్యులు సూచనలు చేయగా సెక్రెటరీ సానుకూలంగా స్పందించారు.

బాధిత కుటుంబాన్ని పరామర్శించిన ఫ్యాక్స్ ఛైర్మెన్ దేవేందర్‌రావు



నవతెలంగాణ-కోహెడ

మండలంలోని రాంచంద్రాపూర్ గ్రామానికి చెందిన సింగిల్‌విండో డైరెక్టర్ బొబ్బల కొండల్‌రెడ్డి తల్లి బొబ్బల వెంకటవ్వ ఇటీవల మృతి చెందగా ఆమె కుటుంబ సభ్యులను బుధవారం ఫ్యాక్స్ ఛైర్మన్ పెర్యాల దేవేందర్‌రావు పరామర్శించారు. ఈ సందర్భంగా మృతికి గల కారణాలను అడిగి తెలుసుకొని, వారి కుటుంబ సభ్యులకు తమ ప్రగాఢ సానుభూతిని వ్యక్తం చేశారు. ఆయనవెంట మాజీ జెడ్పీటీసీ పొన్నాల లక్ష్మణ్, మాజీ సర్పంచ్ దొమ్మట జగన్‌రెడ్డి, డైరెక్టర్‌లు బద్దం కొండల్‌రెడ్డి, సురేందర్‌రెడ్డి, తిరుపతి, గుంటి లక్ష్మణ్, సోసైటీ సీఈవో ముంజ మల్లిఖార్జున్, సోముల వికాస్ రెడ్డి, బద్దం తిరుపతిరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

రేవంత్‌రెడ్డికి వాగుడు తప్ప సాగు తెలవదు

- తెలంగాణ ఫారెస్ట్ చైర్మన్ వంటేరు ప్రతాప్ రెడ్డి



నవతెలంగాణ- గజ్వేల్

పీసీసీ అధ్యక్షుడు రేవంత్ రెడ్డికి మీడియా ముందు వాగుడు తప్ప రైతులు సాగు చేసే పంటల గురించి తెలియదని ఎఫ్డిసి చైర్మన్ వంటేరు ప్రతాప్ రెడ్డి విమర్శించారు. బుధవారం గజ్వేల్‌లో ఆయన మాట్లాడుతూ పిసిసి అధ్యక్షులు రేవంత్‌రెడ్డికి రైతులకు కావాల్సిన సౌకర్యాల గురించి తెలవదని విమర్శించారు. తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి కేసీఆర్ రైతు సంక్షేమానికి కృషి చేస్తున్నారన్నారు. కాళేశ్వరం, కొండపోచమ్మ, మల్లన్న సాగర్ ప్రాజెక్టులు నిర్మించిన కోటి ఎకరాలకు సాగునీరు అందిస్తున్న తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వాన్ని వివిధ దేశాలు, రాష్ట్రాల ప్రజా ప్రతినిధులు అభినందిస్తున్నారని తెలిపారు. రోజుకు 24 గంటల కరెంటు ఇస్తున్నామని ఒకసారి ఇండ్లలో కొచ్చి కాంగ్రెస్ నాయకులు తెలుసుకోవాలని అన్నారు. గ్రామాల్లో రైతులు కాంగ్రెస్ నాయకులను అడ్డుకోవాలని పిలుపునిచ్చారు. తెలంగాణ ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధి సంక్షేమ పథకాలతో కాంగ్రెస్ నాయకులకు పదవుల మీద ఆశలు పడి మతిస్థితం లేకుండా మాట్లాడుతున్నారని విమర్శించారు. చెరువు కుంటలు నిండుగా కనిపిస్తున్నాయని తెలిపారు. ఇది కాంగ్రెస్ నాయకులకు కనిపించకపోవడం విడ్డూరంగా ఉందన్నారు. ముఖ్యమంత్రి కెసిఆర్ ను విమర్శించే స్థాయి రేవంత్ రెడ్డికి లేదన్నారు.

పాత పెన్షన్ పునరుద్ధరించాలి



నవతెలంగాణ -గజ్వేల్: నూతన పెన్షన్ విధానాన్ని రద్దు చేస్తూ,పాత పెన్షన్ విధానాన్ని పునరుద్దరించాలని డిమాండ్ చేస్తూ జాయింట్ ఫోరమ్ ఫర్ రిస్టోరేషన్ ఆఫ్ ఓల్డ్ పెన్షన్ స్కీమ్ బాధ్యులు టిఫిటిఎఫ్ గజ్వేల్ జోన్ కార్యాలయంలో గోడ పత్రిక ను ఆవిష్కరించారు. బాధ్యులు సత్యనారాయణ, చంద్రారెడ్డి, రాజులు,వలి అహ్మద్, సుంచు నరేందర్, విద్యా సాగర్ మాట్లాడుతూ నూతన పెన్షన్ విధానాన్ని రద్దు చేస్తూ, పాత పెన్షన్ విధానాన్ని పునరుద్దరించాలని డిమాండ్ చేస్తూ ఈ నెల 23న సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో రాష్ట్రస్థాయి సదస్సు నిర్వహించనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో టిఎ టిఎఫ్ మండల భాద్యులు పాపిరెడ్డి, శంకర్, పర్వతం నర్సయ్య, శేషాచారీ, సత్తయ్య, నాగరాజు, రాములు, శ్రీనివాస్, కర్ణాకర్, దమ్మని మల్లేశం, యూటిఎఫ్ మండల భాద్యులు రవీందర్, రాంచంద్రం, నర్సింహ, సక్రియ, ఉపాధ్యాయులు మీనయ్య, మల్లేశం, భాస్కర్, సత్తయ్య వెంకటేశం పాల్గొన్నారు.

గజ్వేల్ ఆర్డీఓగా బన్సీలాల్



నవతెలంగాణ-గజ్వేల్

గజ్వేల్ ఆర్డీవో గా బన్సీలాల్ బుధవారం బాధ్యతలు తీసుకున్నారు. నల్లగొండ జిల్లా పరిధిలో ఓ తాసిల్దార్ కార్యాలయంలో తాసిల్దార్ గా పనిచేసి పదోన్నతి పై గజ్వేల్ ఆర్డీవో గా బాధ్యతలు తీసుకున్నారు. అనంతరం రెవెన్యూ కార్యాలయం అధికారులు సిబ్బంది ఆయనను సన్మానించారు. అధికారులంతా చిత్తశుద్ధితో పనిచేయాలని ఆయన చెప్పారు.

ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షం

- లోతట్టు ప్రాంతాలు జలమయం
- పొరుతున్న పెద్దవాగు









నవతెలంగాణ-నంగునూరు

బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడన ద్రోణి ప్రభావంతో రెండు రోజుల నుండి నంగునూరు మండలంలో ఎడతెరిపి లేకుండా వర్షం కురుస్తుంది. గ్రామాల్లో వర్షంతో మట్టి రోడ్లు చిత్తడిగా మారాయి. గ్రామ పంచాయతీ కార్మికులు సమ్మె చేస్తున్న కారణంగా మురికి కాల్వలు నిండి రోడ్ల పై పొరుతున్నాయి. రెండు రోజుల నుండి కురుస్తున్న వర్షాల వల్ల శిథిలావస్థకు చేరిన ఇండ్లలో ఉండకూడదని రెవెన్యూ అధికారులు వెల్లడించారు. వర్షాల కోసం ఎదురు చూస్తున్న రైతులకు ఊరట లభించింది. ఆరుతడి పంటలు వేసుకున్న రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. ఇన్ని రోజులు వర్షాల కోసం ఎదురు చూస్తున్న రైతులు పొలం పనులు చేసేందుకు సన్నాహాలు చేస్తున్నారు. నంగునూరు మండలం దర్గపల్లి శివారులో చెక్ డ్యాం పై కల్వర్టు పనులు కొనసాగుతున్నాయి. దర్గపల్లి నుంచి చిన్న కోడూరు మండలానికి వెళ్ళేందుకు తాత్కాలికంగా పైపులు వేసి రోడ్డు వేశారు. వర్షాలకు ఆ రోడ్డు తెగిపోయింది. దీంతో ఆ మార్గం గుండా వెళ్ళేందుకు వీలు లేకుండా పోయింది. ఎగువ ప్రాంతాల్లో కురిసిన వర్షాలకు పెద్ద వాగు నిండి పారుతుంది. నంగునూరు మండలం లోని ఖాతా, ధూల్మిట్ట మండలం జాలపల్లి, నంగునూరు మండలం ఘనపూర్, నంగునూరు, అక్కెనపల్లి గ్రామాల్లో తొమ్మిది చెక్ డ్యాంలు నిర్మించారు. ఎగువ ప్రాంతాల్లో కురిసిన వర్షాలకు ఏడు చెక్ డ్యాంలు నిండాయి. ఇంకో రోజు వర్షం పడితే మరో రెండు చెక్ డ్యాం నిండి పారుతాయి. దీంతో పెద్ద వాగు జలకళ సంతరించుకుంటుంది. దాదాపు ఐదు కిలో మీటర్ల ప్రాంతాల్లో ఆయకట్టు దారులకు ఖరీఫ్ సాగు చేయడానికి అనుకూలంగా వుండే అవకాశాలు ఉంటాయి. పెద్ద వాగు పై పారుతున్న నీటిని వృధా పోకుండా నంగునూరు పెద్దోళ్ళ బంగ్లా వద్ద లిఫ్ట్ ఇరిగేషన్ ద్వారా మైసమ్మ చెరువు లోకి నీటిని సరఫరా చేసేందుకు ఏర్పాట్లు పూర్తి చేశారు. నీరంతా వృధాగా పోతున్నప్పటికీ మోటార్లు నడపడం లేదు. అదేవిధంగా నంగునూరు మండలం లోని వాగవతలి ఐదు గ్రామాలకు కూడా చెరువులు నింపేందుకు ప్రణాళికలు చేశారు. పెద్ద వాగు నుంచి ఘనపూర్ శివారు వరకు పైపులు వేశారు. ఇది పూర్తి స్థాయిలో అయితే వాగవతలి ఐదు గ్రామాల్లోని చెరువుల్లో నీరు చేరి వ్యవసాయానికి అనుకూలంగా ఉంటుంది. రంగనాయక్ సాగర్ కుడి కాల్వ పనులు పూర్తి అయితే వాగులో నింపి మోటార్ల ద్వారా ఎత్తి పోస్తారు. చుట్టూ పుష్కలంగా నీరున్నప్పటికీ వాగు అవతలి గ్రామాలకు మాత్రం నీరు అందడం లేదు.

నవతెలంగాణ-దుబ్బాక

గత రెండు రోజులుగా ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాలకు దుబ్బాక పురపాలిక కేంద్రంలోని 15వ వార్డులో నివాసం ఉంటున్న కడవేర్గు కళావతికి చెందిన 4-131 నెంబర్ గల పెంకుటిల్లు బుధవారం ధ్వంసమైంది. చేనేత కార్మికురాలైన కళావతి తన కుమారుడు, మనమరాలతో కలిసి ఇదే ఇంట్లో జీవనం కొనసాగిస్తోంది. తనకున్న ఇల్లు కూలడంతో ఎటు పోవాలో దిక్కుతోచకుండా ఉందని, ప్రభుత్వం వెంటనే తనను ఆదుకోవాలని విజ్ఞప్తి చేస్తున్నారు.

నవతెలంగాణ-మిరుదొడ్డి

సిద్దిపేట జిల్లాలో గత రెండు రోజులు మూడు రోజుల నుండి వర్షం వస్తుంది. చెరువులు కుంటలు వాగులు వంకలు నిండి పొంగిపొర్లుతున్నాయి. గ్రామాల్లో శిథిలావస్థలో ఉన్న ఇల్లు కూలిపోయే ప్రమాదాలకు పొంచి ఉన్నాయి. రెవెన్యూ అధికారులు స్పందించి లో ఉన్న ఇళ్లను పరిశీలించి వారికి అండగా నిలవాలని కోరుతున్నారు. ఇల్లు లేని పేదలు ఉంటే డబుల్ బెడ్ రూమ్ ఇళ్లలో స్థానం కల్పించాలని ప్రజలు కోరుతున్నారు.

నవతెలంగాణ-తొగుట

గత రెండు రోజులు ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షానికి జనజీవనం అస్తవ్యస్తంగా మారింది. మండల వ్యాప్తంగా అన్ని గ్రామాల్లోని ఎక్కువ మంది కుటుంబాలు వ్యవసాయాన్ని ఆధారంగా చేసుకుని జీవిస్తున్నారు. ఈ సంవత్సరం రోహిణి కార్తెలో సరియైన సమయంలో వర్షాలు పడకపోవడంతో రైతులు విత్తనాలు వేయలేదు. వర్షాకాలం సమయం నెల రోజులు పూర్తి అయిన తరువాత వర్షాలు పడ్డా యి.రైతులు విత్తనాలు నాటారు.నాటిన విత్తనాలు మొలకెత్తిన పంట చెలలో కలుపు తీస్తున్న సమ యంలో అల్పపీడనం ఏర్పడి ఎడతెరిపి లేకుండా వర్షాలు కురుస్తున్నాయి.రెండు రోజుల వ్యవసాయ పనులు సాగక పోవడంతో పంట చేలాలల్లో కలు పు పెరిగి పోయి పంట చెను ఏపుగా పెరగకుండా నష్టం వాటిల్లుతుందని రైతులు ఆవేదన చెందుతు న్నారు. వర్షాలు ఒక రోజు బాగా పడిన ఇబ్బంది ఉండదు కానీ ఎడతెరిపి లేకుండా రోజు వర్షం కురి స్తే రైతులు నష్టాల ఊబిలో కూరుకుపోయి అవ కాశం ఉందని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

గజ్వేల్ రోడ్లన్నీ బురదమయం

- ఒక్క ఇల్లు ఉంటే సీసీ రోడ్డు
- వంద ఇండ్లున్న చోట కనిపించని సీసీరోడ్లు





నవతెలంగాణ- గజ్వేల్

గజ్వేల్ ప్రజ్ఞాపూర్ మున్సిపాలిటీలో సీసీరోడ్లు లేక బురదమయంగా మారింది. వర్షాలు కురుస్తుండడంతో రోడ్ల మీద బురద పేరుకుపోయింది. గజ్వేల్ ప్రజ్ఞాపూర్ మున్సిపల్ పరిధిలోని లక్ష్మీ ప్రసన్న నగర్, ధనలక్ష్మీ కాలనీ, గణేష్ నగర్, ఒక లక్ష్మీ ప్రసన్న నగర్‌లోనే మరో మూడున్నర కోట్ల రూపాయలు అవసరమందని అధికారులు అంచనా వేశారు. పట్టణంలో చాలా మట్టి రోడ్లు మిగిలి ఉన్నాయి. వర్షాకాలం వచ్చిందంటే నడిచే పరిస్థితి ఉండదు. చెరువు కుంటలుగా రోడ్లు మారుతున్నాయి. ఒకటి రెండు ఇండ్లున్న చోట సీసీ రోడ్లు వేస్తున్నారు. ప్రస్తుతం గజ్వేల్ ప్రజ్ఞాపూర్ మున్సిపల్ పరిధిలో సిసి రోడ్లకు రూ 23 కోట్ల రూపాయలు మంజూరయ్యాయి. గజ్వేల్ ప్రజ్ఞాపూర్ మున్సిపల్ పరిధిలో మొత్తం 20 వార్డులో స్థానిక కౌన్సిల్ సభ్యులు వార్డుల వారీగా నిధులను ప్రతిపాదించుకొని సీసీ రోడ్లు వేస్తున్నారు. తమకు నిధులు కేటాయించిన నిధులు పూర్తి చేయాలని ఒక ఇల్లు ఉన్న 60 లక్షల రూపాయలు పెట్టి రోడ్డు వేస్తున్నారు. వంద ఇండ్లు ఉన్న చోట సీసీ రోడ్డు కల్పించడం లేదు. అధికారుల సూచన మేరకే కేటాయిస్తున్నామని పాలకవర్గం అంటుంది. విచిత్రం ఏమిటంటే చాలా వార్డులో ఒకటి రెండు ఇండ్లున్న చోట కోట్లాది రూపాయలు పెట్టి సిసి రోడ్లు ఏర్పాటు వేయిస్తున్నారు. బస్తీలకొద్దీ మట్టిరోళ్ళు ఉన్న వర్షాకాలంలో ఇబ్బంది పడుతున్న వార్డులను అధికారులు గుర్తించడంలో పూర్తిగా నిర్లక్ష్యం చేశారని స్థానిక ప్రజలు మండిపడుతున్నారు. మున్సిపాలిటీలో అన్ని వార్డులు దుస్థితి ఇదే పరిస్థితి ఉంది. రోడ్లు గుర్తించి కాంట్రాక్టర్కు అప్పగించారు. అండర్ డ్రైనేజ్ మూలంగా గతంలో వేసిన సిసి రోడ్లు కొంత దెబ్బతిన్నప్పటికీ వాటిని చాలా చోట్ల లక్షల రూపాయలు పెట్టి డబుల్ రోడ్డు వేశారు.. 2013 తరువాత సీసీ రోడ్లకు మోక్షం లభించింది. అధికారులు నిధులను ఎలా ఖర్చు పెట్టాలో ఎక్కడ రోడ్డు వేయాలో పెద్దగా ఆలోచన చేసినట్లు లేదు. రోడ్ల సమస్యలు గుర్తించి నిధులు మంజూరు చేశారు.15, 20 సంవత్సరాల క్రితం ఏర్పడ్డ కాలనీలకు నిధులు కేటాయించలేదు.. ఈ విషయంలో మున్సిపల్ పాలకవర్గం పెద్దగా పట్టించుకోవడంలేదని విమర్శలు వస్తున్నాయి. రోడ్ల విషయంలో తగిన చర్యలు తీసుకొని సిసి రోడ్లు వేయించాలని సిపిఎం, కాంగ్రెస్ బిజెపి నాయకులు పలుసార్లు డిమాండ్ చేశారు. మున్సిపల్ కమిషనర్ , చైర్మన్ కు వినతి పత్రాలు అందించారు. ఒక అడుగు ముందుకు వేసి సిపిఎం నాయకులు నిరసన కార్యక్రమాలు కూడా చేపట్టారు.

మరో రూ.150 కోట్లు కావాలి

గజ్వేల్ ప్రజ్ఞాపూర్ మున్సిపల్ పరిధిలో కొత్త కాలనీలు, పాత బస్తీలు పూర్తిస్థాయిలో సిసి రోడ్లు మురికి కాలువలు పూర్తి కావాలంటే రూ 150 కోట్ల రూపాయల అవసరముంటుందని అధికారుల అంచనా. మొదటగా రూ 23 కోట్లు మంజూరైన మున్సిపాలిటీలో ఏ మూలకు సరిపోలేదు. మరో 150 కోట్లు కేటాయిస్తే పూర్తిస్థాయిలో పనులు పూర్తయ్యే అవకాశం ఉంటుంది. ముఖ్యమంత్రి కెసిఆర్, మంత్రి హరీష్ రావు ప్రత్యేక దృష్టి పెట్టి నిధులు మంజూరు చేయాలని స్థానిక ప్రజలు కోరుతున్నారు.

అవసరమైన చోట రోడ్లు వేయండి



గజ్వేల్ ప్రజ్ఞాపూర్ మున్సిపల్ పరిధిలో ప్రజలు ఉన్నచోట రోడ్లు వేయాలి. ఒకటి, రెండు ఇండ్లు ఉన్నా చోట లక్షలు పెట్టి రోడ్లు వేస్తున్నారు. ప్రజా ప్రయోజనాలు పాలకవర్గం గుర్తించడం లేదు. మున్సిపల్ పాలకవర్గం ప్రత్యేక దృష్టి పెట్టాలి.

– బండ్ల స్వామి. సిపిఎం నాయకులు

మరిన్ని నిధుల కోసం మంత్రిని అడిగాం



గజ్వేల్ ప్రజ్ఞాపూర్ మున్సిపల్ పరిధిలోని సిసి రోడ్లకు మరిన్ని నిధులు కావాలని మంత్రి హరీష్ రావును కలిసి వినతిపత్రం ఇచ్చామన్నారు. నిధులు త్వరలోనే మంజూరు అవుతాయి. గజ్వేల్ ప్రజ్ఞాపూర్ మున్సిపల్ పరిధిలో ముఖ్యమంత్రి కేసీఆర్, మంత్రి హరీష్ రావు కృషితో అన్ని వార్డులో సిసి రోడ్లు వేస్తాం. పక్షపాతం లేకుండా పనులు చేస్తున్నాం. ప్రజలు సహకరించాలి.

– రాజమౌళి, మున్సిపల్ చైర్మన్

అతిథి అధ్యాపకుల భర్తీకి దరఖాస్తుల ఆహ్వానం

నవ తెలంగాణ - సిద్దిపేట

పట్టణంలోని ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో అతిథి అధ్యాపకుల భర్తీ కోసం కోసం కింది సబ్జెక్టుల లో అర్హులైన అభ్యర్థుల నుండి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపాల్ జీవన్ కుమార్ తెలిపారు. ఇంగ్లీష్(1), మ్యాథమెటిక్స్(1), హిస్టరీ(1), ఎకనామిక్స్ (1), కామర్స్ (1) కంప్యూటర్స్ (1), ఆసక్తి గల అభ్యర్థులు 22, సాయంత్రం 5 గంటల లోపు కళాశాలలో దరఖాస్తులను సమర్పించాలని తెలిపారు. పీజీ లో కనీసం 55శాతం మార్కులు, ఎస్సీ ఎస్టీ వారికి కనీసం 50 శాతం మార్కులు, సంబంధిత సబ్జెక్టులలో పి హెచ్ డి కి ప్రాధాన్యత ఇవ్వబడుతుందనీ తెలిపారు. నెట్, స్లేట్ గల అభ్యర్థులు తీసుకోబడతారనీ, బోధనానుభవం ఉన్న అభ్యర్థులకు వెయిటేజీ ఇవ్వబడుతుందనీ(సర్వీస్ సర్టిఫికెట్ సమర్పించాలి), అభ్యర్థులను డెమో, మౌకిక పరీక్ష ద్వారా ఎంపిక చేయబడునని తెలిపారు.

ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో..

ప్రభుత్వ డిగ్రీ కళాశాల(స్వయం ప్రతిపత్తి)లో అతిథి అధ్యాపకుల పోస్టుల భర్తీకి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపల్ ప్రసాద్ తెలిపారు. ఆంగ్లం 5, తెలుగు 7, ఉర్దూ1, కామర్స్ 6,బి బి ఏ 2, చరిత్ర 1,గణితం 1,కంప్యూటర్ సైన్స్ అండ్ అప్లికేషన్ 8,ఫిషరీస్ 1,స్టాటిస్టిక్స్ 1 ఖాళీలు కలవనీ, మిగతా సమాచారం కోసం కళాశాలను సంప్రదించాలని కోరారు. అభ్యర్థులు సంబంధిత పీజీ కోర్సులలో 55 శాతం మార్కులతో పాసై ఉండాలనీ, (ఎస్సీ, ఎస్టీ లకు 50 శాతం సరిపోతుంది) పిహెచ్ డి, నెట్, స్లేట్ ఉన్నవారికి మొదటి ప్రాధాన్యత ఇవ్వబడుననీ, 23 వరకు దరఖాస్తులు స్వీకరించబడుననీ, 24న సోమవారం కళాశాలలో ఇంటర్వ్యూ నిర్వహించబడుననీ తెలిపారు.

జనగామ ఎమ్మెల్యే టికెట్ స్థానికులకే ఇవ్వాలి

- ముత్తిరెడ్డిని ప్రజలు తరిమికొట్టే రోజులు దగ్గర పడ్డాయి
- ఆప్కో మాజీ చైర్మెన్ మండల శ్రీరాములు



నవతెలంగాణ-చేర్యాల

జనగామ నియోజకవర్గ ఎమ్మెల్యే టికెట్ స్థానికులకే ఇవ్వాలని బీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు,మాజీ ఆప్కో చైర్మన్ మండల శ్రీరాములు కోరారు. చేర్యాల పట్టణంలోని ఓ గార్డెన్‌లో బుధవారం నియోజకవర్గ స్థాయి కార్యకర్తలు, అభిమానులతో కలిసి సమావేశం ఏర్పాటు చేశారు. భారీ వర్షం పడుతున్నా లెక్కచేయకుండా మండల శ్రీరాములు అభిమానులు భారీ సమూహంతో డప్పు చప్పులతో, కోలాటాలతో సమావేశానికి తరలివచ్చారు. చేర్యాల పాత నియోజకవర్గానికి చెందిన బీసీ నేతలు భారీ సంఖ్యలో తరలివచ్చి మండల శ్రీరాములుకే టికెట్ ఇవ్వాలని సమావేశంలో డిమాండ్ చేశారు. అనంతరం శ్రీరాములు మాట్లాడుతూ కేసీఆర్ మూడవసారి ముఖ్యమంత్రి కావాలంటే ముత్తిరెడ్డి యాదగిరిరెడ్డి లాంటి ప్రాంతీయేతరుడికి టికెట్ కేటాయించవద్దని, స్థానికులకు మాత్రమే టికెట్ ఇవ్వాలన్నారు. ఎమ్మెల్యే ముత్తిరెడ్డి యాదగిరి రెడ్డికి చేర్యాల ప్రాంతంపై అవగాహన లేదని, అవగాహన రాహిత్యంతోనే చేర్యాల, జనగామ ప్రాంతాలలో భూములు కబ్జా చేస్తున్నాడని ఆరోపించారు. త్వరలోనే నియోజకవర్గ ప్రజలు ముత్తిరెడ్డి ని తరిమికొడతారని అన్నారు. గతంలో చేర్యాల నియోజకవర్గంలో ఎంతోమంది ఎమ్మెల్యేలుగా పని చేశారని, ఎవరు కూడా భూకబ్జాలకు పాల్పడలేదని, స్థానికేతుడు కాబట్టే ప్రజలను దోచుకుంటున్నాడని అన్నారు.మళ్లీ కేసీఆర్ సీఎం కావాలంటే ప్రజలు తరిమికొట్టక ముందే ముత్తిరెడ్డి నియోజకవర్గాన్ని విడాలన్నారు. దౌర్భాగ్యంగా ప్రజల భూములు లాక్కునే వ్యక్తి ఎమ్మెల్యే కావడం జనగామ ప్రజల దురదృష్టమని, జనగామ ప్రాంత ప్రజలు ఆయన అరాచకాలను గమనిస్తున్నారని అన్నారు.

బీసీ నేతను.. ఈ ప్రాంత బిడ్డను

బడుగు బలహీన వర్గాలకు చెందిన బిడ్డను, చేర్యాల ప్రాంత అభివృద్ధి కోసం నిరంతరం తపించే వ్యక్తిగా పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు కేసీఆర్ జనగామ నియోజకవర్గ టికెట్ స్థానికుడినైన తనకే కేటాయించాలని, యాదగిరిరెడ్డికి టికెట్ కేటాయిస్తే ప్రతిపక్షాలకు ఆకాశం ఇచ్చిన వారిమవుతామని తెలిపారు. సర్వేలు నిర్వహించి సర్వేలో ఎవరికీ అయితే నియోజకవర్గ ప్రజలు పట్టం కడతారో వారికే టికెట్ కేటాయించాలని కోరారు. కార్యక్రమంలో జనగామ నియోజకవర్గ నాయకులు నాయకులు వజ్జ పర్శరాములు, బొట్ల జీవరత్నం,ఎదునూరి మల్లేశం, మార్కండేయ, గాజుల నరేష్, చొప్పరి శ్రీను, మైలారం పెంటయ్య చారి,శవల్ల రాజయ్య పాల్గొన్నారు.

నాణ్యత ప్రమాణాలు పాటించని కాంట్రాక్టర్‌పై చర్యలు తీసుకోవాలి

- డీవైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి సనాది భాస్కర్



నవతెలంగాణ-చేర్యాల

దుద్దెడ క్రాస్ నుంచి చేర్యాల మీదుగా బీటీ రోడ్డు వేసి వారం రోజులు కాకున్నా చిన్న వర్షాలకే గుంతలు పడ్డాయని డివైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి సనాధి భాస్కర్ తెలిపారు.ఈ సందర్భంగా బుధవారం ఆయన రోడ్డును సందర్శించి పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ నాణ్యతా ప్రమాణాలు పాటించకుండా పనులు చేయిస్తున్న కాంట్రాక్టర్ పై చర్యలు తీసుకోవాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కాంట్రాక్ట్ తీసుకున్నప్పటి నుండి నాణ్యత ప్రమాణాలు పాటించకుండా పనులు చేపడుతున్నారని, తొవ్విన మట్టినే తిరిగి రోడ్డుకు పోసి తారు వేస్తున్నారని విమర్శించారు. నిబంధనలు పాటించకుండా నిబంధనలను తుంగలో తొక్కి ఇటీవల తాడూరు క్రాసింగ్ వద్ద పైప్ లైన్ కొట్టుకుపోతే దానితో పాటు రోడ్డు కూడా కొట్టుకుపోయిందని అన్నారు. మళ్లీ పోసిన రోడ్డు కూడా గుంతలు గుంతలు గా ఉందన్నారు.చేర్యాల శివారు పెట్రోల్ పంపు వద్ద పూర్తిగా గుంతలు పడ్డాయని ఇప్పటికైనా నేషనల్ హైవే అధికారులు పరిశీలించి కాంట్రాక్టర్ పై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. రోడ్డును పరిశీలించిన వారిలో దాసరి రమేష్ దాసరి విష్ణు ఉన్నారు.

బురదలో గజ్వేల్ బస్టాండ్



నవతెలంగాణ- గజ్వేల్

గజ్వేల్ బస్టాండ్ బురదమయం కావడంతో ప్రయాణికులు తీవ్ర ఇక్కట్లకు గురవుతున్నారు. మూడు రోజులుగా కురుస్తున్న వర్షాలకు బస్టాండ్ ప్రాంగణం చిత్తడిగా మారింది. సీఎం కెసిఆర్ ప్రాతినిధ్యం వహిస్తున్న గజ్వేల్ లో బస్టాండ్ నిర్మాణంలో అలసత్వం వహిస్తున్న అధికారుల తీరుతో ప్రజలు తీవ్ర అసహనంతో ఉన్నారు. బస్టాండ్ నిర్మాణం కోసం రూ 4 కోట్లు కేటాయించారు. రెండు నెలల క్రితం మంత్రి చేతుల మీదుగా శంకుస్థాపన చేశారు. ప్రజ్ఞాపూర్ లో బస్టాండ్ పనులు ప్రారంభమైనప్పటికీ గజ్వేల్ లో మాత్రం ఇంకా పనులకు నోచుకోలేదు. గజ్వేల్ పేరు గొప్ప ఊరు దిబ్బ అన్న చందంగా తయారైంది. నిత్యం వేలాది గా ప్రయాణీకులు వచ్చి వెళుతున్న వారు తీవ్ర మనోవేదనకు గురవుతున్నారు. బస్టాండ్ నిర్మాణంలో వెనకడుగు వేయడంలో ఆంతర్యం ఏమిటో అంతు చిక్కడం లేదు,పాత బస్ స్టాండ్ ఉన్నప్పుడు ప్రయాణీకులు సంతోషంగా ఉండేవారు కానీ అక్కడ బస్టాండ్ కూల్చివేసి ఇంటిగ్రేటెడ్ మార్కెట్ నిర్మించారు. అనంతరం తూతూ మంత్రంగా రేకుల షెడ్డు ఏర్పాటు చేసి అరకొర వసతులతో బస్ స్టాండ్ కొనసాగిస్తున్నారు ఎండ్లు గడుస్తున్నా బస్టాండ్ నిర్మాణంలో అలసత్వం వహిస్తున్న అధికారులు వెంటనే బస్ స్టాండ్ నిర్మించాల ని పలువురు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు. తూప్రాన్ రోడ్‌లో నూతన బస్టాండ్ నిర్మాణంలో ఉన్న అదికూడా నిర్మాణ పనులను నత్తనడకన సాగుతున్నా యి. ఏదీ ఏమైనా గజ్వేల్ కు బస్ లో వచ్చి వెళ్లే వారి కష్టాలు వర్ణనాతీతం.

వర్షాలతో ప్రజలు అప్రమత్తగా ఉండాలి



నవతెలంగాణ-మర్కుక్

మూడు రోజులగా ఎడతెరిపి లేకుండా కురుస్తు వర్షాలతో ప్రజలందరూ అప్రమత్తంగా ఉండాలని మర్కుక్ ఎంపీపీ తాండ పాండు గౌడ్,జెడ్పీటీసీ యెంబరి మంగమ్మ రాంచంద్రం యాదవ్, వైస్ ఎంపీపీ మంద బాల్ రెడ్డి తెలిపారు. బుధవారం వారు మాట్లాడుతూ మూడు రోజులుగా వరుసగా కురుస్తున్న వర్షాలకు మండలంలోని అయా గ్రామాలలో పెంకుటిళ్లు, పూరి గుడిసెలు, శిథిలమైన ఇండ్లు ఉన్నవారు తాత్కాలికంగా మరో ఇంటిలోకి మార్చుకోవాలని సూచించారు. మండల పరిధిలోని అన్ని గ్రామాల ప్రజలకు విజ్ఞప్తి చేస్తున్నమన్నారు. విద్యుత్ సరఫరాలో ఉన్న స్తంభాల వద్ద నడిచేటప్పుడు జాగ్రత్తగా ఉండాలన్నారు. ఇనుప స్తంభాల వద్ద జాగ్రత్తగా ఉండాలన్నారు. చిన్నపిల్లలను బయటికి వెళ్లకుండా చూసుకోవాలన్నారు. పురాతనమైన ఇళ్లలో ఉంటే వర్షాకాలంలో మరింత దెబ్బ తినే అవకాశం ఉంటుందున్న జాగ్రత్తలు వహించాలన్నారు. శిథిలావస్థలో ఉన్న పురాతన కట్టడాలు ఇళ్లలోని ప్రజలు గ్రామ అధికారుల సహాయంతో సురక్షిత ప్రాంతానికి వెళ్లాలని కోరారు. వర్షానికి చిన్న చిన్న కుంటలు, చెరువులోకి భారీగా నీరు చేరుతుండటంతో పెద్దలు తమ పిల్లలను అటువైపు వెళ్ళనివ్వకుండా చూడాలని సూచించారు. పాత మిద్దెలు. గోడల పక్కన ఎవరూ నిల్చోకూడదని తెలిపారు. తడిసిన విద్యుత్ మీటర్లను ముట్టుకోవద్దని ,స్విచ్ బోర్డులను తకావద్ద ని పొడిగా ఉన్న చిన్న కర్రతో లేదా ప్లాస్టిక్ వస్తువుతో స్విచ్ లను వేయాలన్నారు.

మోకుదెబ్బ జిల్లా మహాసభలను విజయవంతం చేయాలి

- గౌడ జన హక్కుల పోరాట సమితి మోకుదెబ్బ జిల్లా అధ్యక్షులు అహ్మదీపూర్ రాజుగౌడ్



నవతెలంగాణ-రాయపోల్

గౌడ జన హక్కుల పోరాట సమితి మోకుదెబ్బ సిద్దిపేట జిల్లా 4వ మహాసభలు గురువారం రాయపోల్ మండల కేంద్రంలోని జిఎల్ఆర్ ఫంక్షన్ హాల్ లో నిర్వహించడం జరుగుతుందని గౌడ జన హక్కుల పోరాట సమితి మోకుదెబ్బ జిల్లా అధ్యక్షులు అహ్మది పూర్ రాజు గౌడ్ అన్నారు. ఈ సంధ్బంగా ఆయన మాట్లాడుతూ ఐక్యత, పోరాటం, కల్లుగీత వృత్తి రక్షణ అనే నినాదాలతో మోకు దెబ్బ కమిటీ పని చేయడం జరుగుతుందని, గౌడ జన హక్కుల కోసం కలిసికట్టుగా పోరాడుదామన్నారు. కల్లుగీత వృత్తిని అంతరించిపోకుండా జీవనోపాధి కోసం రక్షించుకుందామన్నారు. హరితహారంలో భాగంగా ప్రభుత్వం నాటే మొక్కలలో ఈత తాటి ఖర్జూర మొక్కలు నాటాలని పేర్కొన్నారు. గౌడ జన హక్కుల కోసం అందరం కలసి కట్టుగా పనిచేయాలని పిలుపునిచ్చారు. సర్వాయి పాపన్న గౌడ్ స్ఫూర్తితో చైతన్యం కావాలన్నారు. కాబట్టి సిద్ధిపేట జిల్లా వ్యాప్తంగా గౌడ జన ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొని మహాసభలను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.

ఉచిత కరెంట్ ఇచ్చిన ఘనత కాంగ్రెస్‌దే

- ములుగు మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు శ్రీనివాస్ గుప్తా



నవతెలంగాణ-ములుగు

ఉచిత కరెంట్ ఇచ్చిన ఘనత కాంగ్రెస్‌దే అని ములుగు మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు శ్రీనివాస్ గుప్తా అన్నారు. బుధవారం ఆయన మాట్లాడుతూ ఉచిత విద్యుత్, రైతులకు సబ్సిడీపై అన్ని రకాల వ్యవసాయ పనిముట్లు ఎరువులు, విత్తనాలు, రైతులకు పంట బీమా సౌకర్యం, ఇన్‌పుట్ సబ్సిడీ పంట నష్టపరిహారం, రైతులకు రుణమాఫీ, ఇవన్నీ ఒకేసారి ఇచ్చిన ఘనత కాంగ్రెస్ ప్రభుత్వానికి దక్కుతుందన్నారు. మండల బీఆర్ఎస్ నాయకులు అవగాహన లేకుండా మాట్లాడటం సిగ్గుచేటన్నారు. మీ ప్రభుత్వం నిజంగా 24 గంటల కరెంట్ ఉచితంగా ఇస్తే సబ్ స్టేషన్‌కు వెళ్లి లాగ్‌బుక్ చూపించాలని, ఏఈతో 24 గంటల కరెంట్ ఇస్తున్నామని చెప్పించాలని డిమాండ్ చేశారు. బీఆర్ఎస్ ప్రభుత్వం మాయమాటలు చెప్పి అబద్ధాలతో రాజ్యమేలుతోందన్నారు. పాలమూరు ప్రాజెక్టు ఆరు నెలల్లో తెస్తానని చెప్పి ఇప్పటివరకు ప్రాజెక్టు తీసుకురాలేదని తెలిపారు. రైతులకు ఒక లక్ష రూపాయల రుణమాఫీ చేస్తానని ఇప్పటివరకు చేయలేని ప్రభుత్వం బీఆర్ఎస్ అన్నారు. ప్రభుత్వం, రైతులకు 24 గంటలు కరెంటు ఇస్తున్నామని అబద్ధం చెబుతోందన్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వాన్ని రైతులు పడగొట్టడం ఖాయమన్నారు.



ఎన్నికల బూత్ లెవల్ అధికారులకు శిక్షణ అందించాలి

నవతెలంగాణ-సిద్దిపేటకలెక్టరేట్

ఎన్నికల బూత్ లెవల్ అధికారులకు ఓటరు జాబితా నమోదుపై పూర్తిస్థాయి శిక్షణ అందించాలని జిల్లా కలెక్టర్ ప్రశాంత్ జె.పాటిల్ ఆర్డీవోలు మరియు తాసిల్దార్లను ఆదేశించారు. బుధవారం కలెక్టర్ కార్యాలయంలో జిల్లాలోని సిద్దిపేట, గజ్వేల్, దుబ్బాక, హుస్నాబాద్ శాసనసభ నియోజకవర్గ పరిధిలోని ఆర్డీవోలు, తాసిల్దారులతో సమావేశం నిర్వహించి.. రాబోయే శాసనసభ ఎన్నికల నిర్వహణపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ రాబోయే శాసనసభ ఎన్నికలను సమర్థవంతంగా నిర్వహించడానికి ఎన్నికల రిటర్నింగ్, అసిస్టెంట్ రిటర్నింగ్, బూత్ లెవల్ అధికారులంతా పూర్తి శిక్షణతో సిద్ధం కావాలన్నారు. ముఖ్యంగా ఓటర్ జాబితాలో 18 ఏండ్లు నిండి ఓటరుగా నమోదు అవ్వడానికి అవకాశం ఉన్న ప్రతి ఒక్కరిని ఓటరుగా నమోదు చేసి ఓటర్ జాబితాలో ఎలాంటి తప్పులకు తావివ్వకుండా రూపొందించాల్సిన బాధ్యత అందరి పైన ఉందన్నారు. నేడు మండల తహసీల్దార్ల వారి కార్యాలయంలో బూత్ లెవల్ ఎన్నికల అధికారులకు ఓటర్ నమోదు, ఫీల్డ్ వెరిఫికేషన్, ఓటరు జాబితాలో మార్పులు చేర్పులపై పూర్తిస్థాయి అవగాహన కల్పించాలన్నారు. ముఖ్యంగా జూలై 15వ తేదీ వరకు స్వీకరించిన ఫామ్ 6, ఫామ్ 7, ఫామ్ 8 దరఖాస్తులను 100శాతం నమోదు చేయాలని అన్నారు. ఆర్డీవోలు అన్ని తాసిల్దార్ కార్యాలయాలను సందర్శించి బిఎల్ఓల శిక్షణ కార్యక్రమాలను పర్యవేక్షించాలన్నారు. అలాగే 18 సంవత్సరాలు నిండిన పౌరులను నూతన ఓటర్లుగా నమోదు చేసేందుకు ఈనెల 27 వరకు ఇంటర్మీడియట్, డిగ్రీ కళాశాలలో ప్రత్యేక డ్రైవ్ నిర్వహించి ఓటర్లుగా నమోదు చేయాలని అన్నారు. బిఎల్ ఓ లు పోలింగ్ కేంద్రాలను విజిట్ చేసి ఎన్నికల సంఘం నిబంధనలకు అనుగుణంగా ఓటర్లకు అవసరమైన అన్ని సౌకర్యాలు ఉండేలా ఏర్పాటు చేయాలని, ర్యాంపులు కచ్చితంగా ఉండాలని, గ్రౌండ్ ఫ్లోర్లలోనే పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేయాలని, పద్నాలుగు వందల ఓటర్లు మాత్రమే ఒక పోలింగ్ కేంద్రంలో ఉండేలా చూడాలని, అదనంగా ఉండే ఓటర్ల కోసం కొత్త పోలింగ్ కేంద్రం కోసం ప్రతిపాదనలు పంపాలని అన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ) శ్రీనివాస్ రెడ్డి, సిద్దిపేట ఆర్డీవో రమేష్, గజ్వేల్ ఆర్డిఓ బి. బన్సీలాల్, హుస్నాబాద్ ఆర్డీవో బెన్ శాలమ్ తదితరులు పాల్గొన్నారు.

నేడు సిద్దిపేటలో ఎస్సీ, ఎస్టీ అత్యాచార బాధితుల, సాక్షుల సదస్సు

నవతెలంగాణ-తొగుట



జిల్లాలో వరుసగా దళితులపై జరుగుతున్న దాడులను నిరసిస్తూ నేడు సిద్దిపేటలో చేపట్టనున్న బాధితుల, సాక్షుల సదస్సును విజయవంతం చేయాలని డిబిఎఫ్ జాతీయ కార్య దర్శి పి.శంకర్ కోరారు. ఈ సందర్భంగా ఆయన విలేకర్లతో మాట్లాడుతూ.. ఆధునిక యుగంలో అంటరానితనం పాటించడం సిగ్గు చేటన్నారు. తిమ్మాపూర్, ధర్మారం, సూరంపల్లి, దౌల్తాబాద్ తదితర గ్రామాలలో దళితుల పై జరిగిన దాడుల కేసులలో నిందితులను ఇప్పటి వరకు అరెస్టు చేయకపోవడం సిగ్గు చేటన్నారు. తిమ్మాపూర్ ఎస్సీ,ఎస్టీ అట్రాసిటి చట్టం కింద మరిన్ని సెక్షన్ లను యాడ్ చెసి ఎఫ్ఐ ఆర్ చేయాలన్నారు. నిందితులకు 41 సిఆర్పి కింద స్టేషను బెయిల్ ఇవ్వడం మానుకోవాలన్నారు. నిందితులను అరెస్టు చేయకుండా కలిసి వుండాలని పోలీసులు నిర్లక్ష్యం,వివక్షను విడకపోతే జిల్లాలో ఉద్యమం చేపడుతామన్నారు. ఎస్సీ ఎస్టీ అట్రాసిటి ప్రత్యేక చట్టం స్ఫూర్తిని ఉల్లంఘిస్తే చూస్తూ ఊరుకోబోమని హెచ్చరించారు. నేడు సిద్దిపేటలో జరిగే సదస్సుకు బాధితులు,సాక్షులు, దళిత బహుజనులు పెద్ద ఎత్తున తరలిరావాలన్నారు.

రైతు బీమాతో కుటుంబానికి భద్రత

నవతెలంగాణ-హత్నూర



మండలంలోని నాగుల్దేవులపల్లి, సికింద్లపూర్ గ్రామాల్లో బుధవారం రైతుబీమా పథకంపై అవగాహనా సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా వ్యవసాయ అధికారి శ్రీనివాసరావు మాట్లాడుతూ.. రైతుబీమా.. కుటుంబానికి భరోసా' అని అన్నారు. ప్రతీ రైతు బీమా చేయించుకోవాలని ఇంటింటికి తిరుగుతూ సూచించినట్టు చెప్పారు. అలాగే వాన కాలంలో సాగుచేసే పంటల యజమాన్య పద్ధతులపై వివరించడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ విస్తీర్ణ అధికారి ప్రేమ్ రాజ్, ఉప సర్పంచ్ యాదగిరి, సుధాకర్, యాద గౌడ్, గోపాల్, మొగులయ్య బక్కప్ప,రామ గౌడ్, రవీందర్, కరోబార్ పావని,రైతులు తదితరులు పాల్గొన్నారు.

మృతుడి కుటుంబానికి అండగా ఎమ్మెల్యే



నవతెలంగాణ-అమీన్‌పూర్

ప్రమాదంలో మృతి చెందిన ప్రయివేటు ఉద్యోగి కుటుంబానికి పటాన్‌చెరు శాసనసభ్యులు గూడెం మహిపాల్ రెడ్డి అండగా నిలిచారు. అమీన్‌పూర్ మండలం వడక్ పల్లి గ్రామానికి చెందిన బిక్షపతి హెచ్ఎమ్ డబ్ల్యుఎస్ సంస్థలో కాంట్రాక్టు ఉద్యోగిగా పనిచేస్తూ జీవనం కొనసాగిస్తున్నాడు. ఇటీవల గ్రామ శివారులో నిర్మిస్తున్న వంతెన నిర్మాణం వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో బిక్షపతి మృతి చెందారు. స్థానిక ప్రజాప్రతినిధుల విజ్ఞప్తి మేరకు స్థానిక శాసనసభ్యులు గూడెం మహిపాల్ రెడ్డి సంబంధిత బ్రిడ్జి నిర్మాణ కాంట్రాక్టర్‌తో చర్చించి మృతుని కుటుంబానికి రూ.5 లక్షల ఆర్థిక సాయం అందించేలా ఒప్పించారు. ఈ మేరకు బుధవారం గ్రామంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో.. మృతుడి కుటుంబ సభ్యులకు ఐదు లక్షల రూపాయల ఆర్థిక సాయం అందించారు. త్వరలోనే ప్రభుత్వం ద్వారా ఇంటి స్థలం అందించేలా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా జీఎంఆర్ మాట్లాడుతూ... రోడ్డుపై ప్రయాణించేటప్పుడు తప్పనిసరిగా హెల్మెట్ ధరించడంతోపాటు అప్రమత్తంగా ఉండాల్సిన అవసరం ఎంతైనా ఉందని సూచించారు. ఈ నేపథ్యంలో నియోజకవర్గ వ్యాప్తంగా 18 ఏండ్లు నిండిన ప్రతీ ఒక్కరికి లైసెన్సులు అందించడం తోపాటు రోడ్డు భద్రతపై అవగాహన కల్పిస్తున్నామని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం అన్ని వర్గాల సంక్షేమం అభివృద్ధి లక్ష్యంగా పనిచేస్తుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ దేవానందం, జెడ్పీటీసీ సుధాకర్ రెడ్డి, గ్రామ సర్పంచ్ లలిత మల్లేష్, ఉపసర్పంచ్ శ్రీకాంత్ రెడ్డి, దాయార సర్పంచ్ భాస్కర్ గౌడ్, జానకంపేట సర్పంచ్ పాండు యాదవ్, సీనియర్ నాయకులు రాజు, రామిరెడ్డి పాల్గొన్నారు.

ఫలహారం బండి ఊరేగింపులో కాటా శ్రీనివాస్‌గౌడ్



నవతెలంగాణ-అమీన్‌పూర్

అమీన్‌పూర్ మున్సిపాల్టీ పరిధిలోని అమీన్‌పూర్ గ్రామంలో రాట్నాల పవన్ ఆధ్వర్యంలో బుధవారం నిర్వహించిన ఫలహారం బండి ఊరేగింపు కార్యక్రమంలో పటాన్చెరువు నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్చార్జ్ కాటా శ్రీనివాస్ గౌడ్ ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా నిర్వాహకులతో కలిసి పలహారం బండి ఊరేగింపు యాత్రలో పాల్గొని.. అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. బోనాల ఉత్సవాల్లో పలహారం బండి ఊరేగింపు కార్యక్రమం ఎంతో ప్రత్యేకత సంతరించుకుందన్నారు. అమ్మవారికి మొక్కులు చెల్లించడం ఫలహారాలను నైవేద్యంగా పెట్టడం ఎంతో ముఖ్యమైన ఘట్టమన్నారు. అమ్మవారి చల్లని చూపులతో ప్రజలంతా సుఖ సంతోషాలతో ఉండాలని కోరుకున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో మున్సిపాలిటీ కాంగ్రెస్ పార్టీ ప్రెసిడెంట్ శశిధర్ రెడ్డి, వైస్ ప్రెసిడెంట్ రవీందర్, నాయకులు లక్ష్మణ్, అశోక్, నరసింహ, రత్నాకర్, నందు, చుక్కా ఒడ్డి, కృష్ణ, రాములు, మహిళలు పాల్గొన్నారు.

సంస్కృతీ సంప్రదాయాలు ఉట్టిపడేల బోనాలు

నవతెలంగాణ-పటాన్‌చెరు



తెలంగాణ సంస్కృతిసంప్రదాయాలు ఉట్టిపడేల గ్రామ గ్రామాల బోనాల ఉత్సవాలు ఎంతో వైభవంగా జరుగుతున్నాయని బీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు నీలం మధు ముదిరాజ్ అన్నారు. పటాన్‌చెరు మండలం చిట్కుల్ గ్రామం వడ్డెర కాలనీలో నిర్వహించిన బోనాల పండుగ ఉత్సవాలలో పాల్గొని అమ్మవారిని దర్శించుకున్నారు. అనంతరం నిర్వహించిన ఫలహారం బండి కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించారు. బోనాల ఉత్సవ నిర్వాహకులు నీలం మధు ముదిరాజ్ కు భారీ గజమాల వేసి ఘనంగా సత్కరించారు. బోనాల ఉత్సవాలు అంగరంగ వైభవంగా తెలంగాణ సంస్కృతీ సంప్రదాయాలు ఉట్టిపడే విధంగా నిర్వహించుకోవడం గర్వకారణమన్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వం పండుగలకు అధికార హోదా కల్పించబట్టే బోనాల ఉత్సవాల అంగరంగ వైభవంగా నిర్వహించుకుంటున్నామన్నారు. మన సాంప్రదాయాలను మనమే గౌరవించుకోవడంతోపాటు ఇతరుల సంప్రదాయాలకు విలువ ఇచ్చే విధంగా ఉండాలన్నారు. ఈ కార్యక్రమంలో వార్డు సభ్యులు వెంకటేశ్, రాజ్ కుమార్,నాయకులు శ్రీను, అభిరామ్, ఈశ్వర్, కుపాస్వామి, భీమ, శంకర్, రాజు, మారుతి, భీమ, నాగేష్, రాము, రాజు, ఉదయ్, నాగరాజు, ఎన్ఎంఆర్ యువసేన సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.

గ్రామ పంచాయతీ కార్మికుల బిక్షాటన

నవతెలంగాణ-ఝరాసంగం



గ్రామపంచాయతీ కార్మికుల సమస్యలను పరిష్కరించాలని కోరుతూ గత 14 రోజుల నుండి సమ్మె చేపడుతున్న విషయం తెలిసిందే. బుధవారం సమ్మెలో భాగంగా కార్మికులంతా తహసీల్దార్, ఎంపీడీవో, పోలీస్ స్టేషన్ తదితర కార్యాలయాలలో బిక్షాటన చేపట్టారు. ఝరాసంఘం మండల కేంద్రంలో జేసీబీ సహాయంతో మురికి కాలువలను శుభ్రం చేస్తున్న విషయాన్ని తెలుసుకున్న కార్మికులంతా తొలగింపును అడ్డుకున్నారు. రాష్ట్ర ప్రభుత్వం వెంటనే వారి సమస్యలను పరిష్కరించాలని సీఐటీయూ మండల కార్యదర్శి చంద్రన్న డిమాండ్ చేశారు.



పై చదువుల కోసం ఆర్థిక సాయం

నవతెలంగాణ-రామచంద్రాపురం

రామచంద్రాపురం పట్టణంలో నివసించే డీసీఎం డ్రైవర్ సాబెర్ కుమార్తె ఇంజనీరింగ్‌లో బీటెక్ చదువుతుంది. వారికి ఆర్థిక స్తోమత లేకపోవడంతో తనవంతు సాయంగా బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు గోదావరి అంజిరెడ్డి బుధవారం రూ.15 వేలు కాలేజీ ఫీజును చెక్కు ద్వారా అందించారు. నిరుపేదలకు తమకు తోచిన విధంగా సహాయ సహకారాలు ఎల్లప్పుడూ అందిస్తామని ఈ సందర్భంగా గోదావరి తెలిపారు. ఈ కార్యక్రమంలో మహిపాల్ రెడ్డి, లక్ష్మణరావు ఆజాజ్, శంకర్ తదితరులు పాల్గొన్నారు.



రైతుబీమాకు దరఖాస్తు చేసుకోండి

నవతెలంగాణ-న్యాల్‌కల్

ఈనెల 31లోపు రైతుబీమాకు దరఖాస్తు చేసుకునే అవకాశం ఉన్నదని.. రైతులందరూ ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని రేజింతల్ క్లస్టర్ ఏఈఓ సన్నీత్ రెడ్డి తెలిపారు. బుధవారం రేజింతల్ గ్రామ రైతువేదికలో రైతుబీమా దరఖాస్తులు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కొత్తగా పట్టా పాస్‌బుక్ వచ్చిన వారు వెంటనే దరఖాస్తు చేసుకోవాలన్నారు. అలాగే నామిని పేరు మార్పు చేసుకోవచ్చు అన్నారు. 18 నుంచి 59 ఏండ్ల లోపు వారు అర్హులని.. రైతు పట్టాదారు పాసు పుస్తకం, ఆధార్, నామిని ఆధార్, అప్లికేషన్ ఫామ్‌తో తమ క్లస్టర్‌లోని ఏఈఓ సంప్రదించి దరఖాస్తులు చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో చిన్న, అశోక్ రెడ్డి, రైతులు ఉన్నారు.



టీఎస్ సీపీఎస్ఈయూ పోస్టర్ ఆవిష్కరణ

నవతెలంగాణ-ఝరాసంగం

'పాత పెన్షన్ సంకల్ప రథయాత్ర'ను ఈనెల 29వ తేదీన నిర్వహించనున్నామని, ఉద్యోగులు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని రాష్ట్ర ఉపాధ్యక్షులు పోల శ్రీనివాస్ తెలిపారు. బుధవారం మండల కేంద్రంలోని తహసిల్దార్, ఎంపీడీవో, జడ్పీహెచ్ఎస్ ఝరాసంఘం, జీర్ల పల్లి, కుప్పానగర్ పాఠశాలలో టీఎస్ సీపీఎస్ఈయూ పోస్టరను విడుదల చేశారు. ఈ కార్యక్రమంలో నాయక్ తహశీల్దార్ రాజిరెడ్డి, మండల వ్యవసాయ అధికారి వెంకటేష్, జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ అమృత్, మండల నాయకులు వసంత్, కృష్ణ, పాండు, శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

స్నేహితురాలికి అండగా చిన్ననాటి మిత్రులు

నవతెలంగాణ-కోహెడ



చిన్ననాటి నుంచి ఒకే తరగతి గదిలో విద్యనభ్యసించిన తన తోటి స్నేహితురాలి కుటుంబానికి ఆర్థిక భరోసా ఇచ్చేందుకు ఎసెస్సీ మిలీనియం బ్యాచ్ విద్యార్థులు అండగా నిలిచారు. కోహెడ మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 1999-2000 సంవత్సరంలో ఎసెస్సీ పూర్తి చేసిన మిలీనియం బ్యాచ్ విద్యార్థులు మండలంలోని పర్వేద గ్రామానికి చెందిన స్నేహితురాలు కంకణాల రజిత భర్త కంకణాల రాజిరెడ్డి ఇటీవల మృతి చెందగా రూ. 72,500 లను బుధవారం ఆమె కుటుంబానికి అందజేశారు. ఆపదలో మేమున్నామంటూ వారికి ఇచ్చే భరోసా ఎంతో గొప్పదని, ఆర్థికసాయం అందించేందుకు ముందుకు వచ్చిన చిన్ననాటి మిత్రులను గ్రామస్థులు, కుటుంబ సభ్యులు అభినందించారు.

14వ రోజు కార్మికుల నిరవధిక సమ్మె

నవతెలంగాణ-హుస్నాబాద్ రూరల్



గ్రామంచాయతీ కార్మికుల న్యాయమైన డిమాండ్‌లను అమలు చేయాలని కోరుతూ చేపట్టిన సమ్మె బుధవారానికి 14 రోజుకు చేరుకుంది. ఈ సందర్భంగా కార్మికులు మాట్లాడుతూ గ్రామాలలో మురికి చెత్తను తీసే కార్మికుల పట్ల ప్రభుత్వం మొండి వైఖరి సరికాదన్నారు. కార్మికుల సమస్యలను వెంటనే పరిష్కరించాలని, సమస్యల పరిష్కారమయ్యే వరకు సమ్మె విరమించేది లేదన్నారు. ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షుడు దుర్గయ్య, మామిడి సంపత్, శ్రీనివాస్, తాడూరి లక్ష్మి,, సదానందం, నాగరాజు, కార్తీక్, తిరుమల, వెంకటేశం తదితరులు పాల్గొన్నారు.

కలెక్టర్‌ను కలసి పుష్పగుచ్చం అందజేసిన ఆర్డీఓ

నవతెలంగాణ- సిద్ధిపేట కలెక్టరేట్



సిద్ధిపేట జిల్లా గజ్వేల్ ఆర్డీఓగా నూతనంగా బాధ్యతలు స్వీకరించిన బి. బన్సీలాల్ బుధవారం సమీకృత జిల్లా కార్యాలయ సముదాయంలోని కలెక్టర్ చాంబర్‌లో జిల్లా కలెక్టర్ ప్రశాంత్ జే పాటిల్‌ను మార్యదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛాన్ని అందజేశారు. ఇదివరకు ఆర్డీఓగా పనిచేసిన విజేందర్ రెడ్డి ప్రమోషన్‌పై వెళ్లడంతో హన్మకొండ తహసీల్దార్‌గా పనిచేసిన బి.బన్సీలాల్ ప్రమోషన్‌పై గజ్వేల్ ఆర్డీఓగా బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా అందరు అధికారులతో సమన్వయంతో సమర్థవంతంగా విధులు నిర్వహించాలని జిల్లా కలెక్టర్ నూతన ఆర్డీఓకు సూచించారు.

గజ్వేల్‌లో బీఎస్పీని బలోపేతం చేస్తాం

నవతెలంగాణ-గజ్వేల్



గజ్వేల్ నియోజక వర్గంలో బీఎస్పీ పార్టీని బలోపేతం చేస్తామని నియోజకవర్గ అధ్యక్షులు గూడూరు కరుణాకర్ తెలిపారు. బుధవారం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ నియోజకవ ర్గంలో ఉన్న పిడిఎస్ నాయకులు వినోద్ కుమార్, రమణాకర్, సిపిఐ నాయకులు రాజు, సుధాకర్, మైనార్టీ నాయకులు అఖిల్ పాషా, రవి, స్వామి, శంకర్, సునీల్ తదితరులు బిఎస్పీ పార్టీలో చేరినట్లు ఆయన తెలిపారు. వీరందరికీ ఇటీవల బీఎస్పీ రాష్ట్ర అధ్యక్షులు ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ పార్టీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించినట్లు తెలిపారు. బీఎస్పీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఈశ్వర్, జిల్లా అధ్యక్షులు మోహన్, ఉపాధ్యక్షులు ఓం ప్రకాష్, కార్యదర్శి నరేష్, ఉపాధ్యక్షులు ఎల్లం, ప్రధాన కార్యదర్శి మొండి కరుణాకర్, నాయకులు చంద్రశేఖర్, మహేందర్, వంశీ తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వం చెప్పే 24 గంటల కరెంట్ అంతా అబద్ధం

నవతెలంగాణ-నంగునూరు

ఇచ్చే 10 గంటల కరెంట్‌ను 24 గంటలని ప్రభుత్వం చెప్పేవి అన్ని అబద్ధాలేనని టీపీసీసీ రాష్ట్ర కార్యదర్శి దేవులపల్లి యాదగిరి మండిపడ్డారు. బుధవారం నంగునూరు మండల కేంద్రంలో సబ్ స్టేషన్‌ను సందర్శించారు. కాంగ్రెస్ పార్టీ నాయకులతో కలిసి లాగ్‌బుక్‌ను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన విలేకరులతో మాట్లాడారు. ముఖ్యమంత్రి కేసీఆర్ జిల్లా, మంత్రి హరీశ్‌రావు నియోజకవర్గంలోనే అత్యధికంగా కరెంట్ కోతలు ఉన్నాయనే విషయాలు లాగ్‌బుక్ ద్వారా స్పష్టం అవుతోందన్నారు. నిన్నటి దాకా నాగరాజు పల్లి ఫీడర్, అక్కెనపల్లి ఫీడర్లకు అసలే కరెంట్ సరఫరా లేదని లాగ్‌బుక్‌లో నమోదైన విషయాలని పేర్కొన్నారు. సీఎం కేసీఆర్ జిల్లాలోనే ఈ పరిస్థితి ఉంటే రాష్ట్రం మొత్తంలో ఎలా వుంటుందో అర్థం చేసుకోవాలని తెలియజేశారు. ఆరు నెలలుగా వ్యవసాయానికి ఎన్ని గంటలు విద్యుత్ సరఫరా చేశారో శ్వేత పత్రం విడుదల చేయాలని డిమాండ్ చేశారు. కేవలం పది గంటలు మాత్రమే సరఫరా అవుతున్నా బీఆర్ఎస్ ప్రభుత్వం 24 గంటల కరెంట్ ఇస్తామని, కాంగ్రెస్ అధికారంలోకి వస్తే కరెంట్ రాదని చెప్పడం విడ్డూరంగా ఉందన్నారు. రైతు వేదికల్లో చర్చలు పెట్టి సొంత కార్యకర్తలతోనే తీర్మాణాలు



చేసుకోవడం సిగ్గుమాలిన తనమని విమర్శించారు. విద్యుత్ సరఫరాలో వేల కోట్ల కుంభకోణం జరిగిందని తెలిపారు. ఎన్ని జిమ్మిక్కులు చేసిన బీఆర్ఎస్ ప్రభుత్వాన్ని రైతులు సాగనంపడం ఖాయమని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు గుంటి పల్లి శ్రీనివాస్, చెలికాని యాదగిరి, అనరాజు నాగరాజు, రాగుల కృష్ణ, గౌరబోయిన సంపత్, జంగిటి శ్రీనివాస్, గోనెపల్లి శివ ప్రసాద్, గుంటిపల్లి దాస్, దేవులపల్లి శంకర్, కారంపురి వైకుంఠం తదితరులు పాల్గొన్నారు.

కనకయ్య కుటుంబాన్ని ఆదుకుంటాం

బీఆర్ఎస్ పార్టీ రాష్ట్ర నాయకులు దేవి రవీందర్

నవ తెలంగాణ -గజ్వేల్

తెలంగాణ ఉద్యమకారుడు కనకయ్య కుటుంబాన్ని మంత్రి హరీశ్‌రావు సహకారంతో అన్ని విధాల ఆదుకుంటామని తెలంగాణ ఎంపీటీసీల ఫోరం వర్కింగ్ ప్రెసిడెంట్ దేవీ రవీందర్ అన్నారు. బుధవారం గజ్వేల్ మండలం ధర్మారెడ్డి పల్లి గ్రామానికి చెందిన సీనియర్ బీఆర్ఎస్ కార్యకర్త కాసముల్ల కనకయ్య అనారోగ్యంతో మృతిచెందగా బుధవారం వారి కుటుంబాన్ని మండల పార్టీ అధ్యక్షులు బెండే మధు, పిఎసిఎస్ చైర్మన్ వెంకటేశం, వైస్ ఎంపీపీ కృష్ణ గౌడ్‌తో కలిసి కనకయ్య కుటుంబాన్ని పరామర్శించారు. రాష్ట్ర ఎంపీటీసీల ఫోరం వర్కింగ్ ప్రెసిడెంట్ దేవి రవీందర్ రూ.5000లను వారి కుటుంబానికి అందజేశారు. అనంతరం మాట్లాడుతూ కనకయ్య కుటుంబానికి పార్టీ అన్ని విధాల అండగా ఉంటుందన్నారు. తెలంగాణ ఉద్యమ సమయంలో పనిచేసిన కనకయ్య మరణం పార్టీకి తీరనిలోటని, పార్టీ అంటే ఎంతో అభిమానం



కలిగిన వ్యక్తి అని కొనియాడారు. అలాంటి వ్యక్తి చనిపోవడం దురదృష్టకరమన్నారు. ప్రభుత్వపరంగా అన్ని విధాలుగా ఆదుకుంటామన్నారు. ఈ కార్యక్రమంలో మాధవరెడ్డి, పార్టీ నాయకులు పాల్గొన్నారు.

గజ్వేల్ అభివృద్ధికి అడ్డం పడుతున్న బస్టాండ్ దుస్థితి

యువజన కాంగ్రెస్ నాయకులు సర్దార్ ఖాన్

నవ తెలంగాణ-గజ్వేల్

గజ్వేల్ నియోజకవర్గంపై అధికార పార్టీకి సవతి తల్లి ప్రేమ ఉంటుందని గజ్వేల్ బస్టాండ్ పరిస్థితిని చూస్తే అర్థమవుతుందని రాష్ట్ర యువజన కాంగ్రెస్ నాయకులు సర్దార్ ఖాన్ అన్నారు. బుధవారం భారీ వర్షంలో గజ్వేల్ బస్టాండ్‌లో ప్రయాణికులు ఎదుర్కొంటున్న కష్టాలను ఆయన పరిశీలించారు. అనంతరం మాట్లాడుతూ ముఖ్యమంత్రి నియోజకవర్గం అని చెప్పుకోవటానికే తప్ప దేనికీ పనికి రాదని సర్దార్ ఖాన్ ఆరోపించారు. సమీర్, గణేష్, మీర్జా జామీర్ భేగ్‌తో కల్సి గజ్వేల్ బస్టాండ్ వద్ద మాట్లాడుతూ పట్టణ కేంద్ర లో బస్టాండ్ నిర్మాణం పూర్తి కాకపోవడంతో ప్రయాణికులు ఇబ్బందులు ఎదుర్కొరటున్నారు. మహిళలు, విద్యార్థి, విద్యార్థినులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నా అధికార పార్టీ నాయకులు, అధికార యంత్రాంగం పట్టించుకునే పాపాన పోవడం లేదన్నారు. రాజకీయాలు చేయడం తప్ప ప్రజలకు సేవ చేయాలనే ఆలోచన లేదన్నారు. గజ్వేల్ నియోజకవర్గ అధికార పార్టీ నాయకులకు చిత్తశుద్ధి లేదన్నారు. అధికార పార్టీ



నాయకులకు గజ్వేల్‌పై సవతి తల్లి ప్రేమ ఉన్నదని చెప్పడానికి ఇదే పెద్ద నిదర్శనమన్నారు. సిద్దిపేటలో బస్టాండ్ నిర్మాణంను కొన్ని నెలల్లోనే పూర్తి చేశారు. గజ్వేల్‌లో కొన్ని సంవత్సరాలు గడుస్తున్నా బస్టాండ్ నిర్మాణం పూర్తి చేయకపోవడమే దీనికి నిదర్శనమన్నారు.

బీఆర్ఎస్ అధికారంలోనే నిరంతర విద్యుత్ సరఫరా

దాచారం రైతు తీర్మానంలో ఎమ్మెల్యే రసమయి
ముదిరాజ్ సంఘ భవన ప్రారంభం

నవతెలంగాణ-బెజ్జంకి

బీఆర్ఎస్ అధికారంలోనే వ్యవసాయ రంగానికి 24 గంటల నిరంతర విద్యుత్ సరఫరా అవుతూ రైతుల కలలు నెరవెరుతాయని ఎమ్మెల్యే రసమయి బాలకిషన్ సూచించారు. టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్ రెడ్డి వ్యవసాయానికి 3 గంటల విద్యుత్ సరఫరా చాలంటూ చేసిన అనుచిత వ్యాఖ్యలకు నిరసనగా బుధవారం మండల పరిధిలోని దాచారం రైతు వేదిక యందు రైతులు చేసిన తీర్మాణానికి ఎమ్మెల్యే రసమయి బాలకిషన్ హజరయ్యారు. అనంతరం గ్రామంలో నూతనంగా నిర్మించిన ముదిరాజ్ సంఘ భవనాన్ని స్థానిక ప్రజాప్రతినిధులతో కలిసి ఎమ్మెల్యే ప్రారంభించారు. ఎంపీపీ నిర్మల,జెడ్పీటీసీ కవిత, సర్పంచులు పెంటమీదీ శ్రీనివాస్, కనగండ్ల రాజేశం, టేకు తిరుపతి, బీఆర్ఎస్ అనుబంధ కమిటీల నాయకులు,రైతులు, ముదిరాజ్ కులస్తులు పాల్గొన్నారు.

రాజకీయాలకతీతమన్న మాటలు ఉత్తవే

ఎన్నికల వరకే రాజకీయాలని..అభివృద్ధిలో రాజకీయాలకతీతంగా సహకరించాలని బీఆర్ఎస్ ప్రజాప్రతినిధులు చేసిన వాఖ్యలు ఉత్తవేనని దాచారం ఎంపీటీసీ కొలిపాక రాజు అసహనం వ్యక్తం చేశారు. బుధవారం మండల పరిధిలోని దాచారం గ్రామంలో నూతనంగా నిర్మించిన ముదిరాజ్ సంఘ భవన ప్రారంభంలో ప్రోటోకాల్ ప్రకారం స్థానిక ఎంపీటీసీని విస్మరించడం రాజకీయాలకు అతిథ్యమివ్వడమేనని ప్రజాప్రతినిధుల తీరును ఎంపీటీసీ రాజు ఖండించారు.



స్థానిక బీఆర్ఎస్ ప్రజాప్రతినిధులు, నాయకుల దగ్గర విజ్ఞానంతో సాధించుకున్న అధికారాన్ని సంబధిత అధికార యంత్రాంగం తృణంగా పెట్టారని రాజు ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రోటోకాల్ విస్మరించడంలో అధికార యంత్రాంగం వ్యవహరచిన తీరుపై జిల్లా పరిపాలనాధికారికి ఫిర్యాదు చేయనున్నట్టు రాజు తెలిపారు.

పత్తి పంటల్లో తీసుకోవాల్సిన జాగ్రత్తలు



నవతెలంగాణ-జగదేవపూర్ : జగదేవపూర్ మండల కేంద్రంలో గల రైతు వేదికలో మండల వ్యవసాయ అధికారి వసంతరవు బుధవారం విలేకరులతో మాట్లాడుతూ గత రెండు రోజులుగా ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాలకు ప్రత్తి పంటలలో తీసుకోవాల్సిన చర్యలను గురించి వివరించారు. అధిక వర్షాల కారణంగా ఎక్కడైతే నీరు నిల్వ ఉంటుందో అక్కడ తక్షణమే నీటిని ప్రత్తి చేను నుంచి తీసివేయాలన్నారు. దీనికి పొలంలో చిన్న కాలువలను ఏర్పాటు చేసుకోవాలని తెలిపారు. ఈ అధిక వర్షాలకు కలుపు సమస్య కూడా ఎక్కువవుతుందన్నారు. గడ్డి జాతి కలుపు నివారణకు క్విజలోపాప్ ఇథైల్ 400 మి. లీ లేదా ప్రోపాక్విజాపాప్ 250 మి. లీ ఎకరానికి పిచికారి చేయాలి. గడ్డిజాతి మరియు వెడల్పాటి ఆకుల కలుపు నివారణకు క్విజలోపాప్ ఇథైల్ 400 మి. లీ తో పాటు పైరిథాయోబ్యాక్ సోడియం 250 మి. లీ ఎకరానికి పిచికారి చేసుకోవాలి. కలుపు లేత దశలో 2-4 ఆకుల దశలో పిచికారి చేసుకుంటే కలుపు నివారణ బాగుంటుందన్నారు. అధిక వర్షాల వలన ఎక్కడైనా మొక్కలు ఎండి పోవటం గమనించినట్లయితే అక్కడ కాపర్ ఆక్సి క్లోరైడ్ 3 గ్రా. లేదా కార్బండిజం 1 గ్రా. లీటర్ నీటిలో కలిపి వారం రోజుల వ్యవధిలో రెండుసార్లు మొక్కలు అడుగుభాగం తడిచేతట్లు పిచికారి చేసుకోవాలన్నారు. పైపాటుగా పోషకాలు అందించడానికి 19:19:19 లేదా పొటాషియం నైట్రేట్ 13:0:45 లేదా యూరియా 10 గ్రా. లీటర్ నీటికి కలిపి పిచికారి చేసుకోవాలి అని తెలిపారు. రైతులు వర్షం కారణంగా పత్తి పంటలో జాగ్రత్త అవసరమన్నారు.

నులి పురుగుల నివారణకు కృషి చేయాలి

నవ తెలంగాణ-మిరు దొడ్డి



మిరుదొడ్డి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలోని వివిధ గ్రామాల్లో గురువారం డివార్మింగ్ డే నిర్వహించడానికి ఏర్పాట్లు పూర్తి చేసినట్లు వైద్యాధికారి డాక్టర్ సమీనా సుల్తానా, మండల విద్యాధికారి ప్రభుదాస్‌లు తెలిపారు. పిల్లల్లో నులి పురుగుల నిర్మూలనకు అల్బెండాజోల్ మాత్రల పంపిణి కార్యక్రమాన్ని నిర్వహించడం జరుగుతుందన్నారు. పి హెచ్ సి పరిధి లోని 11 గ్రామాల్లోని ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలు, అంగన్ వాడి కేంద్రాల్లోని 1 నుంచి 19 యేండ్ల మధ్య వయస్సు కలిగిన 5639 మంది పిల్లలకు ఈ మాత్రలను ఇవ్వడం జరుగుతుందని తెలిపారు. నులి పురుగుల నిర్మూలనకు ప్రజా ప్రతినిధులు, తల్లి దండ్రులు, ప్రజలు సహకరించాలని కోరారు. ఎంఈఓ ప్రభుదాస్ లింగమూర్తి ఆశా వర్కర్లు, అంగన్వాడి సిబ్బంది పాల్గొన్నారు

ఉచిత కుట్టుమిషన్ కేంద్రాన్ని సద్వినియోగం చేసుకోవాలి

నవతెలంగాణ-సిద్దిపేట అర్బన్



మహిళలకు ఉచిత కుట్టుమిషన్ శిక్షణ కేంద్రం ద్వారా శిక్షణ పొందడం వలన ఉపాధి అవకాశాలు లభిస్తాయని వైస్ ఎంపీపీ ఎల్లం అన్నారు. సిద్దిపేట అర్బన్ మండలం మిట్టపల్లి, పొన్నాల గ్రామాలలో స్మార్ట్ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఉచిత కుట్టు మిషన్ శిక్షణ కేంద్రాలను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మహిళలు ఈ అవకాశాన్ని సద్వినియోగ పరుచుకుని శిక్షణలో మెలకువలను నేర్చుకొని తద్వారా ఉపాధి పొందాలని సూచించారు. శిక్షణ సమయంలో బయోమెట్రిక్ ద్వారా హాజరు తీసుకోవడం జరుగుతుందని శిక్షణకు వచ్చే వారికి భోజన సదుపాయం అందించడం జరుగుతుందని తెలిపారు. శిక్షణ అనంతరం సర్టిఫికెట్‌తో పాటు కుట్టు మిషన్ కూడా అందజేస్తున్నట్లు ఆయన తెలిపారు. కార్యక్రమంలో స్థానిక సర్పంచ్‌లు తన్నీరు రేణుక శ్రీనివాస్, వంగ లక్ష్మి, ఎంపీటీసీ మమత యాదగిరి, ఈజీఎస్ స్టేట్ కౌన్సిల్ మెంబర్ బాల్ రంగం, ఏపిఎం చంద్రం, సీఏలు సుష్మ, వనజ, బిఆర్ఎస్ అర్బన్ శాఖ అధ్యక్షులు ఎద్దు యాదగిరి మహిళా సంఘాల నాయకులు పాల్గొన్నారు.

అతిథి అధ్యాపకుల పోస్టులకు దరఖాస్తుల ఆహ్వానం

నవ తెలంగాణ-సిద్దిపేట : జిల్లాలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో 69 అతిథి అధ్యాపకుల పోస్టులకు దరఖాస్తు చేసుకునేందుకు ఈ నెల 24 వరకు గడువు ఉందని ఇంటర్ విద్యా జిల్లా అధికారి సూర్య ప్రకాష్ తెలిపారు. పీజీలో 50శాతం మార్కులతో ఉత్తీర్ణ సాధించిన వారు అర్హులన్నారు. అర్హత కలిగిన అభ్యర్థులు ఎస్-ఎస్‌సి, ఇంటర్, డిగ్రీ , పీజీ , నేటివిటీ సర్టిఫికెట్ ధ్రువపత్రాలు జిరాక్స్ కాపీలతో జిల్లా ఇంటర్ విద్యాధికారి కార్యాలయంలో దరఖాస్తు చేసుకోవాలన్నారు. సిద్దిపేట బాలుర కళాశాలలో 04, కొండపాకలో 03, సిద్దిపేట బాలికల కళాశాలలో 05, గజ్వేల్ బాలుర కళాశాలలో 04, దౌల్తాబాద్ 01, దుబ్బాక 04 , జగదేవ్ పూర్ 03, నంగునూర్ 06, మిరుదొడ్డి 03, చిన్నకోడూర్ 02 , ములుగు 06, వర్గల్ 03, గజ్వేల్ బాలికల 11, హుస్నాబాద్ బాలుర 02, హుస్నాబాద్ బాలికల 02, బెజ్జంకి 03, మద్దూర్ 03 ,చేర్యాల కళాశాలలో 04, ఖాళీలున్నాయని తెలిపారు.



ఇందిరా నగర్ జెడ్పీ స్కూలులో ఇష్లా ఫలితాలు

అట్టహాసంగా ఇందిరానగర్ జెడ్పీ హైస్కూల్-ఈ అభ్యాస అకాడమీ దత్తత

నవతెలంగాణ-సిద్దిపేట

రాంచరణ్ : ఈ పాఠశాలలో అడ్మిషన్ లభిస్తుందని అనుకోలేదు. తల్లిదండ్రుల ఆశయాలను నెరవేరుస్తాం.

ఫ్రెంచ్‌భాషలో : నూ దువా అక్కాఅండ్ ఫ్లీడ్ లేస్ ఆర్థాంత్ దోనో పాహుమ్. నె నౌస్ అటెండియన్స్ పాస్ ఎట్రీ అడ్మిస్ అలె కోలె

-మంత్రి హరీశ్‌రావుకు రుణపడి ఉంటాం. కార్పోరేట్ పాఠశాలను మించి విద్యను అందిస్తున్నారు.

స్పానిష్ భాష: ఎస్తామూస్ ముయ్ అగ్రాదేసిదోస్ ఫోర్ తోదో సెన్యోర్ హరీశ్‌రావు. తెనిమోస్కె ప్రోవేర్ లా ఎదుకాసియాన్ మెఖోర్ కె లోస్ కెలెహియోస్ పూబ్లికోస్

నిహారిక : ప్రభుత్వ పాఠశాల విద్యార్థినీగా గర్వపడుతున్నా. ఇంగ్లీష్ అండ్ ఫారెన్ లాంగ్వేజెస్ యూనివర్సిటీ ద్వారా ఇంగ్లీషు మాట్లాడడంతో స్టేజ్ ఫియర్ ఏలా అధిగమించాలనే విషయాలు నేర్చుకున్నాను

ఇంగ్లీషు : ఐయామ్ ఫీలింగ్ ప్రౌడ్ బీయింగ్ ఏన్ స్టూడెంట్ ఆఫ్ గవర్నమెంట్ స్కూల్. లర్న్ఇంగ్లీషు బికాజ్ ఆఫ్ ఇష్లా. ఓవర్ కమ్ స్టేజ్ ఫియర్ విత్ దిస్ సెల్ఫ్ కాన్ఫిడెన్స్'

ఇదెక్కడో కాదు.. సిద్ధిపేట ఇందిరా నగర్ జెడ్పీ పాఠశాలలో ఇష్లా శిక్షణ పొందుతున్న పదవ తరగతి విద్యార్థులు రాంచరణ్, నిహారికలు ఇంగ్లీషు, స్పానిష్, ఫ్రెంచ్ భాషలలో మంత్రి హరీశ్ రావుతో ముచ్చటించిన సందర్భమిది. ఈ విషయమై విద్యార్థుల ఇష్లా లాంగ్వేజ్ విని ఇష్లా ఫలితాలు బాగున్నాయని మంత్రి సంతోషం వ్యక్తం చేశారు. పదో తరగతి ఫలితాలు రావాలని ఎన్నో సమీక్షలు, టెలీ కాన్ఫరెన్స్ లు జరిపి తల్లిదండ్రులను టీవీలు బంద్ చేయాలని కోరిన నా ప్రయత్నం ఫలించిందన్నారు. ఆ ప్రయత్నాన్ని ఇలాగే కొనసాగించాలనే అభిప్రాయం వ్యక్తం చేశారు. 10/10జీపీఏ సాధనతో పాటు 34 మంది విద్యార్థులు ఐఐటీ బాసరలో సీట్లు పొందడం సిద్ధిపేట గొప్పతనాన్ని చాటి చెప్పిందని తెలిపారు. రాష్ట్ర స్థాయిలో ఆదర్శంగా నిలిపేలా కృషి చేసిన స్కూల్ ఉపాధ్యాయ బృందానికి అభినందనలు తెలియజేశారు. ఏదైనా వసతులు సమకూర్చడం కంటే సద్వినియోగం చేసుకోవడం ముఖ్యమని.. అలా ఇప్పటికే 16 రకాల సాయం పొందిన ఈ స్కూల్ ఇవాళ మరో 17వ ఈ అభ్యాస అకాడమీ దత్తత తీసుకున్న నిర్ణయంపై శుభాకాంక్షలు తెలిపారు. 10/10జీపీఏ సాధించే 150 విద్యార్థులకు ఐ ప్యాడ్స్.. పదవ తరగతి చదివే 200 మందికి, పరీక్ష రాసి ఉత్తీర్ణత సాధించిన వారికి ఫైనల్ పదవ తరగతి పరీక్షల్లో 10/10జీపీఏ సాధించేలా 150 మంది విద్యార్థులకు సర్ ప్రైజ్ గిఫ్ట్ అందిస్తానని మంత్రి మాట ఇచ్చారు. ఈ మేరకు ఇందిరా నగర్ హైస్కూలు లో పదవ తరగతి 150 మంది విద్యార్థులకు అవసరమయ్యే ఐ ప్యాడ్స్ అందివ్వాలని జిల్లా కలెక్టర్‌కు సూచన చేశారు. ఈ అభ్యాస అకాడమీ ఆధ్వర్యంలో ఐఐటీ మెటీరియల్స్ ను విద్యార్థులకు అందజేశారు. అనంతరం 10/10 జీపీఏ సాధించిన విద్యార్థులకు శాలువతో సన్మానించారు. ఈ కార్యక్రమంలో మాజీ మున్సిపల్ చైర్మన్ రాజనర్సు, రాష్ట్ర నర్సింగ్ కౌన్సిల్ సభ్యుడు పాల సాయిరాం, మార్కెట్ కమిటీ చైర్మన్ మచ్చ విజిత-వేణుగోపాల్ రెడ్డి, మున్సిపల్ కౌన్సిలర్ కవిత, ఈ అభ్యాస అకాడమీ సీఈఓ భువనగిరి ఫణి పవన్, జీఎం మణికంఠ, ట్రెస్మా అధ్యక్షుడు శేఖర్ రావు, సెక్రటరీ మధుసూదన్, పాఠశాల ప్రధానోపాధ్యాయులు సత్యనారాయణ రెడ్డి, ఇతర ప్రజాప్రతినిధులు, పాఠశాల ఉపాధ్యాయ బృందం తదితరులు పాల్గొన్నారు.

చెల్లిని ప్రేమిస్తున్నాడని గొడ్డలితో నరికిన అన్న

యువకుడు మృతి



నవతెలంగాణ-కోహీర్

చెల్లిని ప్రేమిస్తున్నాడని కక్ష పెంచుకున్న ఆమె అన్న.. ఆ ప్రేమికుడిని గొడ్డలితో నరికి హతమార్చాడు. ఈ ఘటన కోహీర్ మండలం పిచేర్యాగడి తాండాలో బుధవారం జరిగింది. ఘటనా స్థలాన్ని సీఐ రాజు, ఎస్సై సురేష్‌లు పరిశీలించారు. వారు తెలిపిన వివరాల ప్రకారం.. కోహీర్ మండలం పిచేర్యాగడి తాండాకు చెందిన కేతావత్ సుదీప్(19), అదే తండాకు చెందిన ఓ మైనర్ యువతిని ప్రేమించాడు. అయితే ఆ విషయాన్ని యువతి అన్న అరుణ్ మనసులో పెట్టుకొని.. ఎలాగైనా సుదీప్‌ని హతమార్చాలని పతకం పన్ని, సమయం కోసం వేచి చూశాడు. బుధవారం ఉదయం తాండాలోని మొబైల్ షాపు వద్ద సుదీప్ ఉన్న విషయాన్ని తెలుసుకుని అరుణ్ అక్కడికి వెళ్లి.. వెంట తెచ్చిన గొడ్డలితో సుదీప్ తలపై నరికాడు. గమనించిన స్థానికులు సుదీప్‌ను జహీరాబాద్ ప్రభుతాస్పుపత్రికి తీసుకెళ్లగా అప్పటికే మతి చెందినట్టు వైద్యులు నిర్ధారించారు. కాగా నిందుడు అరుణ్ పరారీలో ఉన్నట్టు పోలీసులు తెలిపారు.

అన్ని శాఖల సమన్వయంతోనే మైనార్టీల అభివృద్ధి

- మైనార్టీల సంక్షేమంపై దృష్టిసారించాలి సయ్యద్ షెహజాది



నవతెలంగాణ-సంగారెడ్డి

మైనార్టీ సంక్షేమ కార్యక్రమాలు పూర్తి స్థాయిలో అమలుకు ఆయా శాఖలు సమన్వయంతో పని చేయాలని జాతీయ మైనారిటీ కమిషన్ సభ్యురాలు సయ్యద్ షెహజాది సూచించారు. బుధవారం జిల్లా పర్యటనకు విచ్చేసిన జాతీయ మైనారిటీ కమిషన్ సభ్యురాలు కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో ప్రధానమంత్రి 15 సూత్రాల కార్యక్రమం, కేంద్ర, రాష్ట్ర పథకాల అమలు తీరుపై సంబంధిత శాఖల జిల్లా అధికారులతో సమీక్ష నిర్వహించారు. జిల్లాలో మైనారిటీల స్థితిగతులు, వారి జనాభా గురించి, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ పదకాల అమలు ద్వారా చేకూరుస్తున్న లబ్ది గురించి ఆయా శాఖల అధికారులను అడిగి తెలుసుకున్నారు. ముఖ్యంగా కేజీబీవీ లు, మైనారిటీ గురుకులాలు, చదువుతున్న విద్యార్టుల సంఖ్య,మదర్సాలు, అందుతున్న సదుపాయాలు, మధ్యాహ్న భోజనం, కెసిఆర్ కిట్, అంగన్వాడి కేంద్రాలలో ఇస్తున్న న్యూట్రిషన్ ఫుడ్, బస్తీ దవాఖానాలు, మైనారిటీలకు ఏర్పాటు చేసిన శిక్షణ కేంద్రాలు, షాదీ ముబారక్ లో మైనార్టీలకు చేకూరిన లబ్ధి, బ్యాంకుల ద్వారా మైనార్టీలకు అందించిన వివిధ రుణాలు, రాష్ట్ర, కేంద్ర ప్రభుత్వాల పథకాల అమలు, తదితర అంశాలపై ఆయా శాఖల అధికారులను ఆరా తీసారు. మైనారిటీ రెసిడెన్షియల్ విద్యా సంస్థలు, మహిళా శిశు సంక్షేమం, జిల్లా గ్రామీణ అభివృద్ధి సంస్థ, మెప్మా, విద్యా, బ్యాంకింగ్, రెవిన్యూ, తదితర శాఖల ద్వారా మైనారిటీలకు అమలు చేస్తున్న కార్యక్రమాలు, వాటి ప్రగతి గురించి ఆయా శాఖల అధికారులు కమిషన్ సభ్యురాలి దృష్టికి తెచ్చారు. ఈ సందర్భంగా షహెజాది మాట్లాడుతూ మైనారిటీల సంక్షేమం కోసం ఉద్దేశించిన కార్యక్రమాలు పూర్తి స్థాయిలో అమలు జరిగేలా ఆయా శాఖల అధికారులు అంకితభావంతో పని చేయాలని సూచించారు. మైనారిటీల అభ్యున్నతి కోసం కృషి చేయాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు. స్వయం సహాయక సంఘాలకు సంబంధించి వారు చేస్తున్న ఆయా పనులలో వృత్తి నైపుణ్య శిక్షణలు ఇవ్వడంపై దృష్టి సారించి నాణ్యమైన శిక్షణ అందించేలా చర్యలు తీసుకోవాలన్నారు. నిరుద్యోగ యువతకు అందిస్తున్న ఉచిత శిక్షణ కేంద్రాల్లో అధిక సంఖ్యలో యువతులు శిక్షణ పొందేలా ప్రోత్సహించాలన్నారు. విద్య, ఉపాధి రంగాలకు సంబంధించి మైనారిటీలకు విరివిగా రుణాలు అందజేయాలన్నారు. విదేశాల్లో ఉన్నత విద్యాభ్యాసం కోసం ప్రభుత్వం పెద్ద ఎత్తున ఆర్థిక తోడ్పాటును అందిస్తున్నందున, అర్హులైన వారందరు సద్వినియోగం చేసుకునేలా విస్తృత ప్రచారం చేయాలని సూచించారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అందిస్తున్న వివిధ పథకాల గురించి, వాటిని ఎలా సద్వినియోగం చేసుకోవాలనే దానిపై వారికి అవగాహన కల్పించేందుకు తగు చర్యలు చేపట్టాలని ఆదేశించారు. మైనారిటీల కోసం ఉద్దేశించిన సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలు వంద శాతం అమలయ్యేలా చూడాలన్నారు. ఆయా శాఖల అధికారులు అంకితభావంతో, సమర్ధవంతంగా పని చేస్తే ఎంతో మంది జీవితాలలో మార్పు వస్తుందని, ప్రభుత్వాల లక్ష్యం కూడా నెరవేరుతుందని అన్నారు. సమాజానికి మేలు చేకూర్చే పదవులలో ఉన్న వారు సేవా దృక్పథంతో విధులు నిర్వర్తిస్తే ఎంతో సంతృప్తి లభిస్తుందని అన్నారు. రాష్ట్ర కేంద్ర ప్రభుత్వాలు అమలు చేస్తున్న స్కీమ్స్ పై ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. ప్రధాన మంత్రి 15 అంశాల కార్యక్రమం మీద అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని,ప్రతి మూడు మాసాలకు ఒకసారి కమిటీ మీటింగ్ నిర్వహించాలన్నారు. అనంతరం కలెక్టరేట్లో ఏర్పాటు చేసిన ఓటర్ అవగాహన కేంద్రాన్ని ఆమె సందర్శించి, ఓటు వేసి పరిశీలించారు. ఈ సమీక్షా సమావేశంలో జిల్లా ఎస్పీ రమణ కుమార్, అదనపు కలెక్టర్ వీరారెడ్డి, జిల్లా రెవెన్యూ అధికారి నగేష్, జిల్లా మైనారిటీ సంక్షేమ శాఖ అధికారి అరుణ్ కుమార్, జెడ్పి సీఈఓ ఎల్లయ్య, జిల్లా పరిశ్రమల శాఖ అధికారి ప్రశాంత్ కుమార్, డీఆర్‌డిఓ శ్రీనివాసరావు, సంక్షేమ శాఖ అధికారి పద్మావతి, డీఎంఅండ్‌హెచ్ ఓ డాక్టర్ గాయత్రీ దేవి, మెప్మా పిడి గీత, వివిధ శాఖల జిల్లా అధికారులు,ఆర్డీఓలు రవీందర్ రెడ్డి, వెంకారెడ్డి,పాండు, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

కనీస వేతనాల్లేకుండా కార్మికులు బతికేదెట్టా?

- పంచాయతీ కార్మికుల సమస్యలను వెంటనే పరిష్కరించాలి
- కేవీపీఎస్ ఆధ్వర్యంలో రౌండ్ టేబుల్ సమావేశం



నవతెలంగాణ-సంగారెడ్డి

కనీస వేతనాల్లేకుండా గ్రామపంచాయతీ కార్మికులు ఎలా బతుకుతారని పలువురు నాయకులు ప్రశ్నించారు. వెంటనే వారి సమస్యలను పరిష్కరించి.. సమ్మెను విరమింపజేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. పంచాయతీ కార్మికుల సమ్మెకు సంఘీభావంగా సంగారెడ్డిలోని సుందరయ్య భవన్‌లో కుల వివక్ష వ్యతిరేక పోరాట సంఘం (కేవీపీఎస్) ఆధ్వర్యంలో ఆ సంఘం జిల్లా అధ్యక్షుడు పి.అశోక్ అధ్యక్షతన బుధవారం రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కేవీపీఎస్ రాష్ట్ర ఉపాధ్యక్షులు అతిమేల మాణిక్, ప్రముఖ దళిత సంఘాల సీనియర్ నాయకులు అనంతయ్య, అంబేద్కర్ యువజన సంఘం జిల్లా అధ్యక్షుడు దుర్గాప్రసాద్, సిఐటియు జిల్లా కార్యదర్శి సాయిలు, ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షులు మహేష్, జన జాగతి అధ్యక్షులు కష్ణ ప్రభుత్వాన్ని మాట్లాడుతూ.. రాష్ట్రంలో 12,769 గ్రామాల్లో ప్రజలకు ప్రత్యక్ష సేవలందిస్తున్న 50వేల మంది పంచాయతీ సిబ్బంది కనీస వేతనాల అమలు కోసం గత 14రోజులుగా సమ్మె చేస్తున్నప్పటికీ.. ప్రభుత్వం ఏమాత్రం స్పందించకుండా వివక్ష పాటించడం తగదన్నారు. ఎండా, వాన, చలి అనే తేడా లేకుండా వారు సేవలు అందిస్తున్నారని గుర్తు చేశారు. పంచాయతీ కార్మికుల్లో నూటికి 80శాతం మంది దళితులు కావడం వల్లే వివక్ష కొనసాగిస్తున్నారా అని ప్రశ్నించారు. కరోనా వంటి క్లిష్ట పరిస్థితుల్లో ప్రాణాలు పణంగా పెట్టి ప్రజలకు సేవలందించారన్నారు. మోడీ స్వచ్ఛ భారత్, కేసీఆర్ పచ్చదనం, పరిశుభ్రత పిలుపును చిత్తశుద్ధితో అమలు చేశారన్నారు. వేతనాల పెంపు కోసం ప్రభుత్వం రూపొందించిన జీవో నెంబర్ 60 ప్రకారంగా గ్రామపంచాయతీ సిబ్బందికి రూ.19వేలు ఇవ్వాలన్నారు. ప్రమాదవశాత్తు కార్మికులు మరణిస్తే.. కనీస ఎక్స్‌గ్రేషియో ఇవ్వలేకపోవడం సిగ్గుచేటన్నారు. పీఎఫ్, ఈఎస్ఐ సౌకర్యం కల్పించకపోవడం అన్యాయం కాదా? అని ప్రశ్నించారు. కేంద్రంలో అధికారంలో ఉన్న బీజేపీ సర్కార్ కార్మికుల హక్కులను కాలరాసే చర్యలకు ఒడిగట్టిందన్నారు. బీజేపీ నేతలు నేడు టెంట్ల వద్దకు వచ్చి మద్దతు ఇచ్చినప్పటికీ.. అసలు కార్మికుల ప్రాథమిక హక్కులను లేకుండా చేస్తున్నది బీజేపీ అనేది మరువకూడదన్నారు. తక్షణమే రాష్ట్ర ప్రభుత్వం గ్రామపంచాయతీ కార్మికుల జేఏసీని చర్చలకు ఆహ్వానించి సమస్యలు పరిష్కరించి సమ్మెను విరమింప చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో కల్లుగీత కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి రమేష్, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా నాయకులు నర్సింలు, సమతా సైనిక్ దళ్ నాయకులు బసవరాజ్, స్వేరో జిల్లా నాయకులు అనిల్ అంబేద్కర్ యువజన సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి రమని అశోక్, నాయకులు ప్రవీణ్ కుమార్ పోతురాజు పవన్, కేవీపీఎస్ జిల్లా ఉపాధ్యక్షులు శివకుమార్, సహాయ కార్యదర్శి ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.

చెరకు రైతుల బకాయిలు వెంటనే చెల్లించాలి

- రైతు సంఘం రాష్ట్ర నాయకులు గొల్లపల్లి జయరాజు
- అసిస్టెంట్ షుగర్ కేన్ కమిషనర్‌కు వినతి

నవతెలంగాణ-సంగారెడ్డి

జహీరాబాద్ చెరకు రైతుల బకాయిలు వెంటనే చెల్లించే విధంగా చర్యలు తీసుకోవాలని తెలంగాణ రైతు సంఘం రాష్ట్ర నాయకులు గొల్లపల్లి జయరాజు ప్రభుత్వాన్ని కోరారు. బుధవారం రైతు సంఘం ఆధ్వర్యంలో అసిస్టెంట్ షుగర్ కేన్ కమిషనర్ రాజ శేఖర్‌కి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా జయరాజ్ మాట్లాడుతూ.. జహీరాబాద్ ట్రైడెంట్ షుగర్ పరిశ్రమ పరిధిలో చెరకు రైతులకు బకాయి ఉన్న సుమారు రూ.10 కోట్లను వెంటనే చెల్లించే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. జహీరాబాద్ ప్రాంతంలో సుమారు 8 లక్షల టన్నుల చెరుకు పంట పండుతున్నదని.. తిరిగి పరిశ్రమను తెరిపించాలన్నారు. కార్మికులకు సంబంధించిన వేతన బకాయిలు కూడా చెల్లించాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో రైతు సంఘం జిల్లా అధ్యక్షులు కె. రాజయ్య, ఉపాధ్యక్షులు యస్ మల్లారెడ్డి, రైతులు ప్రవీణ్ రెడ్డి, లక్ష్మయ్య తదితరులు పాల్గొన్నారు.

